# నిన్ను నీవు సంస్కరించుకో



డా॥ కె. రామారావు



# I AM that I AM

# నిన్ను నీవు సంస్కరించుకో


సేకరణ :

**డా॥ K. రామారావు**

Cell: 9441021025, 8374387759



**శ్రీ రమణ క్షేత్రం**

జిన్నూరు, W.G. Dist.

534265

# నిన్ను నీవు సంస్కరించుకో

మొదటి ముద్రణ : సెప్టెంబర్, 2020

## సద్గురు శ్రీ నాన్నగారి
## 86వ జయంతి సందర్భంగా

ప్రచురణ :
**శ్రీ నందిని గ్రాఫిక్స్**
28-20-10/1, జానీ స్ట్రీట్,
అరండల్‌పేట, విజయవాడ-2.
సెల్ : 94404 67653

# మనవి

సద్గురు శ్రీ నాన్నగారు దేశ విదేశాలలో జ్ఞాన యజ్ఞం పేరుతో ఎందరి హృదయాలలోనో జ్ఞానజ్యోతిని వెలిగించి, సుదీర్ఘ ఆధ్యాత్మిక ప్రయాణ ముతో జ్ఞానామృతాన్ని కురిపించి, ప్రేమామృతాన్ని పంచి, ఆత్మానందాన్ని రుచి చూపించిన ఆ మహనీయుని 86వ జయంతి సందర్భములో మిమ్మల్ని మీరు సంస్కరించుకుని తరించాలనే ఆశతో...

మీ సోదరుడు

డా॥ **K. రామారావు**

# విషయ సూచిక


01. కృపా పోరాటం ........ 5

02. మాటే మంత్రము ........ 10

03. సద్గురు శ్రీనాన్నగారు ........ 20

04. బ్రహ్మము ........ 27

05. జ్ఞాని ........ 37

06. గురువు ........ 42

07. జీవలక్షణాలు ........ 48

08. విచారణ మార్గము ........ 54

09. మరణము ........ 71

10. నిజము తెలియాలంటే? ........ 77

11. మనిషి పాపము చేయకూడదనుకున్నా - పాపము ఎందుకు చేస్తాడు? ........ 87

12. ఎవరంటే స్వామికి ఇష్టం? ........ 111

# 1. కృపా పోరాటం

నాకు బాహ్యమైన ఆడంబరాలు గాని, అండ దండలు గాని, స్నేహాలు గాని ఏమీ లేవు. కానీ నాకు ఒక రోగం ఉంది. ఖాళీగా ఉన్నప్పుడు ఆశ్రమాల చుట్టూ తిరిగే అలవాటుంది. ఎక్కడకు వెళ్ళినా ప్రతీచోట చందాలు - సంతర్పణల గోలే!

ఇంతలో ఒక మిత్రుడు తారసిల్లి చెప్పాడు - నీ గురించి! అడగకుండానే అందరికీ నీవు అన్నీ ఇచ్చే స్వామివనీ! కోపమనే గుణమే లేని అజాతశత్రుడవనీ! చిరునవ్వులతో చింతలు బాపే చిన్మయ స్వరూపుడవనీ! నీ ప్రతిమాట ఒక మహామంత్రమేననీ! ఎదుటివారి మనస్సులోని బరువులు - భారాలు వారికి కూడ తెలియకుండానే తీసివేస్తావనీ! మౌనంతోనే అహంకారాన్ని కూల్చి నీ అంతటి వాడిని చేసి ఆత్మ సింహాసనం మీద అధిష్ఠింపజేస్తావనీ! గుండెలోని మోయలేని బండరాళ్ళను చిరునవ్వుతో చిటికెలో దించివేస్తావనీ! కన్నతల్లిని మించిన ప్రేమను కురిపిస్తావని చెప్పారు.

అలాగైతే ఇప్పుడే నిన్ను చూడాలనిపించింది. వెంటనే నీ దగ్గరకు వచ్చాను. కళ్ళారా చూసాను. నిన్ను చూడటానికి రెండు కళ్ళేకాదు - మరో రెండు కళ్ళు ఉంటే ఎంత బాగుండని పించింది. ఏం చూసాను? నీవూ సంతర్పణలే చేస్తున్నావు! ఏమిటా సంతర్పణలు? అన్న సంతర్పణలు కాదులే - జాతి మత కుల లింగ బేధము లేకుండా నిన్ను చూడటానికి వచ్చిన

ప్రతీవారికి జ్ఞాన సంతర్పణ చేస్తున్నావు! ప్రేమ ప్రసాదాన్ని పంచిపెడుతున్నావు! కరుణామృతాన్ని కురిపిస్తున్నావు! శాంతి సాగరంలో ముంచి కాలాన్ని మరిపిస్తున్నావు! నీ దర్శనంతో నా జన్మ తరించినదయ్యా!

అందుకే నా అహంకారాన్ని నీకు ఆహారంగా అర్పించాలని నిర్భయంగా నీ చెంతకు వచ్చాను. నీవు రమ్మనలేదులే! నాకై నేనే వచ్చాను - ఎందుకు? ఆపరేషన్ చేసేముందు బాధ తెలియకుండా మత్తుమందు ఇచ్చినట్లు సాధనల పేరుతో శ్రమ పెట్టకుండా నా అహంకారాన్ని తీసివేస్తావని ఆశతో వచ్చాను. కానీ నీవేం చేశావు? నీ కళ్ళతో నాకు గేలం వేశావు! నీ చూపుల మైకంలో పెట్టి నా కొంప కూల్చావు! గుట్టుగా కొంపలో ప్రశాంతంగా బ్రతికే నన్ను వీధిలోకి ఈడ్చావు. అంతటితో ఊరుకున్నావా? తేనెలో పడ్డ ఈగలాగ బాగా చిక్కాడు - ఇంకెక్కడికి పోతాడులే అనుకున్నావు? అందుకే మాటామంతీ లేకుండా కళ్ళు మూసుకుని మౌనంగా రాయిలాగా కూర్చున్నావు! ఇలా చేయడం నీకు న్యాయమేనటయ్యా? మోసగాడివని ఈ లోకం నిన్ను నిందిస్తుందయ్యా! ఈ నింద నీకు రానీయక - పెనుతుఫానులో నడిసముద్రములో నావికుడు లేక చిక్కుకున్న నావలాగా నా బ్రతుకును నట్టేట ముంచకయ్యా! నన్నే లక్ష్యంగా పెట్టుకుని నీ అనుగ్రహాన్ని నాపై కురిపించి నన్ను రక్షించవయ్యా!

నేను పూర్తిగా పతనమైపోయిన తరువాతనే నన్ను

రక్షించమని ప్రార్థించే పెద్దమూర్ఖుడినేలే - కాదనను. కానీ నీవు అసలు కోపమనే గుణమే లేనివాడివి కదయ్యా! ముక్కు వంకర ఉన్నవాడి చేతికి అద్దమిచ్చి నీ ముక్కు చూసుకోమన్నట్లు నన్ను హేళన చేయక కరుణించవయ్యా! పక్వానికి రాక పాడైన పండును నీవు మాత్రం ఏం చేసుకుంటావయ్యా? తేనెటీగకు పూవును వికసింపచేసే శక్తిలేక పూవు వికసించేవరకు ఎదురు చూస్తుంటుంది. కానీ నీవు తేనెటీగలాగ శక్తిహీనుడవు కాదు గదయ్యా? నాలో సద్గుణాలు లేనిమాట నిజమేలే - కాదనను! కానీ నీవు సకల సద్గుణ సంపన్నుడివి కదా? నీ కళ్యాణ గుణాలతో నన్ను అలంకరించి యేలుకోవయ్యా! నా మనస్సును మృదువైన పూలపాన్పుగా చేసుకుని నీవు నేను ఒక్కటై రేయిపగలు లేని బట్టబయట నన్ను రమింపజేయ రావయ్యా!

పంచేంద్రియాలనే తుంటరులు నన్ను బయటికి లాగి పాడు చేస్తుంటే - నీవు రక్షింపగల శక్తి ఉండి కూడా అలా చూస్తూ ఊరుకుంటే ఇది నీకు న్యాయమటయ్యా? నీవేదో దేవుడివనీ, నన్నేదో ఉద్ధరిస్తావనీ నాకై నేను వెదుక్కుంటూ ఎంతో శ్రమపడి నీ చెంతకు వస్తే ప్రేమతో నన్ను ఆదరించి హృదయానికి హత్తుకోకుండా నిర్గుణస్థితిలో నిలిచిపోయావేమి టయ్యా? సత్యము తెలియకుండా, జ్ఞానము కలుగకుండా నా తనువు పడిపోతే నాకు జన్మ వచ్చినందుకు లాభమేముం దయ్యా? మాయా విషము నా బుర్రకు పట్టి నా బుద్ధిని నాశనము చేయకముందే, నీ జ్ఞానాగ్నిలో నా అజ్ఞానం కాలి

బూడిద కాకముందే, జన్మపరంపరలకు మూలమైన నా చిజ్జడగ్రంథిని పూర్తిగా కత్తిరించి కాపాడవలసిన బాధ్యత నీకు లేదా? మా కంటికి వెలుగువు నీవై కన్ను లేకుండానే మాలోని దోషాలను చూడగలిగిన నీకు తెలియనిది ఏముందయ్యా? నా అజ్ఞానము పూర్తిగా అంతమయ్యే వరకు నీ కృపను నా పైన కురిపించక పోతే నేను చెప్పుకోవటానికి నీవు తప్ప నాకు వేరే దిక్కు ఎవరున్నారయ్యా?

నిన్నూ, నన్నూ వేరు చేస్తున్న ప్రకృతి మైకంలో పడి కొట్టుకుపోతున్న నన్ను నీవు అంతకంటే పెద్దభూతమై పట్టుకొని నీ పిచ్చిలో నన్ను పెట్టావు! నీ మీద పిచ్చిని తీసివేయకుండా నీవు "ఛీ" అని ఇప్పుడు నన్ను దూరంగా త్రోసివేస్తే నీకోసం విలపిస్తూ నా తనువు కరిగి కన్నీటేరై నశించిపోతానయ్యా! నాకై నేను వచ్చానని చులకన చేసి విడిచిపెట్టక నా హృదయములో నాట్యము చేయుట మాని అలా బాహ్యంగా తారాడుతూ నన్ను నీలో కలుపుకోకపోతే నేను నశించి పోతానయ్యా! ఈ ఇహపరలాభహీనుని అప్పుడు నీవేం చేసుకుంటావయ్యా! నీ అమృత హస్తంతో నన్ను తాకి పక్వము చేసి నీ స్వరూపములో కలుపుకోకపోతే నిన్ను విడిచి నేను బ్రతకలేనయ్యా!

ఉన్నది నీవు ఒక్కడివేననీ, మేమంతా సున్నేననీ, ఈ సున్నలు అన్నీ కాల గర్భంలో కలిసిపోతాయనీ నాకు తెలుసు. కానీ ఈ నిజం నా బుద్ధికి అందినదే కానీ - నా గుండెకు

అందలేదుగా తండ్రీ? బహుశా నా గుండె తలుపు తెరచుట నీవు మరచిపోయావేమో? భక్తులందరూ తమ హృదయాలలో నిన్ను చూసుకుని శాంతిని పొందుతున్నారట కదయ్యా? కానీ ఆత్మవంచన చేసుకొంటూ భ్రమలో నేను బ్రతకలేను తండ్రీ! **35** సం॥లుగా నిన్ను చూసుకొంటూ నీ చల్లని చూపులలో నన్ను నేనే మరచిపోయి బ్రతికాను. నిన్ను చూడకుండా బ్రతకవలసిన దుర్దినము నాకు రాకూడదని, నీకంటే ముందే నన్ను తీసుకు పొమ్మనే కదయ్యా నోరు తెరచి నిన్ను కోరుకున్నది? నీవూ నేను వేరువేరుగా ఉన్నంతకాలము నాకు ఈ వేదన తప్పదుగా తండ్రీ? ఈ బుద్ధులన్నీ కాలి, హద్దులన్నీ దాటి, నీవు నేను ఏకమయ్యేది ఎప్పుడో? ఆ రోజు ఎప్పుడో?

# 2. మాటే మంత్రము

1984వ సంవత్సరము ఏప్రియల్ 19వ తేదీన తొలిసారి నేను శ్రీ నాన్నగారిని దర్శించుకున్నాను. ఆనాటి మధుర సంఘటన నా జీవిత గమ్యాన్నే మార్చివేసింది. నాలోని దుఃఖాన్ని ఆర్పివేసింది. ఈనాడు ఏది జరిగినా - నా కళ్ళలో ఆనంద బాష్పాలు తప్ప - కన్నీరు నన్ను తాకలేకపోతుంది.

ఆనాటి మన తండ్రి ప్రతీ మాట నా జీవితంలో మరపురాని ఒక మహా మంత్రమే! ఒక ఉపదేశమే! ఆ అమృత వాక్కులను మీ ముందు ఉంచి - మీ అందరి దుఃఖములో పాలుపంచుకొని మీ కన్నీరు తుడవాలనే ఆశతో ఈ చిన్ని ప్రయత్నము -

1984 ఏప్రియల్ 19వ తేదీ రాత్రి 8 గంటలకు తొలిసారిగా నేను శ్రీనాన్నగారి దివ్యదర్శనం చేసుకున్నాను. పరిచయాలు, కుశలప్రశ్నల తరువాత శ్రీనాన్నగారు చిరునవ్వులతో నా కళ్ళలోకి చూసారు. ఒకసారి కళ్ళు మూసుకుని, మరల కళ్ళు తెరచి నా ముఖములోకి చూసారు. ప్రశాంతంగా ఉన్న ఆయన కళ్ళు ఒక్కసారిగా తళుక్కున వెయ్యి కేండిల్ బల్బు కన్నా కాంతిగా మెరిసాయి. అప్పటివరకు మాములుగా ఉన్న ఆయన రెండు చెవులు లేడి చెవుల్లా నిక్కబొడుచుకున్నాయి. అలా చెవులు కదలడం నా జీవితంలో నేనెప్పుడూ ఎవరికీ చూడలేదు. అప్పటివరకు చిరునవ్వులు చిందిన ఆయన ముఖం గంభీరంగా మారిపోయింది. రెప్పవేయకుండా కళ్ళు

పెద్దవి చేసుకుని సూటిగా, తీక్షణంగా నా కళ్లల్లోకి చూస్తూ ఉండిపోయారు.

ఒక్కసారి నా గుండె ఝుల్లుమనిపించి, ఒళ్ళు జలదరించింది. రోమాలు గగుర్పొడిచాయి. ఆ కళ్ళు మామూలు కళ్ళు కాదు. ఆ చూపు మాములు చూపు కాదు. నన్నేదో మాయ చేసి మైకంలో పెట్టి నా జీవితం మీద దాడి చేస్తున్నారనిపించింది. నిజం చెప్పాలంటే నాకు కొంచెము భయము వేసింది. దెయ్యం పట్టిన వాడిలా అలా చూస్తారేమిటి అనిపించింది. వివేకానందస్వామి జీవితంలో జరిగిన ఒక సంఘటన నాకు గుర్తు వచ్చింది. శ్రీ రామకృష్ణుడు కాలి స్పర్శతో నరేంద్రుడిని మైకంలో పెట్టి మాయ చేసినట్లు ఈయన కూడా నన్నేదో మాయ చేస్తున్నాడనిపించింది. ఆ కంటి చూపుకు బండరాళ్ళు కూడా వెన్నముద్దల్లా కరిగిపోతాయనిపించింది.

కొంతసేపు నిశ్శబ్దం! గంభీరమైన మౌనం! ఆ మౌనం కూడా ఏదో మాటలాడుతున్నట్లుంది. నా మనస్సులో ఏవేవో ఆలోచనలు. గ్రౌండును ప్రిపేర్ చెయ్యకుండా భూమిలో విత్తు నాటినా అది మొక్క మొలవదుగా? అందుకే మౌనంగా కంటిచూపుతో అప్పటి వరకు నా గుండెను పక్వము చేసి, నా గుండెలో గూడు కట్టుకున్న బరువును బయటికి తీయటానికి నన్ను కుదుపుతున్నారని అర్థమైంది.

"డాక్టరుగారూ! ఏమైనా అడగాలని వచ్చారా?" అని అడిగారు.

"ఔను నాన్నగారూ! ఆర్థికంగా మాకు స్థోమతున్నా కుటుంబ కలహాల వల్ల నా భార్య ఉద్యోగం చేసి నన్ను డాక్టరు చదివించింది. చదువు పూర్తై నా భార్య కష్టానికి కృతజ్ఞత తీర్చుకుందామనుకున్న తరుణంలో నా భార్యకు తీవ్రమైన గుండెనొప్పి వచ్చి డాక్టర్లు బ్రతకదని చెప్పారు. కానీ బ్రతికింది. అప్పటినుంచి డబ్బులతోనే బ్రతికిస్తున్నాను. జీవశ్చవంలా బ్రతికే నా భార్యను చూస్తే నేను మృత్యువుతో కాపురం చేస్తున్నట్లు అనిపించేది. మరోసారి నొప్పివస్తే నా భార్య బ్రతకదని నాకు తెలుసు. మరణం మమ్మల్ని వేరుచేయకముందే నా గుండె బాధను దించుకోవాలనే ఆశతో మీ దర్శనానికి వచ్చాను నాన్నగారూ..." అని నా గుండె బరువును దించుకున్నాను.

"గుండెల్లో ఎంత బాధను దాచుకున్నారు డాక్టరుగారూ! మీరు దుఃఖాన్ని దాటిపోవాలంటే ఒక చిన్న చిట్కాను చెప్తాను. అది మీకు అర్థమైతే ఇప్పుడే చిరునవ్వుతో ఇంటికి తిరిగి వెళ్ళిపోతారు."

ఆయన మాటల మీద నాకు నమ్మకం కుదరలేదు. అయినా మర్యాద కోసం మౌనంగా ఉండిపోయాను.

"డాక్టరుగారూ! మీరూ, మీ భార్యే కాదు..... నిజానికి ఏ జీవుడూ అసలు పుట్టనే లేదు! పుట్టానని భ్రమపడుతున్నాడు... అందుకే చస్తానని భయపడుతున్నాడు"

"అదేమిటి నాన్నగారూ? నేను పుట్టాను - మీ ముందే ఉన్నానుగా?" అన్నాను తడబడుతూ...

నా అమాయకత్వానికి నాన్నగారు చిన్న చిరునవ్వు నవ్వి "ఇదేమిటి డాక్టరు గారూ?" అని చేతికి ఉన్న నా వాచీని చూపించారు.

"నా వాచీ నాన్నగారూ" అన్నాను.

"అంటే ఆ వాచీకి మీరు యజమాని అన్నమాట. అంతేగాని ఆ వాచీయే మీరు కాదు గదండీ?" అన్నారు.

"ఔను నాన్నగారు".

"మరి ఇదేమిటి?" అని నా చేయి పట్టుకున్నారు.

ఆ స్పర్శకు నా గుండెల్లో ఏదో కుదుపు వచ్చినట్లు శరీరం జలధరించింది. ఆ స్పర్శే నా జన్మకు శాపవిమోచనకై ఆ తండ్రి ముహూర్తం పెట్టాడని ఆనాడు నాకు తెలియదు.

ఏదో అయోమయంలో "నా చేయి నాన్నగారూ" అన్నాను.

"అంటే ఆ వాచీకి మీరు యజమాని ఎలాగో....ఈ చేతికి కూడా మీరు యజమానే గాని ఈ చేయే మీరు కాదు కదండీ? మరి ఈ చేయి నాది అని చెప్పే యజమాని ఎవరంటారు? ప్రతివాడు నా కాళ్ళు, నా కళ్ళు, నా ముఖం, నా గుండె, నా తల, నా శరీరం అంటాడే గానీ.... అవే నేనని చెప్పడం లేదేమిటండీ? అంటే వీటి అన్నింటికి వేరుగా ఒకడు ఉన్నాడన్నమాట! వాడెవడు? జాగ్రదవస్థలో చిన్నమాటంటే తిరగబడి రెచ్చిపోయి రంకెలేసే ఆ పెద్దమనిషి గాఢనిద్రలో ఒక

తాపు తన్నినా తిరగబడడేమండీ? పోనీ నిద్రలో వాడు లేడా అంటే - నిద్ర లేవగానే రాత్రంతా నాకు సుఖంగా నిద్రపట్టిందని సిద్ధమౌతున్నాడు కదండీ? మరి గాఢ నిద్రలో ఆ పెద్దమనిషి ఎక్కడికి పోతున్నాడంటారు?-

"డాక్టరుగారూ! ప్రతివాడు 'నేను-నాది' అని గుండెల మీద కుడివైపు క్రింది భాగములో చేయి వేసుకుంటాడు - మీరు ఎప్పుడైనా గమనించారా? అంటే ఆ నేనుకు మూలం అక్కడనే ఉందన్నమాట. దానినే ఆధ్యాత్మిక హృదయం అంటారు. అది మన దేహంలో ఉన్నమాట నిజం - కాని అది మన దేహంలో ఒక భాగము మాత్రము కాదు. అందుకే మన దేహాన్ని కోసి చూస్తే అది మన కళ్ళకు కనిపించదు. దేహము మరణించినప్పుడు అది మరణించదు - దేహమును కాల్చినప్పుడు కట్టెలలో అది కాలదు!-

"ఆ హృదయములో ఆత్మ(బ్రహ్మము) నిరంతరము "నేను నేను" అనుచు స్వయముగా ప్రకాశిస్తున్నది. అది సత్ చిత్ ఆనంద స్వరూపము! అది అనంతము, అఖండము, అమరము, అజరము, అద్వితీయము, అనిర్వచనీయము, అవ్యయము, అభవము, అభౌతికము, కాలాతీతము, గుణాతీతము, ఊహాతీతము. దానిని గాలి కదుపలేదు - నిప్పు కాల్చలేదు - నీరు తడపలేదు. అది మనకంటే వేరుగా ఎక్కడో లేదు - మన స్వరూపం గానే ఉంది - మన హృదయములో ప్రత్యక్షముగా ప్రకాశిస్తున్నది.-

"చైతన్యమైన ఆత్మను - జడమైన దేహమును కలిపి ముడిపెడుతూ రెండింటికి మధ్యన మిధ్యానేను" ఒకటి పుట్టుచున్నది. దానినే 'చిజ్జడ గ్రంథి' అని, జీవుడని, అహంకారమని, కారణ శరీరమని అంటారు. ఆత్మగతమైన నేనులో నుంచి - నీటిలో నుంచి బుడగ వచ్చినట్లు దేహపరిమితమైన నేను పుట్టి, అది దాని పుట్టుకను మరచిపోయి స్వతంత్రముగా వ్యవహరిస్తున్నది, స్వయంభువుడిని అనుకుంటుంది. ఈ "నేను" అను తలంపే తొలి తలంపు - మూల తలంపు - పునాది తలంపు!

ఈ మూల తలంపునకే మిగిలిన అన్ని తలంపులు వచ్చుచున్నవి. ఆ తలంపుల మూటే మనస్సు! మూల తలంపును ఆధారము చేసుకొనే ఈ సృష్టి అంతా ఆధారపడి ఉంది. జగత్ జీవేశ్వరులు కూడ ఈ మనస్సు యొక్క సృష్టే! మనస్సు ఉంటే అంతా ఉంది - మనస్సు లేకపోతే ఈ సృష్టే లేదు! -

"గాఢ నిద్రలో దేహపరిమితమైన నేను దాని పుట్టుచోటైన ఆత్మలో అణిగిపోతుంది. ఆత్మలో సుఖముంది. రాత్రంతా గాఢనిద్రలో ఆ సుఖ సముద్రములో ఈదులాడుతుంది.

"అంతలో మెలకువ వస్తుంది! మరల నేను అను తలంపు పుడుతుంది - మీ సంసారమంతా గుర్తుకు వస్తుంది - దుఃఖాన్ని తీసుకు వస్తుంది.

"సంసారమంటే ఏమిటి? మనిషి నేను చేస్తున్నానని ఏ పని చేసినా - ఆ పని వాసనగా మారుతుంది. నేను

చేస్తున్నాననే కర్తృత్వము ఉన్నంతకాలము - జన్మవచ్చి తీరుతుంది - దేహము వచ్చి తీరుతుంది. దేహము వచ్చినదంటే - మరణము వచ్చి తీరుతుంది.

"మరణమంటే మనిషి ఎందుకు భయపడు తున్నాడు? చనిపోతే మరల ఈ దేహం కనబడదేమో, సంసారం కనబడదేమో - అదేగా మీ భయం? కానీ ఎప్పుడో మరణం దాకా ఎందుకండీ? ప్రతిరోజూ మీ గాఢనిద్రలో మీ దేహంతోటి, సంసారం తోటి మీకు సంబంధము తెగిపోతూనే ఉందిగా? మంచం మీద పడుకున్నారో - నేలమీద పడుకున్నారో కూడా మీకు తెలియదుగా? అందరూ నిద్రను కోరుకుంటున్నారుగా? అంటే నిద్ర లేవగానే మీ సంసారమంతా మీ కళ్ళముందే కనిపిస్తుంది. ఇదీ మీ అనుభవం!

"కానీ నిజానికి నిద్ర ఎటువంటిదో చావు కూడా అటువంటిదే! మరణమంటే మార్పు! ఒక శరీరంలోనుంచి మరో శరీరంలోకి మారడం. మనిషికి మోహం ఉన్నంతకాలం పాపం చేసి తీరతాడు. మంచి చేసినవాడికి సద్గతి - చెడు చేసినవాడికి దుర్గతి అనుభవించి తీరవలసినదే. అనుభవించ టానికి మరల దేహం వచ్చి తీరవలసినదే. దేహమంటూ వస్తే చావుపుట్టుకలు తప్పవు. ఇది దేవుని చట్టం! గురువు సహాయం లేకుండా ఏ జీవుడు దేవుని చట్టాన్ని అతిక్రమించలేడు! జనన మరణ చక్రములో నుంచి బయటపడలేడు. గురుకృప కావాలంటే - శరణాగతి ఒక్కటే గతి! శరణాగతి ఉన్నవాడు

అంతా ఆ తండ్రి దయే అనుకుంటాడు - జరిగే ప్రతి సంఘటన ఆ తండ్రి ప్రసాదంగానే స్వీకరిస్తాడు - అప్పుడు అంతా ఆనందమే!

"డాక్టరుగారూ! పొద్దుపోయింది. ముగించే ముందు ఒక చిన్నమాట! భగవంతుడు కరుణా మయుడు! అందుకే మనమీద ప్రేమతో ఒక చిన్నమాయను పెట్టాడు. ఈ మాయ మీకు అర్థమయితే మీ దుఃఖమంతా ఇప్పుడే ఇక్కడే ఆరిపోతుంది. మీరు నిద్రలేచిన తరువాత మీ సంసారం ఎంత నిజమో - మరణానంతరం మరల మీ సంసారం అంతే నిజం! రాత్రి పడుకునేముందు ఒక పుస్తకం 100 పేజీలు చదివి - మరునాడు ఉదయం 101వ పేజీ చదువుతారా? లేక మరల 1వ పేజీ నుంచి చదవరు కదా? ఇదీ అంతే! మరణానంతరం మరో దేహం - దానికి సంబంధించిన సంసారం అంతే సహజం! కాకపోతే దేహాలు మారతాయి - మీ సంసారమంతా మీ చుట్టూనే తిరుగుతుంటుంది. కాకపోతే ఇక్కడే భగవంతుడు ఒక చిన్నమాయను పెట్టాడు! చావుపుట్టుకలకు మధ్యలో "మరుపు" అనే మాయను పెట్టాడు. మీకు ఇష్టమైన మీ సంసారమంతా మీ చుట్టూనే ఉంటుంది. అడ్రస్సులు మారిపోతాయేమో - బ్యాంకు అకౌంట్లు మారిపోతాయేమోనని ఎవరూ భయపడనక్కరలేదు. భగవంతుడు కృతఘ్నుడు కాదు - కృతజ్ఞుడు! కర్తృత్వ బుద్ధి ఉన్నంతకాలం ఎవరిమూట వాళ్ళకు అప్పచెప్తాడు. ఇది నిజం.-

"డాక్టరుగారూ! మీ విలువైన కాలాన్ని చాలా ఖర్చు

పెట్టాను. జాగ్రత్తగా ఇంటికి వెళ్ళండి. నా మాటల్ని మర్చిపోకండి - మననం చేసుకోండి! మీ సందేహాలకు సందేశాలు మీ హృదయంలోంచే వస్తాయి. ఎత్తువారి బిడ్డలుగా కాకుండా స్వతంత్రముగా ఆలోచించండి! మీ బుద్ధికి పని చెప్పండి! మీకు మంచి అనిపించింది ఆచరించండి! రమణానుగ్రహము మీ మీద ఉంది! మీకు దారి కనిపిస్తుంది! ఈ ఇంటి తలుపులు మీ కోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయి! ఉంటాను!" అంటూ నన్ను కారుదాకా సాగనంపారు.

కారు దగ్గరకు నడిచి వెళ్ళాను! ఇది కలా - నిజమా? "నా కాళ్ళు భూమి మీద నడుస్తున్నాయా - గాలిలో తేలిపోతున్నాయా?" అనిపించింది. నా శరీరం తేలికై దూదిపింజంలా గాలిలో తేలిపోతోంది! నన్ను నేనే నమ్మలేక పోతున్నాను. కారులో కూర్చున్నాను - ఇంటికి తిరిగి వెళ్ళాలని పించలేదు. ఒక్కసారిగా నా గుండె బ్రద్దలై దుఃఖం కట్టలు తెంచుకుంది! గుండెలోని నిజాన్ని తట్టిలేపి - ఆ నిజాన్ని గుర్తు చేసిన ఆ తండ్రే నాకు "గురువు" అని, నా జీవితాన్ని ఆయనకే అర్పించాలని నిర్ణయించుకున్నాను. నవ వధూవరులు పెండ్లిపీటల మీద - ఎవరికి ఎవరో? తరువాత కదా భార్య భర్త - సంసారం! అంతే నా గురువు నాకు గుర్తు వచ్చిన మరుక్షణమే "తండ్రీ" అని పిలుపు ప్రారంభించాను. రాత్రీ పగలు ఒకటే తపన! చూడకుండా ఉండలేక పోయాను. అందుకే **1985** మే 1వ తేదీన ఆయన పాదాల చెంతకు చేరాను!

జిన్నూరులో స్థిరనివాసం ఏర్పరచుకున్నాను. అప్పటి వరకు ఆరని నా కన్నీరు ఆ రోజున ఆగింది. ఇక అంతా ఆనందమే!

నా తండ్రి దేవుడో, జ్ఞానో నాకు అక్కరలేదు. కంటి చూపుతో నా హృదయములో వెలిగించిన జ్ఞానజ్యోతి వెలుగుతూనే ఉంది! ఆ జ్యోతిని చూసిన కళ్ళతో మరో వెలుగును నేను చూడలేను. ఏ దుఃఖమూ నన్ను తాకలేదు! ఏ కష్టమూ నా విశ్వాసాన్ని కదపలేదు! ఈ జన్మకు ఈ జ్యోతి నాకు చాలు!

# 3. సద్గురు శ్రీనాన్నగారు

పురాణ పురుషుల పాద స్పర్శతో పునీతమైన పుడమి తల్లి, పుణ్య పురుషుల కన్నతల్లి మన తల్లి భారతి. అట్టి భరతమాత గర్భాన పవిత్ర గోదావరి తీరాన, సాగర సంగమ సమీపాన 1934 సెప్టెంబరు 23 ఆదివారం నాడు, నిండుపున్నమి రోజున పుణ్య దంపతులు జిన్నూరు గ్రామవాసులు సూర్యనారాయణ రాజు, రాజయ్యమ్మల ప్రధమబిడ్డగా, వెంకట లక్ష్మీ నరసింహరాజు నామధేయంతో ఆధ్యాత్మిక ఆకాశాన ఒక పూర్ణ చంద్రుడు ఉదయించాడు.

పువ్వు పుట్టగానే పరిమళించినట్లు చిరు ప్రాయము నందే ఆధ్యాత్మిక చింతనతో ఆ బాలుడు దిన దిన ప్రవర్ధమాను డయ్యాడు, పుణ్యతీర్థాలు సందర్శించాడు, పునీతుల దీవెనలు అందుకున్నాడు.

అరుణాచలఋషిగా వినుతికెక్కిన భగవాన్ శ్రీరమణ మహర్షి 1957లో ఆ బాలునికి స్వప్నములో దర్శనమిచ్చి ఎత్తుకొని, హృదయానికి హత్తుకొని, ముద్దాడి ఆశీర్వదించారు. అంతే 1983లో ఆ మొగ్గ పువ్వుగా మారిపోయింది. గోదావరి ప్రాంతమంతా రమణతత్వ పరిమళంతో గుప్పుమంది. ఆ గుబాళింపు దేశ విదేశాలు వ్యాప్తి చెందింది. వారే జిన్నూరు శ్రీనాన్నగారు! భక్తులు కొలిచే పెన్నిధి, దీనుల పాలిట కల్పతరువు.

కొందరు అంటూ ఉంటారు, “ఆయన సద్గురువునని

ప్రకటించుకున్నారా?" అని. వేరుభావన ఉన్నవాడు ప్రకటించుకుంటాడు. మరి ప్రకటించుకునే వాడే లోపల లేనప్పుడు ఎవరు ప్రకటించుకుంటారు? ఎవరికి ప్రకటించుకుంటారు? ప్రకటించుకునే వాడు అసలు గురుశబ్దానికి అర్హుడా? మంత్రం చెప్పినంత మాత్రాన, మహిమలు చేసినంత మాత్రాన, ప్రతీ వాడు గురువు అవుతాడా? కాదు! ఆత్మ ద్రష్ట ఒక్కడే గురువు! చూపు చేతనో, మాట చేతనో, స్పర్శ చేతనో మనస్సును హృదయములోనున్న ఆత్మ వైపునకు అంతర్ముఖ పరచగలవాడే గురువు శబ్దానికి అర్హుడు.

మన మానసిక స్థాయికి దిగి వచ్చి ఆర్తులకు సత్యాన్ని విప్పి చెప్పుతూ, చేతికి పట్టి చూపుతూ, తన శాంతితో ఎందరి హృదయాలలోనో కాంతిని నింపుతూ, చూపులతోనే ఎందరి కన్నీళ్ళనో తుడుస్తూ, అజ్ఞాన తిమిరంలో అలమటిస్తున్న అభాగ్యుల జీవితాలలో జ్ఞాన దీపాలను వెలిగిస్తూ, గృహస్థుగా జీవిస్తూ తన జీవితాన్నే ఒక సందేశముగా చూపిస్తూ - మాటలతోనో, మౌనంతోనో, చూపులతోనో, స్పర్శతోనో, తనను దర్శింప వచ్చిన వారిని హృదయపు లోతుల లోనికి పయనింప చేసిన పరమ పవిత్రుడు, జ్ఞాన స్వరూపుడు శ్రీనాన్నగారు.

"మీ ఇంటికి వస్తే ఏమిస్తారు - మా ఇంటికి వస్తే ఏమి తెస్తారు". ఇదీ నేటి సమాజ దుస్థితి! ఇటువంటి రోజులలో.

"నా మాటలను సక్రమంగా అర్థం చేసుకోండి, అర్థం చేసుకోవటం కూడా ఒక యోగమే, అదే మీరు నన్ను

గౌరవించటం! మీ దండల్ని గానీ, దండాలను గాని, ధనాన్ని గాని నేను ఆశించుట లేదు. మీరు తిన్న అన్నం జీర్ణం చేసుకుంటే మీ ఒంటికి బలం, నా మాటల్ని అర్థం చేసుకుంటే మీ మనస్సుకు బలం. అవి మీ స్వరూపాన్ని తెలుసుకోవటానికి సహకరిస్తాయి. నన్ను మీరు తెలుసుకుంటే మీరు సుఖపడరు, మిమ్మల్ని మీరు తెలుసుకుంటే మీరు సుఖపడతారు" అని శ్రీనాన్న గారిలా చెప్పే నిస్వార్ధ గురువులు ఎందరుంటారు?

వేష భాషలతో సమాజాన్ని మోసపుచ్చి దోచుకునే నేటి రోజులలో, "విషయం మీ బుద్ధికి అర్థం అయ్యేలా చెప్పలేకపోతే, ఆ దోషం నాది కానీ మీది కాదు. నాలో పవిత్రత ఉంటే మీరు మరచిపోవాలనుకున్నా నా మాటలు మిమ్ములను వెన్నంటి తరుముతాయి. నేను స్మరించినంత మాత్రము చేతనే మీకు శాంతి కలుగక పోతే, నాలో శాంతి లేనట్లే - నాలో పవిత్రత లేనట్లే. నన్ను చూడగానే మీ మనస్సు ఆత్మ వైపుకి తిరగకపోతే ఆ లోపం నాదిగానీ మీది కాదు" అని శ్రీనాన్నగారిలా చెప్పే సాహసమున్న గురువులు ఎందరున్నారు?

విప్లవాల పేరుతో సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న నేటి తరానికి "ఏది విప్లవం? కర్రలు పెట్టి కొట్టుకుంటే, కత్తులు పెట్టి కుత్తుకలు కోసుకుంటే, తుపాకులు పెట్టి కాల్చుకుంటే, బాంబులు పెట్టి పేల్చుకుంటే, వీధులలో లూటీలు చేస్తే అది విప్లవమనో ఏదో అంటున్నారు. కాని అది విప్లవం కాదు. మీ మనస్సును మీరు సంస్కరించుకుంటే అదే నిజమైన విప్లవం! అంతకు మించిన

విప్లవం లేనే లేదు" అని విప్లవానికే నూతన భాష్యం చెప్పారు శ్రీనాన్నగారు.

గుడ్డలు మార్చుకొని అడవులకు వెళ్లమనో, అన్న పానాలు మానుకోమనో, సంసారాలను విడిచి పెట్టమనో శ్రీ నాన్నగారు బోధించుటలేదు! ఆత్మ కోసం, సత్యం కోసం, స్వరూపసుఖాన్ని పొందటం కోసం - మన మనస్సుల్ని శుద్ధిగా ఉంచుకోమని, హితమైనదే మితముగా తినమని, మితనిద్ర, మితభాషణ, అలవరచుకోమని మన మేలుకోరి చెపుతున్నారు శ్రీనాన్నగారు.

వారు బోధించే అమృతవాక్కులు ఒక దేశానికో, మతానికో, కులానికో పరిమితం కాదు. "భగవంతుడు మనకి బుద్ధిని ప్రసాదించాడు. ఎందుకు? ఆలోచించమని! మీ బుద్ధికి పదును పెట్టండి! మీ వివేకాన్ని పెంచుకోండి! మీ స్వరూపాన్ని సందర్శించండి! స్వరూపాన్ని సందర్శించని జన్మ వ్యర్థం! మనమందరం ఊహ తెలిసినది మొదలు "నేను నేను" అని అంటున్నాము. ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రించే వరకు ఈ "నేను" మనల్ని పిశాచంలా పట్టి పీడిస్తున్నది, దాని ఇష్టం వచ్చినట్టు ఆడిస్తున్నది. కాని ఈ "నేను" ఎవరో మనకి తెలియదు. ఈ "నేను" ఎవరో, దాని మూలం ఏమిటో తెలిసే వరకు ఏ జీవుడికి సుఖం లేదు, శాంతి లేదు, చావు పుట్టుకలు తప్పవు. మరి ఈ నేనుకు మూలం ఎక్కడ?

ప్రతీ మనిషి "నేను చెపుతున్నాను. నేను చెపుతున్నాను" అని గుండెల మీద కుడివైపున క్రింది భాగంలో చేయి

వేసుకుంటాడు. అంటే ఆ నేనుకు మూలం అక్కడనే ఉంది. అదే ఆధ్యాత్మిక హృదయం - ఆత్మకు నిలయం! అనంతమైన, అఖండమైన, అద్వితీయమైన, అనిర్వచనీయమైన, అవ్యయమైన, అజరమైన, అభౌతికమైన, ఆత్మ గతమైన అసలు “నేను” అక్కడే ఉంది. నీటిలో నుంచి బుడగ వచ్చినట్లు ఈ ఆత్మగతమైన ‘‘నేను’’లో నుంచే మనమంటున్న దేహ పరిమితమైన “నేను” అను తొలి తలంపు పుడుతున్నది. అదే అహంకారము. ఈ “నేను” అను తొలితలంపునకే మిగిలిన ఎన్నో తలంపులు వస్తున్నాయి. ఆ తలంపుల మూటే మనస్సు! మనకు రాగం వచ్చినా, ద్వేషం వచ్చినా, కామం వచ్చినా, క్రోధం వచ్చినా, లోభం వచ్చినా, మోహం వచ్చినా, అన్నీ ఈ పరిమిత “నేను”కే వస్తున్నాయి.

గాఢనిద్రలో ఈ “నేను” లేదు. అప్పుడు ఈ గొడవలు ఏమీ లేవు. చివరకు దేహం లేదు. లోకం లేదు. దేవుడు కూడా లేడు. కానీ మనము మాత్రం సుఖముగా ఉన్నాము. సుఖముగా ఉన్నామే గానీ సుఖముగా ఉన్న సంగతి నిద్రలో ఉండగా మనకు తెలియుట లేదు. మెలుకువ వచ్చాక మాత్రమే సుఖముగా ఉన్నామని చెపుతున్నాము. నిద్రనుంచి మేల్కొన్న వెంటనే మరల “నేను” అను తలంపు పుడుతున్నది. దాని వెనకాలే సైన్యం వచ్చినట్లు, మన గొడవలన్నీ గుర్తుకు వస్తున్నాయి - అశాంతిని తెస్తున్నాయి. మెలుకువలో మనము ఉన్నామని తెలుస్తున్నది. కాని మనము మాత్రం సుఖంగా లేము. గాఢనిద్రలో ఉన్న సుఖాన్ని - మెలుకువలో నున్న ఎరుకను

ఏకకాలంలో అనుభవంలోకి తెచ్చుకోగలిగితే అదే మోక్షం!

మనము మోక్షం కావాలని కోరుకుంటున్నాము. కాని మనము మోక్షాన్ని కోరుకునేటప్పుడు కూడా మోక్షంలోనే ఉన్నాము. అయితే అది మన అనుభవంలోనికి రాకుండా మన దేహ పరిమితమైన "నేనే" అడ్డు పడుతున్నది. మన అన్ని అనర్థాలకు మూలమైన ఈ "నేను ఎవరు?" అని మీరెప్పుడైనా ప్రశ్నించుకున్నారా? కనీసం ఈ రోజునుంచైనా ఈ "నేను ఎవరు?" అని విచారణ చేయండి! దాని అస్థిత్వాన్ని ప్రశ్నించండి! అప్పుడు ఈ నేను దానికి వచ్చే తలంపుల నుంచి విడివడి, అంతర్ముఖమై తన పుట్టు చోటును అన్వేషిస్తూ, హృదయము వైపు ప్రయాణము చేసి, తన పుట్టుక చోటైన ఆత్మను చేరుకుంటుంది.

"నేను ఎవడను? అని విచారణ చేసి ఈ నేనును ఆత్మలో స్థిరముగా నిలిపి ఉంచగలిగితే తలంపుల వేగము తగ్గి మనస్సు పలుచబడుతుంది - పరిశుద్ధమౌతుంది. పరిశుద్ధ మనస్సు ఆత్మాకారం చెందుతుంది. ఆత్మలో ఐక్యమయ్యే వరకూ ఏ జీవుడూ బంధములో నుంచి బయట పడలేడు. మీరు ఏ పని చేసినా హృదయశుద్ధి కోసమే చేయండి. శుద్ధి లేని వాడికి సిద్ధి కలుగదు" అని బోధిస్తున్నారు శ్రీనాన్నగారు.

చివరి మాటగా శ్రీనాన్నగారు చెప్పేది, "మీకు శక్తి ఉంటే సాధన చేసి తరించండి, సాధన చేసే ఓపిక లేకపోతే కనీసం ఒక సత్పురుషునితో సహవాసము చేయండి - సమస్త

సద్గుణాలు మీకు సమకూరతాయి. సంసార సాగరాన్ని దాటిపోతారు," అంటున్నారు.

అందుకోగలిగిన వారికి అడ్డదారి కూడా చెపుతున్నారు శ్రీనాన్నగారు. "మనస్సు నిగ్రహించు కోవటాలు, సత్యాన్ని అన్వేషించటాలు, నీకెందుకు? నీవు మనస్సు కాదు, ఆత్మవు! నీవు కాని మనస్సు గొడవ నీకెందుకు? దానిని పట్టించుకోకు! దానిని ఖాతరు చేయకు! నీవు నీవుగా (ఆత్మగా) ఉండు! సరిపోతుంది, సాధనతో పనే లేదు," అంటున్నారు.

సత్యాన్ని రియలైజ్ చేయుట కోసం ఎందరో మహాత్ములు ఎన్నెన్నో మార్గాలు చెప్పారు. మీకు నచ్చిన మార్గాన్ని మీరు ఎంచుకుని మీ పద్ధతిలో మీరు ప్రయాణము చేయండి. మిమ్మల్ని మీరు సంస్కరించుకుని, మీరు ఎవరో మీరు తెలుసుకోండి, మీ జన్మలను జ్ఞానముతో పండించుకోండి. మీరు దుఃఖములో నుంచి బయట పడండి, మీరు శాంతిగా ఉండండి, మీ శాంతిని మీ తోటి వారికి పంచిపెట్టండి!

# 4. బ్రహ్మము

ఉన్నది బ్రహ్మము ఒక్కటే! దానినే ఆత్మ అని, చైతన్యమని, దేవుడని, ఈశ్వరుడని, భగవంతుడని, రకరకాల పేర్లుతో పిలుస్తారు. ఆత్మ అనంతము, అఖండము, అమరము, అజరము, అవ్యయము, అభవము, అభౌతికము, అలౌకికము, అద్వితీయము, అనిర్వచనీయము, ఊహాతీతము, కాలాతీతము, గుణాతీతము. దానిని గాలి కదుపలేదు, నీరు తడుపలేదు, నిప్పు కాల్చలేదు. అది సత్ చిత్ ఆనంద స్వరూపము. అది ఎక్కడో దూరాన లేదు. మన హృదయంలోనే నిరంతరము ప్రత్యక్షముగా మన స్వరూపముగా స్వయముగా ప్రకాశిస్తున్నది.

అంతటా ఉన్న ఆత్మ మన దేహములో కూడా ఉంది - ఎక్కడ? మనము "నేను నేను" అని ఛాతీ కుడివైపున క్రింది భాగములో చేయి వేసుకుంటాము. అక్కడే ఉంది మన ఆధ్యాత్మిక హృదయము. ఆ హృదయములో ఆత్మ నిరంతరము "నేను, నేను" అనుచు స్వయముగా ప్రకాశిస్తున్నది. అది మన హృదయములో ఉన్న మాట నిజము! కాని అది మన దేహములో ఒక భాగము మాత్రము కాదు. అందుకే మన దేహాన్ని కోసి చూస్తే అది మన కళ్ళకు కనిపించదు. ఛాతీ ఎడమ వైపున రక్తమాంసములతో కనిపించే భౌతిక హృదయానికి - ఈ ఆధ్యాత్మిక హృదయానికి అణు మాత్రము కూడ సంబంధము లేదు. మరణానంతరము భౌతిక

హృదయము చితి మంటలలో కాలిపోతుంది గాని - ఈ ఆధ్యాత్మిక హృదయము మాత్రము కట్టెలలో కాలదు. ఆత్మ అరూపము. హృదయములో దక్షిణ భాగములో ఆత్మ అరూపముగా ఉంది - దానినే దక్షిణామూర్తి అని అంటారు.

ఆత్మకు చావు లేదు - అందుకే అందరూ చావకూడదను కుంటారు. ఆత్మ స్వతంత్రమైనది - అందుకే అందరు స్వేచ్ఛను కోరుకుంటారు. ఆత్మ ప్రేమ స్వరూపము - అందుకే అందరు ప్రేమను కోరు కుంటారు. ఆత్మ సుఖ స్వరూపము - అందుకే అందరు సుఖాన్ని కోరుకుంటారు. ఆత్మ ఆనంద స్వరూపము - అందుకే అందరు ఆనందాన్ని కోరుకుంటారు కానీ దుఃఖాన్ని ఎవ్వరూ ఇష్టపడరు. ఆత్మ శాంతి స్వరూపము - అందుకే అశాంతిని ఎవ్వరూ ఇష్టపడరు.

ఆత్మ కంటికి కనిపించనంత మాత్రము చేత ఆత్మ లేదని ఎవ్వరూ అనుకోవద్దు. కరెంటు మన కళ్ళకు కనిపించదు - అంత మాత్రము చేత కరెంటు లేదని మనము అనగలమా? కరెంటు తీగకు ఒక బల్బును తగిలిస్తే అప్పుడు దానిశక్తి మనకు వ్యక్తమవుతుంది. అదే విధముగా ఆత్మశక్తిని వ్యక్తం చేయటానికే మహాత్ములు ఈ భూమి మీద అవతరిస్తారు. మహాత్ముడు అంటే మనోమూలము తెలిసినవాడు. ఏమిటి ఆ మనోమూలము - ఆత్మ!

సూర్యుడు లేకపోతే సూర్యకిరణాలు ఉంటాయా? మన హృదయములో చైతన్య స్వరూపమైన ఆత్మ ఉండకపోతే మనకు

“నేను” అను తలంపు కూడ పుట్టదు. నీటిలో నుంచి బుడగ వచ్చినట్లు అఖండమైన, అనంతమైన, ఆత్మ గతమైన “అసలు నేను” లోనుంచే మనము అంటున్న దేహ పరిమితమైన “మిధ్యానేను” పుట్టుచున్నది. ఈ మిధ్యానేను దాని పుట్టుచోటైన ఆత్మను మరచిపోయి తాను స్వయంభవుడనని స్వతంత్రముగా వ్యవహరిస్తున్నది. ఈ “నేను” అను తలంపే తొలి తలంపు. ఈ తొలి తలంపునే మూల తలంపు అనీ, పునాది తలంపు అనీ, ప్రధాన తలంపు అనీ అంటారు. ఈ మూల తలంపు దేహ పరిమిత మైనది. ఈ మూల తలంపునే అహంకారమనీ, జీవుడనీ అంటారు. ఈ అహంకారము దేహపరిమితమైనదే అయిప్పటికీ మరణానంతరం స్మశానములో దేహమును కట్టెలలో కాల్చినపుడు ఈ అహంకారము కాలిపోదు. జడమైన దేహమును - చైతన్యమైన ఆత్మను కలిపి ముడి పెడుతున్నదే “చిజ్జడ గ్రంథి” అని అంటారు. మనము అంటున్న “నేను” అను మూల తలంపును ఆధారము చేసుకొని మనకు అన్ని తలంపులు వస్తున్నాయి. ఆ తలంపుల మూటే మనస్సు. ఈ మనస్సు నుంచి బయట పడటానికి మనము చేయు ప్రయత్నమే సాధన.

అహంకారము బుడగ అయితే ఆత్మ సముద్రము! బుడగ లేకుండా సముద్రము ఉండగలదు కానీ సముద్రము లేకుండా బుడగ ఉండలేదు. సినిమా బొమ్మలకు తెర ఎలా ఆధారమో, అలాగే ఈ సృష్టికి ఆత్మే ఆధారము. మబ్బు సూర్యున్ని కనిపించ కుండ అడ్డుకున్నట్లు మన హృదయములో ప్రకాశిస్తున్న ఆత్మ

మన అనుభవములోకి రాకుండా మన అహంకారము అడ్డు పడుతున్నది. కుండలో అన్నము నిండా ఉన్నప్పటికీ కుండపైన ఉన్న మూతను తీయకుండా కుండలో ఉన్న అన్నము మనకు కనిపించదు గదా? అదే విధముగా మన హృదయములో ఆత్మ స్వయముగా ప్రకాశిస్తున్నప్పటికీ ఆ ఆత్మ మన అనుభవము లోకి రాకుండా మన అహంకారమే అడ్డుపడుతున్నది. సాధనల పేరుతో మనము అహంకారమనే ఆ మూతను తీయడమే మనము చేయవలసిన పని! మూతను తీస్తే ఆత్మ హృదయము లోనే ఉంది.

దేహము మరణించినా అహంకారము మరణించదు. కట్టెలలో దేహం కాలిపోయినా, అహంకారము కట్టెలలో కాలదు. స్మశానముతో దేహయాత్ర ఆగిపోతుందే గాని, జీవుడి యాత్ర స్మశానముతో ఆగిపోదు - మరుజన్మకు పయనిస్తుంది - దానికీ మరో దేహము వచ్చి తీరుతుంది. దేహము ఉన్నంత కాలము బట్టలు ఎలా వేసుకుంటామో, అహంకారము ఉన్నంతకాలము దేహము వచ్చి తీరుతుంది, జన్మలు వచ్చి తీరుతాయి.

అహంకారము ఉంటే అంతా ఉంది, అహంకారము లేకపోతే ఏమీ లేదు. అహంకారమనే ఒంటి స్థంభము మీదనే ఈ యావత్తు సృష్టి ఆధారపడివుంది. అహంకారము ఉన్నంతకాలము ఈ దేహం నిజం, లోకం నిజం, దేవుడు నిజం - అహంకారము లేకపోతే ఈ మూడూ అబద్ధమే! అహంకారం లోకం వైపు జరిగితే అజ్ఞానం - హృదయము వైపు జరిగితే

ఆత్మ దర్శనం! అహంకారానికి దేహం కావాలి - ఆత్మకు దేహంతో పనిలేదు. అహంకారం పుట్టినప్పుడే జీవుడు పుట్టాడు - అహంకారం మరణించినప్పుడే జీవుడు మరణిస్తాడు. శరీరము పుట్టినప్పుడు మనము పుట్టడము అబద్ధము - శరీరము మరణించినప్పుడు మనము మరణించడము అబద్ధం.

అందరూ "మాకు మోక్షం కావాలి" అని అంటారు. మోక్షమంటే ఏమిటి? విడుదల! ఎందులో నుంచి విడుదల? అజ్ఞానములో నుంచి విడుదల. ఏమిటి అజ్ఞానం? దేహబుద్ధే అజ్ఞానం! మనము ఆత్మ అయివుండి చచ్చి పుట్టే ఈ ఆరడుగుల దేహమే మనం అనుకుంటున్నాము. ఈ దేహపరిమితమైన అహంకారములో నుంచి విడుదల పొందడమే మోక్షము! మోక్షము మనము ఏదో చేసి పొందేది కాదు. మోక్షము కోరుకునేటప్పుడు కూడా మనము మోక్షములోనే ఉన్నాము. అజ్ఞానాన్ని విడిచిపెడితే చాలు - ఉన్న ఆత్మ ఉన్నట్లుగా - లేని అహంకారము లేనట్లుగా తెలుస్తుంది. చీకటిలో తాడును చూసి మనము పాము అని భ్రమ పడతాము. లైటు వేసి చూస్తే అది పాము కాదు, తాడు అని తెలుస్తుంది. అదే విధముగా మనకు జ్ఞానము కలిగిన తరువాత తెలుస్తుంది. ఏమని? మనము మోక్షము కోరుకునేటప్పుడు కూడా మనం మోక్షములోనే ఉన్నామని, ఉన్నది బ్రహ్మము ఒక్కటేనని - మనమంతా సున్నేనని తెలుస్తుంది.

ఈ సృష్టిలో రెండు సుఖాలు ఉన్నాయి. 1. మోక్ష సుఖము

2. సంసార సుఖము! సంసార సుఖం మన అనుభవములో ఉంది గాని - మోక్ష సుఖం ఎలా ఉంటుందో దాని రుచి మనకు తెలియదు. మోక్ష సుఖం పొందాలని మనందరికి ఆశ ఉంది. మరి ఆశ ఉన్నంత మాత్రాన సరిపోతుందా? సరిపోదు! వాక్కును నియమించి వాక్కును స్వాధీనము చేసుకోవాలి, ఇంద్రియాలను నిగ్రహించి ఇంద్రియాలను స్వాధీనము చేసుకోవాలి. మనస్సును నిరోధించి మనస్సును స్వాధీనము చేసుకోవాలి - అదే తపస్సు! తపస్సు వలన తత్వము వ్యక్తమవుతుంది.

ఒకడికి దొంగతనం చేసే బుద్ధి ఉందనుకోండి! వాడి ప్రక్క గదిలో బంగారపుమూట ఉందనుకోండి. వాడికి ఆ రాత్రంతా నిద్రపడుతుందా? నిద్రపట్టదు. ఎందుకని? ఆ బంగారపు మూటను దొంగిలించ డానికి అవకాశము ఎప్పుడు దొరుకుతుందా అని వాడి ధ్యాసంతా ఆ బంగారపు మూట మీదే ఉంటుంది. అంత ధ్యాస మనకు మోక్షము పొందాలని ఉంటే మోక్షసుఖము మనకు దొరుకుతుంది.

మనకు ఆశవుందిగాని - తగినంత శ్రద్ధ, పట్టుదల లేదు. మనము కళ్ళు మూసుకొని ధ్యానము చేస్తున్నాము. కాని మన ధ్యాస మాత్రము ఎన్ని గంటలయ్యిందా అని గడియారము మీదనే ఉంటుంది. అలాంటప్పుడు మోక్షసుఖం మనకు ఎలా తెలుస్తుంది?

మీకు ఉన్న సిరిసంపదలతో దేహాన్ని అలం కరించుకున్నా

ఫరవాలేదు గాని అహంకారాన్ని మాత్రము అలంకరించు కోవద్దు. సమాజ సేవల పేరుతో మీరు సమాజాన్ని ఉద్ధరించచక పోయినా పరవాలేదు గాని అహంకారాన్ని మాత్రము అలం కరించుకోవద్దు. అహంకారాన్ని అలంకరించు కుంటూ మీరు ఎన్ని పూజలు, జపాలు చేసినా అహంకారం అంత తేలిగ్గా పోదు. ఎందుచేతనంటే దేవుడు మన లోపల ఉన్నాడు కానీ మన మనస్సు చూస్తే అది ఎప్పుడూ బయట తిరుగుతుంటుంది. అలాంటప్పుడు లోపల ఉన్న దేవుడు మనకు ఎలా తెలుస్తాడు? ఒక వస్తువు మన ఇంట్లో పడిపోతే - వీధిలో వెతికితే ఆ వస్తువు మనకు దొరుకుతుందా? దొరకదు! మనము చేసే సాధనలు కూడా అలాగే ఉన్నాయి. దేవుడు మన హృదయంలో ఉంటే - మనము హృదయంలోకి దిగడం ఇష్టము లేక - లోకం చుట్టూ తిరుగుతుంటే ఆ దేవుడు మనకెలా తెలుస్తాడు?

మనందరికి దేవున్ని తెలుసుకోవాలని తపన ఉంది. అందుకే సాధనలు చేస్తున్నాము. కాని మన సాధనలతో అహంకారాన్ని అలంకరించుకుంటున్నాము గాని - రాగద్వేషా లలో నుంచి బయట పడటం కోసము కాదు మనము చేసే సాధనలు. ఇష్టమైన వారిని అందరూ ప్రేమిస్తారు - కాని మనల్ని ద్వేషించే వారిని కూడా ప్రేమించడమే గొప్ప! మనకు శత్రువులు బయట ఎక్కడో లేరు, మన రాగద్వేషాలే మనకు శత్రువులు. మనకు కష్టం వచ్చినా, సుఖం వచ్చినా, కామం వచ్చినా, క్రోధం వచ్చినా, రాగం వచ్చినా, ద్వేషం వచ్చినా, అసూయ వచ్చినా

అన్నీ మన లోపలి నుంచే వస్తున్నాయి. ఎలా వస్తున్నాయి? తలంపుల రూపములోనే వస్తున్నాయి. మన తలంపులే మనకు శత్రువులు. చేపలు నీటి ప్రవాహానికి ఎలా ఎదురీదుతాయో - మనము కూడా మన మనస్సుకు ఎదురీదాలి. మీకు ధనం ఉంటే, విద్య ఉంటే, తెలివి ఉంటే వాటితో మీతోటి వారికి సహాయ సహకారాలు అందించండి, వారికి మీ ప్రేమను పంచండి. అలా చేస్తే మీ బుద్ధి విశాలమవుతుంది. మీ చైతన్యస్థాయి పెరుగుతుంది, మీకు జ్ఞానము కలుగుతుంది. రబ్బరు బుడగను మనము ఊదినకొలది అది సాగుతుంది. సాగి సాగి చివరకు పేలిపోతుంది. అదే విధముగా మీరు ప్రేమతో పని చేయగా చేయగా మీ మనస్సు విశాలమై అది ఆత్మాకారము చెందుతుంది. మనము దేవున్ని పూవులతో పూజించడము నేర్చుకున్నాము, మంచిదే! కానీ సమాజ రూపములో అంతటా వ్యాపించిన ఆ దేవున్ని మీరు చేసే పనితో కూడా పూజించడం నేర్చుకోండి. మనము పనిచేసి పవిత్రులు అవడం కోసమే దేవుడు మనకు పనిచేసే అవకాశాన్ని ప్రసాదించాడు. ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. నిర్లక్ష్యముగా పనిచేయకండి - ఎరుకతో, వివేకముతో, ప్రేమతో, భక్తితో, శ్రద్ధతో, కర్తృత్వము లేకుండా పని చేయడం నేర్చుకోండి. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అన్నాడు గీతలో వాసుదేవస్వామి!

మనమందరమూ పని చేస్తున్నాము. పని చేస్తున్నప్పుడు మన దృష్టి ఫలితం మీద ఉంటున్నదా? లేక పరమాత్మ మీద ఉంటున్నదా? మనల్ని మనం మోసం చేసుకోకూడదు.

మనము ఏ ఉద్దేశ్యముతో పనిచేస్తున్నామో తెలియనంత అమాయకుడా ఆ పరమేశ్వరుడు? మనకు తలంపు రాక ముందే ఆ తలంపు ఏమిటో ఆ పరమేశ్వరుడికి తెలుసు - ఆయన సర్వసాక్షి! అంతా చూస్తూనే ఉన్నాడు. నిష్కామ కర్మ వలన, నిష్కామ భక్తి వలన మాత్రమే మానవుడు బంధములో నుంచి బయట పడగలడు. మనము మనస్సు యొక్క, అహంకారము యొక్క, ఇంద్రియముల యొక్క ప్రేరణతో మన సంతోషం కోసము, సుఖము కోసము, ఆనందం కోసము, స్వార్థము కోసము - మన మనస్సు యొక్క, అహంకారము యొక్క, ఇంద్రియముల యొక్క ప్రేరణతో పనిచేస్తాము. కానీ జ్ఞాని లోక కల్యాణము కోసము, ఈశ్వరుని ప్రేమ కోసము పని చేస్తాడు.

మనందరికీ బహుమానాలంటే ఇష్టము - అవమానాలంటే అయిష్టము. కానీ బహుమానాల వలన మనస్సు బహిర్ముఖమవుతుంది - అవమానాల వలన అంతర్ముఖమవుతుంది. మనస్సు బాహ్య ముఖమైతే దేహభావన పెరుగుతుంది - అంతర్ముఖమైతే ఆత్మభావన పెరుగుతుంది. కానీ మనము ఇష్టముంటే ఒకలాగ - ఇష్టం లేకపోతే ఒకలాగ ఉంటాము. మనల్ని ఎవరైనా పొగిడితే మన అహంకారం ఉబ్బుతుంది. ఎవరైనా విమర్శిస్తే అహంకారం కుంగుతుంది. మన మనస్సుకు బలం చేకూర్చడం కోసం - మనల్ని ఆత్మకు అభిముఖంగా నడిపించడం కోసం - ఆ దేవుడు మన మీద దయవలన మన విరోధుల్ని అడ్డు పెట్టుకుని వాళ్ళతో మనల్ని పరుషమైన

చెడ్డ మాటలు అనిపిస్తాడు. అంతేగాని వాళ్ళు అలా అనటానికి వాళ్ళకు స్వేచ్ఛ, శక్తి లేదు. మనల్ని బాగు చేయడం కోసం వాళ్ళతో ఆ చెడ్డ మాటలు అనిపిస్తాడు. ఇది మనకు అర్థమైతే వాళ్ళ మీద మనకు ద్వేషం రాదు. అదేమాట మనకు ఇష్టమైన వాళ్ళు అంటే పట్టించుకోము - వాళ్ళతో రాజీ పడతాము. మనుష్యులతో రాజీ పడుతున్న మనము దేవునితో రాజీ పడలేమా? ఇష్టమున్న చోట కష్టముండదు. జరుగుతున్నదంతా ఈశ్వర సంకల్పమే! ఈశ్వర సంకల్పానికి శిరస్సు వంచి ప్రేమతో స్వీకరించడం మనము నేర్చుకోవాలి. అప్పుడు ఈశ్వరానుగ్రహం మనమీద వర్షిస్తుంది - ముక్తికి దారి కనిపిస్తుంది.

# 5. జ్ఞాని

జ్ఞానము కలవాడు జ్ఞాని. మనోమూలాన్ని శోధించి ఆత్మను దర్శించినవాడు జ్ఞాని. ఆత్మ స్వరూపం తెలిసినవాడు జ్ఞాని. కాలాన్ని, కామాన్ని జయించిన వాడు జ్ఞాని. త్రిగుణము లను దాటినవాడు, మూడు అవస్థలకు అతీతుడు జ్ఞాని. జీవితములో పరిశీలన, పరిశోధన లేనివాడు జ్ఞాని కాలేడు. ఈశ్వరానుగ్రహం ఉన్నవాడు మాత్రమే జ్ఞాని కాగలడు. “జ్ఞానికి నాకు భేదము లేదు, జ్ఞాని నా స్వరూపాన్ని పొందు తాడు” అని భగవద్గీతలో వాసుదేవస్వామి చెప్పాడు. అదీ జ్ఞాని వైభవము!

సత్పురుషుడు అంటే సత్యాన్ని (ఆత్మను) దర్శించినవాడు. ఆచార్యుడంటే తాను ఆచరించి ఎదుటివారి చేత ఆచరింప చేసేవాడు. ముముక్షువు అంటే మోక్షము పట్ల ఆసక్తి కలవాడు. జిజ్ఞాసువు అంటే జ్ఞానము పట్ల ఆసక్తి కలవాడు. యోగి అంటే యోగము గలవాడు. భక్తుడంటే భక్తి గలవాడు. సాధువు అంటే సాధనా సంపత్తి గలవాడు. జ్ఞాని అంటే జ్ఞానము గలవాడు.

మనస్సును మింగినవాడు జ్ఞాని - లోకాన్ని కామించే వాడు అజ్ఞాని. జ్ఞానిది శివదృష్టి - అజ్ఞానిది శవదృష్టి! జ్ఞాన మార్గములో పయనించేవాడు ఈ సృష్టిలో ఏ వస్తువు తనది కాదనుకుంటాడు. కర్మ మార్గములో పయనించేవాడు ఈ సృష్టిలో ప్రతివస్తువు తనదే అనుకుంటాడు. ఈ లోకంలో గాని

పరలోకంలో గాని జ్ఞానికి పనీ లేదు - పొందదగినదీ కూడా ఏమీ లేదు. కాని జ్ఞాని ద్వారా పని జరుగుతుంది. సమాజాన్ని సమత్వము వైపు నడిపించుట కోసమే జ్ఞాని ఈ భూమ్మీదకు వచ్చిన పని. ఈ లోకానికి మేలు చేయాలని జ్ఞాని అనుకో నక్కర్లేదు - జ్ఞాని దేహము ధరించి ఉన్నంత మాత్రము చేతనే ఈ లోకానికి మేలు జరుగుతుంది. కల్పవృక్షము, కామధేనువు కోరిన వాటినే ఇస్తాయి - కాని జ్ఞాని దర్శనము కోరని వాటిని కూడ ఇస్తుంది.

జ్ఞాని మౌన స్వరూపుడు. కానీ ఆ మౌనము మనకు అర్థము కాదు కాబట్టి మనమీద ప్రేమ వలన ఆయన మనతో మాట్లాడతాడు. మనము నవ్వితే తానూ నవ్వుతాడు - మనము ఏడిస్తే ఆయన కళ్ళ వెంట కూడా నీళ్ళు వస్తాయి. జ్ఞాని చేష్టలు చంటి బిడ్డ చేష్టలు లాగా ఉంటాయి. కానీ చంటి బిడ్డ హృదయములో వాసనలు బీజ రూపములో దాగి ఉంటాయి - జ్ఞాని హృదయములో వాసనా క్షయమై ఆత్మ ప్రకాశిస్తుం టుంది. జ్ఞాని కళ్ళలో కాంతి, శాంతి, శక్తి ఉంటుంది.

మానవ స్వభావం తనకు నచ్చిన ప్రతీదానిని తన సొంతం చేసుకుందామని అనుకుంటాడు. అందుకే జ్ఞాని కళ్ళలోని వైభవాన్ని చూడగానే అటువంటి కళ్ళు తనకు కూడ కావాలని కోరుకుంటాడు. కానీ ఆ కోరుకున్న క్షణమే తన చావుకు తానే ముహూర్తం పెట్టుకుంటున్నాననే సంగతి వాడికి తెలియదు పాపం! వాడి మనస్సు నశిస్తేనేగదా వాడి కళ్ళల్లో

కూడా ఆ కాంతీ, శాంతీ, శక్తి ప్రకాశించేది! జ్ఞాని అనుగ్రహ స్వరూపుడు కాబట్టి మనము దేనిని కోరుకుంటే దానినే ఆయన "తథాస్తు" అని దీవిస్తాడు. మనస్సు నశించాక ఇక వాడికి అస్తిత్వం ఎక్కడ ఉంటుంది?

దేహమాత్రుడను తాను అనుకున్న ప్రతీవాడికి ప్రారబ్ధము ఉంటుంది. జ్ఞానికి మనలాగే దేహము ఉన్నప్పటికీ తాను దేహమాత్రుడను కానని - ఆత్మ స్వరూపుడుననీ తెలుసు! ఆత్మ తానని తెలిసినవాడిని ప్రారబ్ధ కర్మ బాధించదు. వాడికి సంచిత, ఆగామి కర్మలు కూడ కాలిపోతాయి. మనలాగే జ్ఞానికి దేహము ఉన్నప్పటికీ - అది ప్రారబ్ధ కర్మను అనుభవించటానికి రాలేదు. మనకు జ్ఞానం వైపు దారి చూపించటానికి ఈ భూమ్మీదకు వచ్చిన అవతారమే జ్ఞాని!

మనమందరము దేహమే మనమని అనుకొంటున్నాము కాబట్టి - దేహానికి రోగం వస్తే మనకు అనారోగ్యము వచ్చినదని బాధపడతాము - దుఃఖపడతాము. జ్ఞాని అహంకార, మమకారాలు దాటినవాడు కాబట్టి, జ్ఞాని దేహానికి రోగం వచ్చినా అది వాడిని బాధించదు. మనకు రోగము వస్తే మనము దుఃఖపడుతున్నట్లే జ్ఞాని కూడా దుఃఖపడుతున్నాడని చూసే మనము అనుకుంటాము. స్వప్నములో మనకు కడుపులో నొప్పి వస్తే బాధ పడతాము - మెలుకువ వచ్చిన తరువాత ఆ కడుపునొప్పి మనల్ని బాధిస్తుందా? బాధించదు! ఎందుకని? ఆ స్వప్న దేహం అబద్ధమని మనకు తెలుసు కాబట్టి!

అదే విధంగా ప్రారబ్ధరీత్యా జ్ఞాని దేహానికి రోగం వస్తే రావచ్చును - దేహం తాను కాదని తెలిసినవాడికి ఆ దేహానికి వచ్చిన బాధ వాడిని తాకలేదు. తాను దేహము కాదు - ఆత్మ స్వరూపుడునని తనకు అప్పుడు కూడా తెలుసు! మనలాగే జ్ఞాని కూడా బాధపడుతున్నట్లు చూస్తున్న మనకు అనిపిస్తుందే గాని - దేహం లేనివాడికి, లోకం లేనివాడికి బాధేమిటి? దుఃఖం ఏమిటి? ఆ స్థితి మన ఊహకు గాని, మన బుద్ధికి గాని అందదు - అట్టిది ఆత్మ స్థితి!

సముద్రములో కెరటాలు పైపైనే కనిపిస్తాయి. లోతులకు వెళ్ళిన కొలది కెరటాలు తగ్గిపోతాయి. లోపల సముద్రము ప్రశాంతముగా ఉంటుంది. అదే విధముగా దేహ ప్రారబ్ధము గాని, ప్రకృతి ప్రలోభాలు గాని జ్ఞానిని తాకలేవు. సముద్రము లాగా హృదయములో ప్రశాంతముగా ఉంటాడు - అట్టిది జ్ఞాని స్థితి.

మనమందరము లోకములో ఉన్నామని అనుకుంటున్నాము. కాని లోకమంతా తానేనను కుంటాడు జ్ఞాని! మనది పరిమిత బుద్ధి. అందుకే మనకు ఇతరులున్నారు, లోకం ఉంది. జ్ఞానిది హద్దులు లేని అనంతమైన ఆత్మబుద్ధి! అందుకే జ్ఞానికి తనకంటే భిన్నంగా ఈ లోకం లేదు. మనల్ని ఎవరైనా చిన్నమాట అంటే మనకు వికారము వస్తుంది - రియాక్ట్ అయి రెచ్చిపోతాము. జ్ఞానికి వికారము ఉండదు - రియాక్షన్ కూడా ఉండదు. నిర్వికారంగానే ఉంటాడు. మన శరీరములో ఒక భాగము ఎక్కువని - ఒక భాగము తక్కువని మనము

అనుకుంటామా? అనుకోము! జ్ఞానికి వేరు భావన ఉండదు కాబట్టి లోకమంతా తన స్వరూపముగానే చూస్తాడు. అజ్ఞానములో ద్వైతము ఉంటుంది - వేరు భావన ఉంటుంది - జ్ఞానములో ద్వైతము ఉండదు. వేరుభావన ఉండదు. మనము అంటున్న నేనులో అజ్ఞానము ఉంది. ఆ నేను అఖండమైన ఆత్మలో కలిసిపోతే అజ్ఞానము కూడ నశించిపోతుంది - ఆత్మ వ్యక్తమవుతుంది. ఆ ఆత్మకు భిన్నంగా జ్ఞాని ఉండడు - అదీ జ్ఞాని స్థితి!

# 6. గురువు

జన్మల తరబడి మనము నామరూప దృష్టికి అలవాటు పడి ఉన్నాము. ఈ నామరూప దృష్టి నుంచి మనల్ని తరింప చేయుటకు ఆ భగవంతునిలో పొంగి పొరలిన కరుణామృతమే ఒక దేహము ధరించి సద్గురు రూపములో ఈ భూమ్మీద అవతరిస్తాడు.

ఆత్మానుభవము పొందినవాడే సద్గురు శబ్దానికి అర్హుడు. ఆత్మానుభవం పొందనివాడు ఆత్మను గురించి బోధిస్తున్నప్పుడు విన్నవాడికి "ఆత్మ అనేది ఒకటి ఉంది" అనే విశ్వాసము కుదరదు. ఆత్మానుభవం పొందినవాడు మాత్రమే ఆత్మలోని అందాలను దానిలోని లోతుపాతులను మనకు చెప్పగలడు. శాస్త్రపాండిత్యము ఉన్నవాడు ఆత్మను గురించి చెప్పినా ఆత్మ అనేది ఒకటుందని మన మనస్సు నమ్మదు. సద్గురు ముఖతః మనము శాస్త్రమును శ్రవణము చేస్తే గురువు యొక్క అనుగ్రహము వలన మన మనస్సు విశాలమౌతుంది. విన్న విషయాన్ని అర్థము చేసుకొని ఆచరించాలనే బుద్ధి పుడుతుంది. మనము చేసే జప తప ధ్యానాలకంటే గురువు యొక్క అనుగ్రహము శక్తివంతమైనది. బాహ్యంగా పరుగెడు తున్న మన మనస్సుకు - వేగంగా పరుగెడుతున్న కారుకు సడన్ బ్రేకులా పనిచేస్తుంది గురువు యొక్క అనుగ్రహము. సూర్యుడి నుంచి కాంతి కిరణాలు ఎంత సహజంగా ప్రసరిస్తాయో,

గురువు తన అనుగ్రహముతో మన మనస్సుకు శక్తినిచ్చి, బుద్ధిని శుద్ధి చేసి అంతర్ముఖి పరుస్తాడు. అంతర్ముఖమైన మనస్సుకు గాని ఆత్మ తెలియబడదు.

లోక వాసన, శాస్త్ర వాసన, దేహ వాసన మనల్ని బంధిస్తున్నాయి. దేహవాసన చాలా బలీయమైనది. ప్రతీవాడు ఊహ తెలిసినది మొదలు వల్లకాటికి వెళ్ళేవరకు దేహమే తానని దేహాన్ని అలంకరించు కొనుట కోసమే పనిచేస్తుంటాడు, గాని తాను పవిత్రుడు అవటం కోసము ప్రయత్నము చేయుట లేదు. ఎంతసేపూ ఏమి తింటున్నాము, ఏమి కట్టుకుంటు న్నాము, లోకము మనల్ని గౌరవిస్తుందా - లేదా? ఎంతసేపూ దేహము గొడవే గాని ఆత్మ గొడవ ఏ ఒక్కడికీ లేదు. అటువంటప్పుడు మనకు ఈ దేహవాసన అంత తేలికగా ఎలా పోతుంది? పోదు!

స్వప్రయత్నము, కాలపరిపక్వము, ఈశ్వర కటాక్షము, గురు కృప లేకుండా ఏ జీవుడు జ్ఞాని కాలేడు. గురువు పట్ల వినయము, విశ్వాసము, శరణాగతి ఉన్నవాడికి మాత్రమే గురువు యొక్క కృప వర్షిస్తుంది. గురుకృప ఉన్నవాడు కురిడి కొబ్బరి కాయిలా దేహములో నుంచి వేరుపడి పోతాడు. గురుకృప వలన వాడి సాధన నిరాటంకముగా, జీవనదిలా సాగిపోతూ ఉంటుంది.

ఆకాశములో మెరుపు మెరిసినట్లు సడన్‌గా వాడి అహంకారము హరించబడుతుంది - దేహవాసనలో నుంచి బయట పడతాడు. దేహ ప్రారబ్ధములో వాడిని బాధించే

సంస్కారాలు ఏమైనా ఉన్నప్పటికీ అవి వాడిని తాకలేవు.

నదీ ప్రవాహములో ఒకడు కొట్టుకు పోతూ ఒడ్డుకు చేరుకోవాలని తంటాలు పడుతుంటే - గట్టు మీద ఉన్న తుంటరి కుర్రవాళ్ళు రాళ్ళుపెట్టి కొడుతున్నట్లు - మన మనస్సులో ఉన్న కోరికలే (వాసనలే) మనము హృదయములోకి దిగకుండా అడ్డుపడుతున్నాయి. గురువు యొక్క అనుగ్రహము ఉన్నవాడు మాత్రమే ఈ వాసనలలోనుంచి బయట పడగలడు.

గురువు అంటే మన కంటికి కనిపించే ఆరు అడుగుల దేహము మాత్రమే కాదు - సత్యాన్ని దర్శించిన ఆత్మజ్ఞాని! “నేను గురువును” అని ప్రకటించుకున్న ప్రతీవాడు గురువు కాదు - దేహబుద్ధిని దాటిన వాడు మాత్రమే గురువు శబ్దానికి అర్హుడు. బాహ్యాభోగాల కోసం పరుగెడుతున్న మన మనస్సును బాహ్యా గురువు అంతర్ముఖపరచి హృదయ గుహలోకి గెంటుతాడు - హృదయములో ఆత్మగా ప్రకాశిస్తున్న లోపలి గురువు మన మనస్సును హృదయములోకి గుంజుకుంటాడు! మంత్రము చెప్పిన ప్రతివాడు గురువు కాదు - ఏ మహాత్ముని చెంత మీ మనస్సు చల్లబడుతుందో, శాంతిలో కూరుకుపోతుందో, అతనే మీకు గురువు. ఏ పరమ పవిత్రుని నోటిమాట మిమ్మల్ని వెన్నంటి తరుముకు వస్తుందో, ఏ మహాత్ముని కంటిచూపు మీలోని చైతన్యాన్ని మేల్కొలుపుతుందో, ఏ సత్పురుషుని దర్శనము మీ మనస్సును అంతర్ముఖ పరుస్తుందో, ఏ పరమ పావనుని పాదస్పర్శ మిమ్మల్ని పునీతుల్ని చేస్తుందో - ఆ మహాత్ముడే మీకు

గురువు! తన ప్రేమతో, చూపుతో, మాటతో, మౌనంతో, స్పర్శతో, ఆదరణతో, ఆప్యాయతతో, అజ్ఞానములో కొట్టుకు పోతున్న మనల్ని ఆకర్షించి, మన హృదయములో జ్ఞాన జ్యోతిని వెలిగించి, మన బుద్ధిని శుద్ధిచేసి, మన మనస్సును అంతర్ముఖ పరచి, ఆత్మలో లయింప చేసేవాడే మనకు గురువు!

గురువు దేహముతో ఉండవచ్చు - ఉండకపోవచ్చు. గురువు పనిచేయుటకు దేహముతో పనిలేదు. గురువు దేహముతో ఉన్నప్పుడు కూడ పనిచేస్తున్నది ఆ దేహము కాదు - ఆ దేహములో ఉన్న చైతన్యమే! ఆ చైతన్యము మనకు అనుభవములోకి వచ్చేవరకు జన్మజన్మలకు మన చేయి పట్టుకొని మనల్ని నడిపించేవాడే - గురువు! పులినోటిలో పడిన మాంసపు కండయినా జారిపోతుందేమో గాని - ఒక్కసారి గురువు యొక్క అనుగ్రహములో పడినవాడు మాత్రము రక్షింపబడే తీరతాడు.

గురువు మనకు చేసే సహాయము లోపల - అది బాహ్యంగా మన కళ్ళకు కనిపించేది కాదు, మన కొలతలకు అందేది కాదు. గురువు మాటల కంటే కూడ మౌనము శక్తివంతమయినది. గురువు మౌనంతోనే మనల్ని తనంతటి వాడిని చేసి ఆత్మ సింహాసనం మీద అధిష్టింపచేస్తాడు. గురువు మౌనం కూడా మాట్లాడుతుంది. గురువు పట్ల విశ్వాసము ఉన్నవాడికి మాత్రమే ఆ మౌనబోధ అర్ధమవుతుంది. గురువు యొక్క మౌనాన్ని తక్కువ అంచనా వేయకండి. ఎందు

చేతనంటే గురువు యొక్క మౌనము మనో మూలములో నుంచి వస్తున్నది. గురువు యొక్క మౌనములో శాంతి శక్తి ఉంటుంది. మన మనస్సులో మోయలేని బండరాళ్లను, స్వప్రయత్నముతో తొలగించుకోలేని బలహీనతలను ఆయన తన మౌనముతో బయటకు లాగి మంట పెట్టగలడు. మనస్సులోని వాసనలు నిశ్శేషంగా బయటికి పోకుండా ఏ జీవుడూ జ్ఞాని కాలేడు. గురువు అనుగ్రహం లేకుండా కేవలము మన స్వప్రయత్నముతోనే ఒక్క వాసనను కూడ మనము పోగొట్టుకోలేము.

జీవితం పొడుగునా మనము ఏ విషయాల వెంట ఇష్టంగా తిరిగామో - ఆ విషయాలన్నీ మన ప్రాణ ప్రయాణ సమయములో మన శిరస్సులో విజృంభిస్తాయి. శ్వాసపోయే చివరి క్షణములో వచ్చిన ఆ చివరి తలంపు మంచిదైతే మంచిజన్మ - చెడ్డదైతే చెడ్డ జన్మ వచ్చి తీరుతుంది - ఇది ఈశ్వర చట్టం! ఈ సందర్భములో గురువు మనకు చేసే మహోన్నతమైన సహాయం ఒకటి ఉంది! ప్రాణము పోయే చివరి క్షణములో ఉదాత్తమైన ఉన్నతమైన సద్వాసనను మన శిరస్సులోకి తీసుకు వచ్చి మనకు ఉత్కృష్టమైన మరు జన్మను తీసుకు వచ్చే శక్తి గురువు ఒక్కడికి మాత్రమే ఉంది. ఈశ్వరుడికి మనమీద కోపము వస్తే మన గురువు మనల్ని రక్షించగలడు. కానీ మన గురువుకే గనుక మన మీద కోపము వస్తే ఆ ఈశ్వరుడు కూడా మనల్ని రక్షించలేడు. అందుకే జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఋణము తీర్చుకోవచ్చును. బడిలో

పాఠాలు చెప్పిన గురువుల ఋణము తీర్చుకోవచ్చును - కానీ మన అజ్ఞానాన్ని హరించి మన స్వరూపాన్ని మనకు పట్టిచూపే సద్గురు ఋణము మాత్రము తీర్చుకోలేము. గురువుతో భౌతిక సంబంధము వీలు పడకపోతే కనీసము మానసిక అనుబంధమున్నా సరిపోతుంది.

మన ప్రియతమ గురుదేవులు తన జీవితమంతా చివరి శ్వాస వరకు మనకు జ్ఞానామృతాన్ని కురిపించారు. ఒక లైటు వెలుగులో కూర్చుని మనము చదువుకుంటున్నప్పుడు ఆ లైటింగ్ మనకు సరిపోతుంటే మరో లైటు దగ్గరకు పరుగెడతామా? పరుగెట్టము! ఇంతకాలము మనము ప్రేమించి, పరితపించింది దేహమాత్రుడైన గురువునా? కాదు! నిత్యసత్యమైన చైతన్య స్వరూపుడైన సద్గురువును! ఆ మహాత్ముని తనువు పడిపోయినంత మాత్రాన రోజుకో గురువు దగ్గరకు ఎలా పరుగెట్టగలుగుతున్నారు? ఆయన బోధించిన బోధామృతము మీ బుద్ధికి అందలేదా? ఆ ఆత్మరుచి కనీసం మీకు రుచి తెలియలేదా? మీ గురువు పట్ల మీకున్న విశ్వాసం ఏ పాటిదో మీ హృదయాన్ని మీరే తడిమి చూసుకోండి. ఒకవేళ నా మాటలు మిమ్మల్ని నొప్పించి ఉంటే నన్ను క్షమించి ఆశీర్వదించండి.

# 7. జీవ లక్షణాలు

ఆత్మ మన హృదయములో నిరంతరము స్వయంగా ప్రకాశిస్తున్నప్పటికీ అది మన అనుభవములోకి రాకుండా మన జీవలక్షణాలే మనకు అడ్డుపడుతున్నాయి. మనకున్న రాగ ద్వేషాలు, కామక్రోధాలు, మధమాత్సర్యాలు, అసూయా ద్వేషాలే మనల్ని పట్టి పీడిస్తున్న జీవ లక్షణాలు, మన జీవ లక్షణాలే మనకు శత్రువులు. జీవలక్షణాలు ఉన్నంత కాలము మనము జీవులమే! జీవులందరూ పశువులే! అందుకే పరమేశ్వరుణ్ణి "పశుపతి" అని కూడ అంటారు. జీవ లక్షణాలు, ఉన్నంత కాలము పశువులకు మనకు తేడా ఏమిటి? మనలాగే పశు వులు కూడా పుడుతున్నాయి, పెరుగుతున్నాయి, చస్తున్నాయి - మరి తేడా ఏమిటి? భగవంతుడు మనకు బుద్ధిని, ఆలోచనా శక్తిని, వివేకాన్ని ప్రసాదించాడు. కానీ పశువులకు వివేకము లేదు. అందుకే వివేకము లేనివాడిని వింతపశువు అంటారు. మనకు బాహ్యా శత్రువులుంటే వారు మన దేహానికి మాత్రము హాని చేయగలరు. కానీ మన జీవ లక్షణాలు మన ఆధ్యాత్మిక పురోగతిని నిరోధించి జ్ఞానము రాకుండా అడ్డుపడుతున్నాయి.

మనము గమ్యము చేరతామా - లేదా అన్నది తరువాత, అసలు గమ్యము ఏమిటో కూడా తెలియని గందర గోళంలో ఉన్నాము. "ఏది ధర్మం - ఏది అధర్మం, ఏది నీతి - ఏది అవినీతి, ఏది జ్ఞానం - ఏది అజ్ఞానం, ఏది సహేతుకం - ఏది అహేతుకం, ఏది నిత్యం - ఏది అనిత్యం" అనే విచక్షణ కూడ లేని భక్తి

మనది. విచక్షణ లేని భక్తి రావణాసురుని భక్తిలా ఉంటుంది.

మీ దగ్గరున్న పది రూపాయలు దానము చేసి ఏదో గొప్ప త్యాగం చేశామనుకుంటున్నారు. కానీ అది కాదు త్యాగం! మనము ఆత్మానుభవము పొందకుండా అడ్డుపడుతున్న జీవలక్షణాలను విడిచి పెట్టడమే నిజమైన త్యాగం! అహంకారాన్ని పోగొట్టుకోవటానికి మనము చేసే సాధనలు సత్కర్మ - అహంకారాన్ని అలంకరించుకోవటానికి చేసే సాధనలు దుష్కర్మ! సత్కర్మ సుఖాన్ని తీసుకు వస్తుంది - దుష్కర్మ దుఃఖాన్ని తీసుకు వస్తుంది. మనము ఆవేశాన్ని చంపుకుని ఆలోచనను పెంచుకోవాలి. ఆవేశము ఆలోచనల్ని, తెలివితేటల్ని, వివేకాన్ని చంపివేస్తుంది - బుద్ధిని పాడు చేస్తుంది. నష్టం వచ్చే వ్యాపారాన్ని ఇంకెన్నాళ్ళు చేద్దాము?

మనము గుడికి వెళ్ళి పూజలు చేస్తున్నాము - ఎందుకు? దేవుని మీద ప్రేమతో చేస్తున్నారా - లేక మీ కోరికలు నెరవేరటం కోసం చేస్తున్నారా? ఒకవేళ మీరు చేసే పూజల వల్ల మీ కోరికలు నెరవేరితే నెరవేరవచ్చుగాక - కానీ మీ మనస్సు మాత్రం శుద్ధి కాదు - మోక్షము రాదు. మనలోని జీవలక్షణా లను విడిచి పెట్టడమే నిజమైన పూజ! మనము డబ్బులు ఖర్చుపెట్టి ఘనకార్యాలు చేసి అహంకారాన్ని అలంకరించు కోవటం కంటే ఆకలితో బాధపడుతున్న ఒక అభాగ్యుడికి పట్టెడు మెతుకులు ప్రేమతో పెట్టండి - దైవానుగ్రహం మీపైన వర్షించి మీ బుద్ధి శుద్ధి అవుతుంది, మీ హృదయము విశాలమవుతుంది.

మనము ఏదో ఒక కులానికో, ఒక మతానికో బానిసలమై భజన చేస్తే జ్ఞానము రాదు - మన బుద్ధికి పని చెప్పాలి. మనము చేసే పూజలు, జపాలు, ధ్యానాలు, యాగాలు వలన మన బుద్ధి శుద్ధి కానప్పుడు ఆ భక్తి వలన మనకు ప్రయోజనము ఏమిటి? అహంకారాన్ని అలంకరించుకోవటం కోసము మనము సాధనలు చేయకూడదు. మన జీవలక్షణాలను పోగొట్టుకొనుట కోసము, నైతిక విలువల్ని పెంచుకోవటం కోసము మనము సాధనలు చేయాలి. దేహ ప్రారబ్ధాన్ని అనుభవించటానికి మనము ఈ భూమ్మీదకు వచ్చాము. దేహం వచ్చినందుకు ఏదో ఒక పని చేస్తూనే ఉంటాము. ఆ పని చేసేటప్పుడు ఏదో ఫలితాన్ని ఆశించే పనిచేస్తాము. మంచి పని చేస్తే పుణ్యము వస్తుంది - చెడ్డ పని చేస్తే పాపము వస్తుంది. పుణ్యము వలన సుఖము వస్తుంది - పాపము వలన దుఃఖము వస్తుంది. ఈ పాపపుణ్యాలు రెండూ అనుభవిస్తే ఖర్చయిపోతాయి - శాశ్వతం కాదు. మనము చేసే పని పెద్దదయినా - చిన్నదయినా త్రికరణ శుద్ధిగా చేయాలి. మనము చేతులతో చేసే పనిని చూడడు దేవుడు - ఆ పని చేసేటప్పుడు  మనము ఏ ఉద్దేశ్యముతో చేస్తున్నామో అది చూస్తాడు. మీరు గొప్పల కోసం, గౌరవాల కోసం ఘనకార్యాలు చేస్తే మీకు గొప్పలు రావచ్చు, లోకం మిమ్మల్ని దండలు వేసి గౌరవించవచ్చు. కానీ మీరు పవిత్రులు కాలేరు. మీ బుద్ధి శుద్ధి కాదు, దైవానుగ్రహం మీపైన వర్షించదు. భగవంతుడు ఎంత సహజంగా, నిర్వికారంగా, నిస్వార్థంగా పని చేస్తున్నాడో

అదే విధముగా మనము కూడ సమాజ శ్రేయస్సు కోసం పని చేయాలి. అలా చేస్తే మీరు పునీతులు అవుతారు.

ఏ పని నిమిత్తము మన దేహం ఈ భూమ్మీదకు వచ్చినదో ఆ పనిని మనకు ఇష్టమున్నా చేయాలి - ఇష్టము లేకపోయినా చేయాలి. పని చేయకుండా తప్పించుకొనే అవకాశమే లేదు. కనుక దేహ ప్రారబ్ధాన్ని అయిష్టముతో కాకుండా ఇష్టముతో ఓర్పుగా ప్రశాంతముగా అనుభవిస్తే ప్రారబ్ధకర్మ ఖర్చైపోతుంది - కొత్తవాసనలు పుట్టవు - మరల ఈ భూమ్మీదకు రావలసిన పనిలేదు.

కర్తృత్వ బుద్ధితో మనము పని చేసినంతకాలము ఫలితము వస్తుంది. ఆ వచ్చిన ఫలితాన్ని మనము అనుభ విస్తాము. ఆ అనుభవములోనుంచి వాసన (సంస్కారము) పుడుతుంది. ఆ వాసన బీజ రూపములో మన హృదయములో దాగి ఉంటుంది. మరుజన్మలో ఆ బీజములో నుంచి మరల కోరికపుడుతుంది. ఆ కోరిక మనచేత మరల పని చేయిస్తుంది - మరల ఫలితం వస్తుంది. ఆ వచ్చిన ఫలితాన్ని మరల అనుభవిస్తాము. ఆజన్మకాజన్మ ఆ వాసన మరింత బలపడు తుంది - ఇది కర్మచక్రం! కర్తృత్వ బుద్ధి ఉన్నంతకాలం ఈ కర్మ చక్రములో నుంచి ఏ జీవుడు బయట పడలేడు. ప్రతీ జన్మలోను కోరికలను తీర్చుకోవటం కోసమే మనిషి పని చేస్తుంటాడు. కోరికలను తీర్చుకుంటూ మానవుడు కోరికలను జయించలేడు. మనస్సు ఉన్నంతకాలము కోరికలు వస్తూనే

ఉంటాయి. మనోమూలము చూసేవరకు మనస్సు చావదు. తప్పు చేసేది మనస్సు, కానీ శిక్ష అనుభవించేది శరీరము. దేహము ఉన్నంతకాలము మనము బట్టలు ఎలా వేసు కుంటామో - కోరిక ఉన్నంత కాలము దేహము వచ్చి తీరుతుంది. దేహము వస్తే చావు పుట్టుకలు తప్పవు.

పూర్వ జన్మలో మనము ఏం చేశామో మనకు తెలియదు. కానీ భగవంతుడికి అన్నీ తెలుసు! ఆయన సర్వసాక్షి! మనము చేసిన కర్మలను బట్టి మనము ఏ తల్లి గర్భములో ఎప్పుడు, ఎక్కడ పుట్టాలో - ఏ పనిని ఎప్పుడు ఎక్కడ ఎలా చేయాలో - చివరి శ్వాసను ఎప్పుడు ఎక్కడ ఎలా విడిచి పెట్టాలో అన్నీ నిర్ణయించిన తరువాతనే మనల్ని ఈ భూమ్మీదకు పంపించాడు ఈశ్వరుడు. కర్త ఆయన! కర్మఫలదాత ఆయన! ఆయన ఆడించినట్లు ఆడే తోలు బొమ్మలం మనము. మనకు స్వేచ్ఛ లేదు. మన చేతిలో ఉన్న కర్మను మనము కర్తృత్వము లేకుండా చేసే అవకాశము మాత్రమే మనకు ఉంది. కనుక మనము చేసే పనిని స్వార్థం లేకుండా సమాజ శ్రేయస్సు కోసం, ఈశ్వర ప్రీతి కోసమే చేయాలి.

బంగారము లేకుండా ఆభరణము ఉండదు. అదే విధంగా ఆత్మ లేకుండా జీవుడు ఉండడు. మరి హృదయములో ఆత్మ ఉన్నప్పటికీ దానిని తెలుసుకోవాలనే బుద్ధి మనకు ఎందుకు పుట్టటం లేదు? దానికి కారణం మన మనస్సులో గూడు కట్టుకున్న జీవ లక్షణాలే! అద్దము మీద దుమ్ముంటే

అద్దములో మన ప్రతిబింబము కనిపించదు. అదే విధముగా హృదయములో ఉన్న జీవ లక్షణాలను మనము సాధన చేసి పోగొట్టుకోనంతకాలము మన హృదయములో ప్రకాశిస్తున్న ఆత్మ మనకు తెలియబడదు. బాహ్య భోగాల కోసము మన మనస్సు పరుగెడుతున్నంతకాలము మన మనస్సు బహిర్ముఖం అవుతూనే ఉంటుంది. మనస్సు అంతర్ముఖం కానంతకాలం ఆత్మ తెలియబడదు. దేహానికి వచ్చిన రోగాన్ని నిర్లక్ష్యము చేస్తే ఆ దేహమే పోతుంది గాని - మనస్సును నిర్లక్ష్యము చేస్తే మనము ఇంకా ఎన్నో శవాల్ని మోయాలి - ఎన్నో శ్మశానాల్లో కాలిపోవాలి.

# 8. విచారణ మార్గము

ఆత్మ మన అనుభవములో లేదు - కానీ నిత్యము మనము అంటున్న "నేను" మన అనుభవములో ఉంది! మనము అంటున్న ఈ "నేను ఎవడను?" అని ప్రశ్నించుకొని దానిని విచారణ చేస్తే ఈ "నేను" మనస్సు నుండి విడివడి అంతర్ముఖమై తనమూల మును శోధించుకుంటూ హృదయము వైపు ప్రయాణం చేస్తుంది. ఎప్పుడైతే మనస్సు నుండి ఈ "నేను" విడువడినదో అప్పుడు మనస్సులోని కోరికలు విజృంభించుటకు ఆధారము లేక వాటి వేగము తగ్గి క్రమంగా సన్నగిల్లి రాలిపోతాయి.

ఒక కుక్క వచ్చి మన ఇంట్లో జొరబడుతున్నప్పుడు దానిని మనము మందలిస్తే అది వెనుతిరిగి వెళ్ళిపోతుంది. మరుసటి రోజున అది మరల వస్తుంది. అప్పుడు కూడా మనము మరల మందలిస్తే వెనుతిరిగి వెళ్ళిపోతుంది. తరువాత ఇక లాభము లేదనుకుని ఆ తరువాత మన ఇంటికి ఇక రావడం పూర్తిగా మానివేస్తుంది.

కాలక్షేపం కబుర్ల కోసం మనము పక్కింటికి వెళ్ళామనుకోండి - అప్పుడు వాళ్ళు పట్టించుకుని మర్యాదలు చేయరనుకోండి, వెనుదిరిగి వెళ్ళిపోతాము. మరల మరుసటి రోజున వెళ్ళినా వాళ్ళు మనల్ని పట్టించుకోలేదనుకోండి - ఇక వారింటికి వెళ్ళడం మానేస్తాము. అదే విధంగా మన మనస్సు

అంతర్ముఖమై దాని మూలమును శోధిస్తున్నప్పుడు - మనస్సులో వచ్చే కోరికలు విజృంభించుటకు ఆధారము లేక అవకాశము చిక్కక అవి వెనుతిరిగి వెళ్ళిపోతాయి. క్రమంగా కోరికల యొక్క వేగము తగ్గిపోతుంది. కోరికల యొక్క వేగము తగ్గిన కొలది మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది - చాపల్యము తగ్గిన మనస్సుకు హృదయంలోనున్న ఆత్మరుచి అందుతుంది. ఆత్మరుచి అందిన కొలది మనస్సు ఆత్మలో స్థిరముగా నిలబడిపోతుంది. మనస్సు ఆత్మలో స్థిరపడిన వెంటనే అహంవృత్తి నశించి అహంస్ఫురణ కలుగుతుంది - ఆత్మ తానుగా వ్యక్తమౌతుంది. జీవించి ఉండగానే మీరు మృత్యువును దాటిపోతారు. శాశ్వతమైన సుఖము, శాంతి, ఆనందము మీ సొంతమౌతాయి.

ఉన్నతమైన, ఉదాత్తమైన ఆధ్యాత్మిక జీవితంలోకి ప్రవేశించుటకు "నేను ఎవ్వడను?" అన్న ప్రశ్న మొదటి మెట్టు! దేహము మరణించక ముందే ఈ ప్రశ్నకు సమాధానము తెలిసినవాడు చివరి మెట్టును చేరుకుంటాడు. ఈ ప్రశ్నకు సమాధానము తెలుసుకొనుటకు మనము జీవితం నుంచి, బాధ్యతలు విడిచిపెట్టి అన్నపానాలు మానుకొని అరణ్యాలకు వెళ్ళవలసిన పని లేదు. భగవాన్ శ్రీ రమణ మహర్షుల వారు చెప్పిన విచారణ పద్ధతి మీ బుద్ధికి అందకపోతే - మీ మనస్సును కూడా ఆత్మగా చూడటం నేర్చుకోండి! సముద్రములో వచ్చే అలలు సముద్రము కంటే వేరుగా ఉండవు కదా? మనము మంచు గడ్డను, నీటిని వేర్వేరుగా చూస్తాము. కానీ మంచుగడ్డ

కరిగిపోతే - అది నీరే కదా? అదే విధముగా మనస్సుకు మూలము ఆత్మ! మనము మనస్సును ఆత్మగా చూడగల్గితే - ఉన్నది ఆత్మే! చీకటిలో తాడును చూసి మనము పాము అని భ్రమపడతాము. లైటు వేసి చూస్తే అది పామా? పాము కాదు తాడు! అదే విధముగా మనకు జ్ఞానము కలిగిన తరువాత తెలుస్తుంది - ఉన్నది ఆత్మేనని! ఆత్మకు భిన్నంగా మనస్సు అనేది లేనే లేదని!

గడ్డి వెంటులోని గడ్డి పరకల్ని ఒక్కొక్కటిగా లాగివేస్తే గడ్డి వెంటు ఉంటుందా? పొయ్యిలోని పుల్లల్ని ఒక్కొక్కటిగా తీసి వేస్తే పొయ్యిలోని మంట ఆరిపోతుంది కదా? అదే విధముగా మనస్సులోని కోరికలు (వాసనలు) అన్నీ రాలిపోతే మనస్సు అనేదే ఉండదు. "లేని మనస్సును నిగ్రహించుకోవడం, అన్వేషించడం నీకెందుకు? నీవు మనస్సు కాదు - ఆత్మ! నీవుగాని మనస్సు గొడవ నీకెందుకు? దానిని పట్టించుకోకు - నీవు నీవుగా (ఆత్మగా) ఉండు - సరిపోతుంది" అంటున్నారు మన సద్గురు శ్రీనాన్నగారు!

భగవంతుడు ఎంతటి శక్తిమంతుడని మనము అనుకుంటున్నామో - నిజానికి మనము ఊహించిన దానికంటే కూడ ఆ భగవంతుడు శక్తిమంతుడు. మన కళ్ళకు కనిపిస్తున్న ఈ లోకానికి, ప్రకృతికి, పంచభూతాలకు, పరలోకాలకు అన్నింటికీ ఆ పరమాత్మే ఆధారము. మనము సినిమాతెర మీద ఉన్న బొమ్మల్ని మాత్రమే చూస్తాము. కానీ ఆ బొమ్మలకు ఆధారముగా ఉన్న తెరను చూడము. మనము బంగారు నగల్ని

చూస్తామే గాని ఆ నగలకు ఆధారముగా ఉన్న బంగారాన్ని చూడము. ఈ సృష్టి ఉన్నా లేకపోయినా ఆత్మ ఎప్పుడూ ఉంటుంది. అంతటా ఉన్న ఆత్మ మన లోపల - బయట, ఈ సమస్త జీవకోటిలోనూ ఉంది. అంతటా ఉన్న ఆత్మను లేదని - మనము ఉన్నామని అనుకుంటున్నాము. దానికి కారణం మన జీవలక్షణాలే! చిత్త శుద్ధి, సూక్ష్మ బుద్ధి, బుద్ధిలో వివేకము ఉన్నవాడు మాత్రమే ఆత్మశక్తిని అంతటా చూడగలడు.

మనకున్న కోరికల్ని మరల మరల అనుభవిస్తే అవి వాసనలుగా మారతాయి. ఈ వాసనలను బట్టే మన ప్రవృత్తి (స్వభావము) ఏర్పడుతుంది. ఈ ప్రవృత్తిని నిరోధించి పవిత్రులు అవటం కోసము మనము చేయు ప్రయత్నమే సాధన! మన బుద్ధిని సంస్కరించుకుని పవిత్రులు అవ్వడం కోసమే మనము ఈ భూమ్మీదకు వచ్చిన పని! సాధన చేస్తే క్రమంగా మన స్వభావము మారుతుంది-సత్వగుణము వస్తుంది. సత్వగుణము ఉన్న వాడికి సహనము వస్తుంది. సహనము వలన వివేకము పెరుగుతుంది. వాడి బుద్ధి శుద్ధి అవుతుంది. బుద్ధి శుద్ధి కానివాడు ఇహానికీ పనికిరాడు - పరానికీ పనికిరాడు.

విషయ భోగాల మీద మనకు కోరిక ఉన్నంత కాలము వాటిని అనుభవించటానికి ఇంద్రియాలు ఉండాలి. ఇంద్రియాలు ఉండాలంటే దేహము ఉండాలి. దేహము ఉండాలంటే జన్మ వచ్చి తీరుతుంది. మన మానసిక ఆరోగ్యము బాగుపడాలంటే తలంపుల విషయములో మనము జాగ్రత్తగా ఉండాలి.

మనము జన్మ వచ్చినందుకు మనకున్న పాత అలవాట్లు తగ్గించుకోవాలి - కొత్త అలవాట్లను పోగు చేసుకోకూడదు. ఆశ వలన కోరిక, కోరిక వలన కోపము వస్తుంది. ఈ మూడు దుర్గుణాలలో నుంచి బయట పడటానికి మనము ప్రయత్నము చేయాలి.

మనము రోడ్డు మీద వెళుతున్నప్పుడు మనకళ్ళకు ఎంతోమంది కనిపిస్తారు. కానీ వాళ్ళనందరినీ మనము పట్టించుకోము. అదే విధంగా మనకు వచ్చే తలంపులన్నింటినీ మనము పట్టించు కోకూడదు. దైవ దర్శనానికి మనము గుడికి వెళ్ళినప్పుడు ముందుగా మనకు ఎత్తైన గోపురం కనిపిస్తుంది. ఆ గోపురం మీద రకరకాల బొమ్మలు కనిపిస్తాయి. ఆ బొమ్మల్ని చూస్తూ గోపురం చుట్టూనే మనము తిరుగుతూ ఉంటే - మరి గర్భగుడిలోకి మనము వెళ్ళేది ఎప్పుడు? దైవ దర్శనము మనము చేసుకునేది ఎప్పుడు? మనము గుడిలోకి వెళ్ళి దేవుణ్ణి చూడగానే మన కళ్ళు మూసుకొని దణ్ణం పెడుతూ కోరికల దండకాన్ని మొదలు పెడతాము. దేవుణ్ణి చూడగానే మనకళ్ళు అప్రయత్నంగా ఎందుకు మూతపడతాయి? దేవుడు కరుణామయుడు కాబట్టి మనమీద జాలిపడి - "బయట కనిపిస్తున్న నన్నేం చుస్తావురా? నిజము నీ లోపల హృదయ ములో ఉంది. నీ హృదయములో ఉన్న నన్ను చూడరా!" అని మన మనస్సును అంతర్ముఖ పరుస్తాడు. అంతర్ముఖ మైన మన మనస్సును హృదయములో ఉన్న ఆత్మ లోపలికి గుంజు

కుంటుంది. అందుకే అప్రయత్నముగా మనకు తెలియకుండానే మనకళ్ళు మూతపడతాయి. నిజమేమిటో మన మనస్సుకు తెలియకపోయినా హృదయములో ఉన్న ఆ దేవునికి తెలుసు!

మన కళ్ళకు కనిపిస్తున్న ఈ లోకమంతా ఒక సంత! ఆ సంతలో అనేక వింతలు ఉంటాయి. ఆ వింతల్ని చూస్తూ మనము సంతకు వచ్చిన పనిని మర్చిపోతే ఆ సంతలోనే ఉండిపోతాము. సంతకు ఎందుకు వచ్చామో గుర్తున్నవాడు సంత పూర్తి చేసుకుని ఇంటికి వెళ్ళిపోతాడు. అదే విధంగా మనము ఆత్మను తెలుసుకోటానికి ఈ భూమ్మీదకు వచ్చాము. వచ్చిన పనిని మర్చిపోయి ఈ లోకంలోని చెత్తనంతా పోగు చేసుకుంటూ మన అహంకారాన్ని అలంకరించు కుంటు న్నాము. మీకు చేతనైతే మీ తెలివితేటలతో మీ బలహీనతల్ని తెలుసుకొని మీ మనస్సును మీరు సంస్కరించుకోండి. అంతే గాని ఎదుటివారిలోని లోపాలను తెలుసుకోవటానికి మీ కాలాన్ని వృథా చేయకండి. మన జీవిత గమ్యం మోక్షం! మోక్షం పొందటానికి మన తెలివి తేటలు ఉపయోగ పడనప్పుడు ఆ తెలివి తేటలు ప్రయోజనం ఏమిటి?

దేవుడు మనకు ఒక దేహాన్ని మాత్రమే ఇచ్చి ఊరుకోలేదు - బుద్ధిని కూడ ఇచ్చాడు! ఆ బుద్ధికి వివేకాన్ని, ఆలోచనా శక్తిని, విచక్షణా జ్ఞానాన్ని కూడ ఇచ్చాడు. కారును నడిపే డ్రైవరు లాంటిది మన బుద్ధి! బుద్ధి సక్రమంగా లేకపోతే భౌతికంగా మీకు ఎన్ని భోగభాగ్యాలు ఉన్నప్పటికీ మీరు సుఖపడరు.

అందుచేత మంచి మంచి ఆలోచనలతో మీ బుద్ధికి పదును పెట్టండి. మీ ఆలోచనలే మీ ఇంద్రియాలను నడిపిస్తాయి. ఇంద్రియ నిగ్రహము ఉన్నవాడికి రాగ ద్వేషాలు తగ్గి బుద్ధి బాగుపడుతుంది. మానసిక ఆరోగ్యము బాగుపడితే శారీరక ఆరోగ్యము దానంతట అదే బాగుపడుతుంది. ఎందుచేతనంటే మనస్సు చెప్పినట్లు శరీరము నడుస్తుంది. కాని శరీరము చెప్పినట్లు మనస్సు నడవదు. అందుచేత మనస్సు బాగుపడా లంటే మీకు మనో నిగ్రహము, ఇంద్రియ నిగ్రహము చాలా ముఖ్యము.

మనస్సులోని బలహీనతల నుంచి బయట పడాలంటే మనము మనో నిగ్రహాన్ని అభ్యాసము చేయాలి. అభ్యాస వైరాగ్యములు ఉన్నవాడికి మాత్రమే మనో నిగ్రహము సాధ్యపడుతుంది. మనోనిగ్రహము సాధించుటకు ఉపవాసము, సహవాసము, ఏకాంతవాసము ఉపయోగపడతాయి. ఉపవాస మంటే తిండి తినడం మానివేసి అన్నాన్ని స్మరించడము కాదు. గీతలో కృష్ణుడు చెప్పిన యుక్తాహారం తింటూ దైవ చింతనతో దేవుడికి దగ్గరగా ఉండడమే ఉపవాసము. సహవాసాల విషయములో కూడ మనము జాగ్రత్తగా ఉండాలి. చెడు స్నేహాల వలన మనస్సు చలిస్తుంది. ఒకడికి పేకాట ఆడే అలవాటు ఉందనుకోండి - వాడు వెళ్ళేదారిలో నలుగురు కూర్చుని పేకాట ఆడుకుంటున్నారు అనుకోండి - వాళ్ళను చూడగానే వీడి మనస్సు చలిస్తుంది. వాడు ఎంత నిగ్రహించు కుందామని అనుకున్నా తన అలవాటుకు వాడి మనస్సు

లొంగిపోతుంది - ఆ నలుగురితో వీడూ చేరిపోతాడు. అదేవాడు పేకాట అలవాటు లేనివాడితో స్నేహము చేస్తే ఆ వాసన రాలిపోతుంది. ఒక మనిషి చెడిపోయినా - బాగుపడినా స్నేహాలే కారణం. ఒక పచ్చని పైరు చేలో ఒక పశువు పడితే ఆ పైరునంతా ఎలా పాడుచేస్తుందో - చెడు స్నేహాల వలన దుర్గుణాలకు బానిసలై, ఉన్న కాస్త భక్తీ జారిపోతుంది. పెద్ద చెరువులో రాళ్ళువేసినా ఫరవాలేదు గాని - ఒక చిన్న గుంటలో రాళ్ళు వేస్తే ఉన్న ఆ కాస్తనీరు కూడా బురదలైపోతుంది. మనము అందరితోనూ మాట్లాడవచ్చు - కానీ కొందరితోనే స్నేహం చేయాలి. ఏకాంతవాసమంటే మనందరికీ భయమే! ఎందుకని? హృదయములో మోహమున్న మనిషి ఒంటరిగా ఉండలేడు. మనమందరము ఈ లోకంలోకి ఒంటరిగానే వచ్చాము - మరల ఈ లోకాన్ని విడిచి వెళ్ళేటప్పుడు కూడ మనము ఒంటరిగానే వెళ్ళాలి. మరణాంతరము మీ జతగాళ్ళు ఎవ్వరూ మీకు తోడురారు.

మనము ఏకాంతముగా ఉన్నప్పుడే మన మనస్సులోని బలహీనతలు మనకు తెలుస్తాయి. ఆ బలహీనతలలో నుంచి బయట పడటానికి మనము ప్రయత్నము చేయాలి. ఏకాంత వాసము వలన మీ మనస్సు ఏకాగ్రమౌతుంది. ఏకాగ్రమైన మనస్సుకు సాధన సాఫీగా సాగిపోతుంది.

“దేవుడి మీద విశ్వాసము లేనివాడు నాస్తికుడు కాదు - తనమీద తనకు విశ్వాసం లేనివాడు నాస్తికుడు” - అన్నాడు స్వామి వివేకానంద! తనమీద తనకు విశ్వాసం లేనివాడికి

మనస్సు చలిస్తుంది. మనము ఏదైనా ఒక పని చేసేటప్పుడు. వాళ్ళే మనుకుంటారో - వీళ్ళేమనుకుంటారో అని భయపడ కూడదు. ఎదుటివాళ్ళు ఏమనుకుంటే మీకెందుకు? సొంత బుద్ధిని విడిచి పెట్టి ఎదుటి వారి అహంకారానికి మీరు బానిసలైనంత కాలము మీ మనస్సు వికసించదు, వికారము తగ్గదు, వివేకము పెరగదు - ఆధ్యాత్మికంగా పురోగతి సాధించలేరు.

మనకు కడుపులో నొప్పి వస్తున్నదంటే మన కడుపులో ఏదో కారణం ఉండాలి. అదే విధముగా మన మనస్సు చలిస్తున్నదంటే మన మనస్సులో ఏదో దోషం ఉండాలి. ఆ బలహీనత ఏమిటో మనకు తెలియాలంటే మన మనస్సును మనం పరిశీలన చేసుకోవాలి. జాగ్రదవస్థలో మన బలహీనతలు ఎదుటివారికి తెలియకుండా మనము నటించవచ్చును. కానీ స్వప్నావస్థలో మన బలహీనతలు ఏమిటో మనకు తెలుస్తాయి. ఆ బలహీనతలలో నుంచి బయట పడటానికి జాగ్రదవస్థలో మనము ప్రయత్నము చేయాలి. ఆ బలహీనతలు లేని వ్యక్తులతో మనము సహవాసము చేయాలి.

భగవంతుడు అందరి హృదయాలలో ఆత్మగా ప్రకాశిస్తున్నానని చెప్పినా మనము ఎందుకు నమ్మడం లేదు? ఈ రోజున మనము ఒక మంచి పనిని చేయలేక పోతున్నామంటే దానికి కారణం భయము! మనము నమ్మిన విశ్వాసాలు తప్పు అని తెలిసినప్పటికీ వాటిని విడిచి పెట్టలేకపోతున్నామంటే

దానికి కారణం మనకు ధైర్యము లేకపోవటమే! మనస్సులో మోహమున్న మనిషి పాపము చేసి తీరతాడు. ఆ చేసిన పాపము భయము రూపములో వెంటాడుతుంది. భయము జ్ఞాన విరోధి! గీతాంజలిలో రవీంద్రనాథ్ టాగూర్ "తండ్రీ! నన్ను భయము లేని స్థితికి మేల్కొలుపు" అని దేవున్ని ప్రార్థిస్తాడు. అందుకే వాసుదేవుడు వైరాగ్యమనే గొడ్డలితో తన మోహమనే వృక్షాన్ని నరకమన్నాడు. పిరికివాడు ఆత్మ సామ్రాజ్యానికి అధిపతి కాలేడు - మోక్ష సింహాసనాన్ని అధిష్టించలేడు.

అన్ని ధర్మాలను విడిచి పెట్టి తనను ఒక్కడినే శరణు వేడితే వాడిని అన్ని పాపాల నుంచి విడుదల చేసి వాడికి మోక్షము ప్రసాదిస్తానని గీతలో వాసుదేవస్వామి వాగ్దానము చేసి చెప్పాడు. అయినప్పటికీ భగవంతుడి మాటలను మనము విశ్వసించలేకపోతున్నామంటే దానికి కారణము మన మనస్సులో ప్రకృతి వాసనల బలము ఎక్కువగా ఉందని అర్థము. ప్రకృతి వాసనల బలము తగ్గించుకుని భగవంతుని మీద విశ్వాసము పెంచుకోవటం కోసమైనా మనకు ధైర్యము ఉండాలి. పిరికివాడు పరమాత్మలో ఐక్యము కాలేడు.

ఒక మనిషి మరో మనిషిని చంపితే అది ధైర్యము కాదు - పిరికితనము. రావణాసురుడు ఒంటరిగా ఉన్న సీతమ్మను ఎత్తుకు వెళ్ళాడు - వాడు ధైర్యవంతుడు కాదు! రామరావణ యుద్ధం జరుగుతుండగా "రావణా! యుద్ధములో నీ రథము విరిగిపోయింది, నీ ఆయుధాలు అన్నీ అయిపోయాయి. నీ శరీరమంతా గాయాలతో అలసిపోయింది. నీవు ఇంటికి వెళ్ళి

విశ్రాంతి తీసుకుని రేపు మరల యుద్ధానికి రా!" అని చెప్పాడు శ్రీ రామచంద్రుడు! ఆయన ధైర్యవంతుడు. మనకు భగవంతుని మీద విశ్వాసము లేదు. అందుకే భగవంతుని మీద మనము భారము వేయలేక పోతున్నాము. భగవంతుని మీద భారము వేయగలిగితే ఆయనకు అసాధ్యమంటూ లేదు.

బుద్ధిలో దోషమున్నవాడు మంచిమాట వినడు. శాస్త్రములలో చెప్పినది వాడికి అసత్యమనిపిస్తుంది. నిజానికి దేవుడు ఉన్నాడు - మనము లేము. మీకు ఎన్ని తెలివి తేటలు ఉన్నా మీరెవరో మీకు తెలియనప్పుడు ఆ తెలివిని ఏమి చేసుకుంటారు. "ఎవడికైతే దోషము లేదో, ద్వేషము లేదో, దుఃఖము లేదో, ఎవడైతే శుభాశుభములను విడిచి పెడుతున్నాడో - వాడంటే నాకు ఇష్టం!" అని గీతలో వాసుదేవస్వామి చెప్పాడు. కానీ మనమేమి చేస్తున్నాము? శుభాలను మాత్రమే కోరుకుంటాము - అశుభాలంటే మనకు ఎవ్వరికీ ఇష్టముండదు. కానీ మనిషి వెంట నీడలాగా శుభం వెంట అశుభం కూడా వచ్చి తీరుతుంది - ఇది తథ్యం!

ఎవడి బుద్ధికి తోచినట్లు వాడు జీవించడం గొప్పకాదు - దేవుడు చెప్పినట్లుగా నడుచుకుంటే మన బుద్ధి శుద్ధి అవుతుంది, జ్ఞానము కలుగుతుంది, మోక్షానికి దారి కనిపిస్తుంది. పవిత్రత అనే గేటు ద్వారా మాత్రమే మనము మోక్షము పొందగలము. స్వార్థమే పరమార్థంగా మనము జీవించినంత కాలము పవిత్రులము కాలేము. మనము

పూవులతో దేవున్ని పూజిస్తున్నాము. అలాగే మనము చేసే పనితో కూడ దేవున్ని పూజించడం నేర్చుకోండి! అలా చేస్తే మన బుద్ధి శుద్ధి అవుతుంది - హృదయము విశాలమవుతుంది - మనము పవిత్రులమవుతాము.

మనము అందరం ఇలా వుండాలి - అలా వుండాలి, ఇలా చేయాలి - అలా చేయాలి, ఇలా తినాలి - అలా తినాలి అని అనుకుంటాము. కానీ ఇష్టాయిష్టాలను నిర్ణయించుకునే స్వేచ్ఛ, శక్తి మనకు ఉందా? మరి లేనప్పుడు ఈ ప్లానులన్నీ ఎందుకు? మన తెలివి తేటలే, మన సొంత నిర్ణయాలే మనల్ని దేవునికి దూరం చేస్తున్నాయి. జీవుడికి స్వేచ్ఛ, శక్తి లేవు. దేవుడు ఒక్కడు మాత్రమే స్వతంత్రుడు, సర్వ శక్తిమంతుడు. ఈ సృష్టిలో ఆయన సంకల్పమే జరుగుతుంది. జీవులందరు కర్మబద్ధులు - దేవుని చేతిలో కీలు బొమ్మలు. మన అందరి జీవితాలు రిలీజు అయిన సినిమా లాంటివే! సినిమా చూస్తున్నప్పుడు మనకు నచ్చని సన్నివేశాన్ని మార్చాలంటే మనం మార్చగలమా? అది మన చేతిలో లేదు. అదే విధముగా జన్మ వచ్చిన తరువాత దేహ ప్రారబ్ధములో జరుగవలసింది జరిగే తీరుతుంది - జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా అది జరుగనే జరుగదు. కనుక ఊరక ఉండుట ఉత్తమము! కానీ మనమందరము దేవుని కంటే కూడ మనమే తెలివిగల వాళ్ళం అని అనుకుంటున్నాము. అందుకే మనము ఏవేవో ప్లానులు వేస్తూ కలలు కంటూనే ఉంటాము. మనస్సు ఉన్నంతకాలము సంకల్పాలు వస్తూనే ఉంటాయి - ప్లానులు వేస్తూనే ఉంటాము.

మనము ఎన్ని ప్లానులు వేసినా జరిగేది మాత్రం ఈశ్వరుని సంకల్పము మాత్రమే! ఒక్కొక్కసారి ఈశ్వరుని సంకల్పమూ, మన సంకల్పమూ ఒక్కటే అయ్యి ఆ పని జరిగినప్పుడు దేవుని దయ వల్ల మనము అనుకున్నది జరిగిందని అనుకుంటాము. ఒక్కోసారి ఈశ్వర సంకల్పమూ - మన సంకల్పమూ వేరు అయినప్పుడు మన సంకల్పము జరగకపోతే ఆ దేవుని దయ మనమీద లేదని దేవుడి మీద నింద వేస్తాము. కాని అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ జరిగేది మాత్రము ఈశ్వరుని సంకల్పమే! మన సంకల్పానికి శక్తి లేదు. భగవంతుని సంకల్పానికి శిరస్సు వంచి గౌరవించి, ప్రశాంతంగా, ఈశ్వర ప్రసాదంగా స్వీకరించి కర్తృత్వము లేకుండా లోకకళ్యాణం కోసం పనిచేస్తే - ఆ పని మనల్ని పునీతుల్ని చేస్తుంది. ఉన్న వాసనలు ఖర్చయి - కొత్త వాసనలు పుట్టవు. దైవానుగ్రహము మన పైన వర్షించి మనకు దారి కనిపిస్తుంది - ఆత్మ సుఖం మన సొంతం అవుతుంది.

మనమందరము ఎలా జీవిస్తే సుఖపడతామో, ఏమి చేస్తే శాంతిని పొందుతామో కనీస అవగాహన లేకుండా బ్రతుకుతున్నాము. ఎంతసేపూ మన మందరమూ దేవుడి దగ్గర కొబ్బరికాయ కొట్టి పుణ్యము మూట కట్టుకుందామనే మన ఆలోచన. కనీసం ఎదుటి వాడి క్షేమం కోరి ఒక మంచిమాట కూడా మనము చెప్పము. ఎందుకని? మరల వాడెక్కడ బాగుపడిపోతాడో అని మన ఆలోచన! అటు వంటప్పుడు మనము పవిత్రులం ఎలా అవుతాం? మన కోరికలు తీరుస్తాడనే ఆశ ఉంది కాబట్టే దేవుడి దగ్గర పూలు, పళ్ళు

పెడుతున్నామే గాని దేవుడి మీద ప్రేమతో కాదు. మన కోరిక నెరవేరకపోతే ఆ దేవున్ని కూడా మార్చివేస్తాము. మనము ఏది చేసినా మన స్వార్థమే పరమార్థం! పుణ్యమే మన లక్ష్యం! పుణ్యం ఎందుకు? ఇంకా మంచి జన్మల కోసం! మంచి జన్మలు ఎందుకు? ఇంకా మంచి భోగాలు అనుభవించడం కోసం! మనం కోరుకునేది భోగమా - లేక యోగమా?

మనస్సు అనే సమస్యను పరిష్కరించుకోనంత కాలం మనిషి వెంట నీడలా మన సంసారము మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. మనమందరము గుడ్డలు మార్చుకుని అడవులకు వెళ్ళి మోక్షం పొందాలను కుంటున్నాము. కాషాయ గుడ్డలు కట్టుకుని ఇల్లు విడిచి అడవులకు వెళ్తే - మన ఇల్లు మారుతుంది, బట్టలు మారతాయి, మన పరిసరాలు మారతాయి - కానీ మన మనస్సు మాత్రం మారదు. మనము జయించవలసినది మన మనస్సును. మనస్సును మింగిన వాడు యోగి అవుతాడు. మనస్సుకు లొంగినవాడు భోగి అవుతాడు. పర్యవసానములో భోగి రోగి అవుతాడు. ఇంటి దగ్గర అన్ని సదుపాయాలు ఉన్నప్పుడే మీ మనస్సును మీరు జయించ లేనప్పుడు అడవులకు వెళ్ళి జయించగలరా? ఈ లోకాన్ని జయించినవాడు వీరుడు కాదు - తన మనస్సును జయించిన వాడే నిజమైన వీరుడు - వాడే ధీరుడు! ఇల్లు, భార్యా బిడ్డలే సంసారం కాదు - మీ మనస్సే సంసారము. మీ మనస్సును సంస్కరించుకోటానికి మీ ఇంట్లో వాళ్ళెవరూ మీకు అడ్డుపడటంలేదే? మీరు, మీ ఇష్టాలను చంపుకునే ధైర్యము

మీకు లేక ఎదుటి వాళ్ళ మీద నెపాన్ని నెట్టివేయకండి. తప్పు చేస్తున్నది మీ మనస్సు! మీ మనస్సును శిక్షించుకోలేక మీ దేహాన్ని ఎందుకు శిక్షిస్తారు? మనస్సు కూర్చోమంటే దేహము కూర్చుంటుంది - మనస్సు నిలబడమంటే దేహం నిలబడు తుంది. తప్పు చేసేది మనస్సు - మరి దేహానికి ఎందుకు శిక్ష?

మీరు మతాలను మార్చుకున్నా, దేవుళ్ళను మార్చుకున్నా, గురువుల్ని మార్చుకున్నా మీరు సుఖపడరు. మీరు మారు మనస్సు పొందండి - మీ మనస్సును మీరు సంస్కరించుకోండి. మీ మనస్సులో మంచి తలంపులు వచ్చేటట్లు చూసుకోండి - దానికి ఖర్చేముంది? భావదారిద్ర్యం పనికిరాదు. చలించటం మనస్సు స్వభావము. నిరంతరం ఏదో ఒక రూపం చుట్టూ తిరుగుతూనే ఉంటుంది. వాళ్ళు మనకు ఇష్టమున్న వాళ్ళు కావచ్చు - ఇష్టం లేని వాళ్ళు కావచ్చు. ఎదుటివారిని ఉద్ధరించే శక్తి మనకు ఎలాగూ లేదు- కనీసం మనల్ని మనము సంస్కరించుకుందాము. ఎదుటివారి అదృష్టాన్ని చూసిగాని, ఆనందాన్ని చూసిగాని మీరు అసూయ పడకండి. అసూయ ఉన్నవాళ్ళ మనస్సు మలినమైపోతుంది - అశాంతితో కాలిపోతుంది. నిరంతరమూ ఏదో ఒక రూపం మన బుర్రలో కుదురు లేకుండా చేస్తూనే ఉంటుంది కదా? ఏ రూపమైతే మన మనస్సును చలింపచేస్తుందో - వాళ్ళమీద మనకున్న ఇష్టాయిష్టాలను ప్రక్కన పెట్టి - వాళ్ళు సుఖంగా, శాంతిగా, ఆనందంగా ఉండాలని హృదయ పూర్వకంగా ప్రేమతో కోరుకోండి! దానికి ఖర్చు ఏముంది? వాళ్ళు సుఖపడతారో -

లేదో అది తరువాత విషయం! ముందు మీకు కొత్త వాసనలు పుట్టవు - పాతవాసనలు పలుచబడతాయి. మీ మనస్సు చలనం తగ్గి, మనస్సు చల్లబడుతుంది. మనో చలనము ఆగి ధ్యానము కుదురుతుంది, మనస్సు ఏకాగ్రమౌతుంది, దాని మూలాన్ని అది తెలుసుకుంటుంది. మనో మూలము తెలియకుండా ఏ జీవుడు జ్ఞాని కాలేడు.

మన మనస్సును మచ్చిక చేసుకుంటే అది మిత్రునిలా మేలు చేస్తుంది - విరోధము పెట్టుకుంటే అది శత్రువులా హాని చేస్తుంది. అందుచేత మనస్సుతో విరోధము పెట్టుకోకుండా దానికి అర్థమయ్యేటట్లుగా నచ్చచెప్పాలి. స్వాధీనమైన మనస్సు మిమ్మల్ని బాగు చేస్తుంది - స్వాధీనములో లేని మనస్సు పతనం చేస్తుంది. అభ్యాస వైరాగ్యాలతో మనస్సును స్వాధీనములోకి తెచ్చుకుంటే సమబుద్ధి సిద్ధిస్తుంది. సమబుద్ధి ఉన్నవాడు నిర్వికారంగా ఉండగలడు. నిర్వికార స్థితి పొందినవాడు మోక్షస్థితిని పొందగలడు. మోక్ష స్థితి పొందిన వాడికి దేహమున్నా - లేకపోయినా, లోకము కనిపించినా - కనిపించకపోయినా తాను ఉన్నాననే అనుభవము వాడికి ఉంటుంది. అప్పుడు వాడి ఇంద్రియాలు, వాడి మనస్సు కదలమంటే కదలవు - సుఖము, శాంతి వాడి సొంతమౌతాయి - వాడి నుంచి శాంతి, శక్తి ఈ లోకానికి ప్రసరిస్తాయి.

మానవ జన్మ వచ్చినందుకు, భగవంతుడు మనకు చేతులు ఇచ్చినందుకు మనము మంచి పనులు చేయాలి,

నోరు ఇచ్చినందుకు మంచి మాటలు మాట్లాడాలి, కళ్ళు ఇచ్చినందుకు మంచి దృశ్యాలను చూడాలి, చెవులు ఇచ్చినందుకు మంచి మాటలు వినాలి. ఆత్మ చింతన చేయకుండా పూర్వ జన్మల గురించి, రాబోయే జన్మల గురించి ఆలోచిస్తూ కళ్ళముందున్న వర్తమాన కాలాన్ని చంపి వేయకండి. కాలము, ఈశ్వర స్వరూపము - కాలాన్ని మనము గౌరవించాలి. ధనకాంక్ష ఉన్నవాడు ధనం కోసం ఎలా పని చేస్తాడో, కీర్తి కాంక్ష ఉన్నవాడు కీర్తికోసం ఎలా తాపత్రయ పడతాడో, అధికారకాంక్ష ఉన్నవాడు అధికారం కోసం ఎలా ప్రాకులాడతాడో - అలాగే ఆత్మజ్ఞానం కోసం తపనపడిన వాడికి మాత్రమే ఆత్మ తెలియబడుతుంది. సత్పురుషులను ఆశ్రయించి, వారిని సేవించి, గౌరవించి, వారి ప్రబోధనలను శ్రవణము చేసి మీ హృదయపు లోతుల్ని మీరు పెంచుకోండి. సత్పురుషుల సాన్నిధ్యములో దేహభావన తగ్గుతుంది. వారి అనుగ్రహము వలన మనస్సు అంతర్ముఖమై ఆత్మలో కరిగిపోతుంది. ఆత్మసుఖం మీ సొంతమౌతుంది - మీ దుఃఖం అంతా ఆరిపోతుంది.

# 9. మరణము

భగవంతుడు మనము "ఆత్మ" అని చెప్పాడు. ఆత్మకు చావు పుట్టుకలు లేవని, అది సత్ చిత్ ఆనంద స్వరూపమని, అది మన హృదయములో నిరంతరము స్వయముగా ప్రకాశిస్తున్నదని చెప్పాడు. కాని మనకు దేహబుద్ధి ఉంది కాని ఆత్మబుద్ధి లేదు. అందుకే దేహము పుట్టినప్పుడు మనము పుట్టామను కుంటున్నాము - దేహము మరణిస్తుంటే మరణిస్తు న్నామనుకొంటున్నాము. దేహమాత్రుడినే తాను అనుకున్నంత కాలము మానవుడు మరణాన్ని అతిక్రమించలేడు - జనన మరణ చక్రములో నుంచి బయట పడలేడు.

దేహాత్మ బుద్ధినే అహంకారమని అంటారు. అహం కారానికి రూపము లేదు. కానీ అది రూపము లేకుండా ఉండలేదు. కనుక శరీరము ముసలిదై తన కోరికలు తీర్చుకోటానికి సహకరించకపోతే మరో కొత్త శరీరంలోకి మారుతుంది. ఆ మార్పునే మరణము అంటారు. ఈ రోజు పగటికి - రేపటి పగటికి మధ్యన రాత్రి మన నిద్ర ఎటువంటిదో - ఈ దేహానికి మరోదేహానికి మధ్యన మరణం అటువంటిదే! కాకపోతే రాత్రి మనము పోయే నిద్ర పొట్టిది - మరణము ఒక దీర్ఘ నిద్ర అంతే! ఈ జన్మకు మరోజన్మకు మధ్యన ఉన్న విరామమే మరణము! ప్రతిరోజు ఉదయం నిద్రలేవగానే మన దేహములోనే మనము మేల్కొంటాము - కానీ మరణాం తరము మరో కొత్త దేహములో మేల్కొంటాము - అంతే తేడా!

మన నిత్య జీవితంలో ఎన్నో సంఘటనలు జరుగుతుంటాయి - అలాగే మరణమనేది కూడ ఒక సంఘటనే! కాకపోతే ఇది జీవితములో జరిగే చివరి సంఘటన - అంతే!

మరణము వలన మీరు ఏమీ మారరు - మీరు మీరుగానే ఉంటారు. మరణము వలన మీ దేహము మారుతుంది, మీ పరిసరాలు మారతాయి. మీ తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు, బంధుమిత్రులు మారతారు. మరి మారనిది ఏమిటి? మీ స్వభావము గాని, మీ రాగ ద్వేషాలు గాని, మీ ఇష్టాయిష్టాలు గాని, మీ ఆలోచనలు, అభిరుచులు గాని ఏమీ మారవు. ప్రాణ ప్రయాణ చివరి క్షణములో జీవితం పొడుగునా మీరు విన్న, చూసిన, చేసిన ప్రతీ సంఘటన అది మంచిదైనా - చెడ్డదైనా మీకు జ్ఞాపకము వచ్చి తీరుతుంది. మరణమనేది ప్రతీ మనిషి జీవితంలో ఒక పరీక్ష వంటిది. అందుకే మనము తినే ఆహార విషయములో ఎంత జాగ్రత్తగా ఉంటామో - అదే విధంగా మనము చూసే, వినే, మాట్లాడే, చేసేపని విషయంలో ప్రతీక్షణము మనము అప్రమత్తంగా ఉండాలి - అశ్రద్ధ పనికి రాదు. జీవితం పొడుగునా మనము దేనికోసమైతే ప్రాకు లాడామో ఆ బలమైన కోరిక మన ప్రాణము పోయే చివరి క్షణములో “నామాట ఏం చేశావు? నామాట ఏం చేశావు?” అని మన శిరస్సులో విజృంభిస్తుంది. దానికి సమాధానం చెప్పటం కోసము ఆ బలమైన కోరికను పట్టుకుని మన జీవుడు బయటికి పోతాడు. అప్పుడు మన శ్వాస ఆగిపోతుంది - మన

శరీరము శవం అవుతుంది. ఆ చివరి కోరికను బట్టే మనకు రాబోయే జన్మ నిర్ణయించబడుతుంది.

మరణమంటే అందరికి భయమెందుకు? మరణిస్తే మరల మనకి దేహం కనబడుతుందో - లేదో, ఈ సంసారం కనబడుతుందో - లేదో, అనే కదా మీ భయము? ఎప్పుడో మరణము దాకా ఎందుకు? ప్రతిరోజు రాత్రి గాఢ నిద్రలో మన దేహం తోటి, మన సంసారం తోటి మనకు సంబంధము తెగిపోతూనే ఉందిగా? గాఢనిద్రలో మనము ఎక్కడ పడుకున్నామో కూడా మనకు తెలియదు గదా? మరి అప్పుడు ఎందుకు భయము వేయుట లేదు? అంటే నిద్రలేవగానే మన దేహము, మన భార్యాబిడ్డలు, ఇల్లు వాకిలి, మన సంసారం అంతా మన కళ్ళకు కనిపిస్తున్నాయి - ఇది మన అనుభవము! నిజానికి నిద్ర ఎటువంటిదో - మరణము కూడా అటువంటిదే! దేహబుద్ధిని దాటనంత కాలము మానవుడు పుడుతూనే ఉంటాడు - మరణిస్తూనే ఉంటాడు. నిజానికి "నేను" అను తలంపు పుట్టినప్పుడే మనము పుట్టాము - మరల ఈ "నేను" అను తలంపు దాని పుట్టుచోటైన ఆత్మలో కలిసిపోయినప్పుడే మనము మరణిస్తాము. ఈ "నేను" అను తొలి తలంపే అహంకారము - దానినే జీవుడు అంటారు. ఈ నేను అను తలంపును ఆధారము చేసుకొనే మిగిలిన అన్ని తలంపులు వస్తున్నాయి - ఈ తలంపుల మూటే మనస్సు! పూర్వజన్మలలో కర్తృత్వముతో మనము చేసిన పనులన్నీ సంస్కారాల రూపములో మన హృదయములో దాగి ఉంటాయి - దానినే

సూక్ష్మ శరీరము అంటారు. మరణానంతరము కట్టెలలో మన దేహము కాలిపోతుందే గాని - సూక్ష్మ శరీరము కట్టెలలో కాలదు - మరుజన్మకు పయనిస్తుంది. మరణముతో దేహ యాత్ర ఆగిపోతుందే గాని - జీవుని యాత్ర ఆగదు! సూక్ష్మ శరీరంలో దాగి ఉన్న తన కోరికలు తీర్చుకోవటానికి మరో కొత్త శరీరం ధరించి ఈ భూమ్మీదకు సిద్ధమౌతాడు.

హృదయములో దాగి ఉన్న వాసన తలంపు రూపములో శిరస్సులోకి వచ్చే వరకు మన హృదయములో ఉన్న వాసనలు ఏమిటో మనకే తెలియవు. హృదయములో ఉన్న వాసన శిరస్సులోకి వచ్చి అది తలంపుగా మారిన తరువాత దానిని నిగ్రహించుట చాలా కష్టము. హృదయములో ఉన్న వాసనలు నిశ్శేషముగా బయటికి పోకుండా ఏ జీవుడూ బంధములో నుంచి బయట పడలేడు. మానవుడు తాను ఆత్మ అయివుండి, హృదయములో స్వయముగా ప్రకాశిస్తున్న ఆత్మను తెలుసు కొనుటకు తన హృదయమును శోధించుట మాని శాస్త్రము లను శోధిస్తున్న మానవ మానసాన్ని అంతర్ముఖ పరచి ఆత్మనిష్ఠకు "నేను ఎవడను?" అను విచారణ పద్ధతిని బోధించిన ఆచార్య వరిష్ఠుడే భగవాన్ శ్రీ రమణ మహర్షుల వారు! మనకు ఆత్మఅనుభవములో లేదుగాని - మనము అంటున్న "నేను" మన అనుభవములో ఉంది. నేను అంటున్న ఈ "నేను ఎవడను?" అని ప్రశ్నించి విచారణ చేస్తే - ఈ "నేను" మనస్సు నుండి విడువడి అంతర్ముఖమై ఆత్మలో కలిసిపోతుంది. ఆత్మ తానైన వాడికి ఇక మరణమేమిటి?

గాఢనిద్రలో మనము ఉన్నాము - ఎలా ఉన్నాము? సుఖముగా ఉన్నాము. అప్పుడు మనకు మనస్సు గొడవ గాని, దేహం గొడవ గాని, దేవుని గొడవ గాని, లోకం గొడవ గాని ఏమీ లేవు - మనము మాత్రం సుఖంగా ఉన్నాము. ఆ సుఖంగా ఉన్న మీరు మెలుకువలో కూడ ఉన్నారు - కానీ సుఖముగా లేరు. ఎందుకని? గాఢనిద్రలో సుఖంగా ఉన్న మీ నేనుకు మెలుకువ రాగానే ఒక దేహాన్ని అంటగడుతున్నారు. గాఢనిద్రలో పరిమితులు లేని మీరు మెలుకువ రాగానే దేహానికే పరిమితమై పోతున్నారు. ఆ దేహముతో తాదాప్యము పొందుట వలన ఆ దేహమునకు వచ్చు తలంపులతో మీరు కలిసిపోతున్నారు. దేహముతో కలిసిపోగానే మీ స్వరూప సుఖానికి మీరు దూరమై పోతున్నారు - దుఃఖములో కూరుకుపోతున్నారు.

జాగ్రదవస్థలో మన అందరి సంకల్పాలు, స్వభావాలు వేరువేరుగా ఉన్నప్పటికీ హృదయంలో మాత్రము మనమందరము ఒక్కటిగానే ఉన్నాము - ఆ ఆత్మగానే ఉన్నాము. గాఢ నిద్రలో కూడా మనమందరము ఒక్కటిగానే ఉన్నాము. ఆ ఆత్మగానే ఉన్నాము. జాగ్రదావస్థలో గాని, నిద్రావస్థలో గాని, ఆ ఆత్మ మన అనుభవములో లేదు. దానికి కారణం మన దేహ బుద్ధే! దేహ ప్రారాబ్ధాన్నిబట్టి మీ మనస్సు తప్పులు చేసినప్పటికీ - అప్పుడు కూడా మీరు మనస్సు కాదు - మీరు ఆత్మ! మీ మనస్సు దాని మూలములో కలిసిపోతే మీ మనస్సుతో పాటు మీరు చేసిన పాపపుణ్యాలు కూడ కాలిపోతాయి. అప్పుడు

పాపమూ లేదు - పుణ్యమూ లేదు. మీరు మాత్రమే ఉన్నారు! ఆత్మగానే ఉన్నారు.

కృషి మన చేతిలో ఉంది - కృప ఆ దేవుని చేతిలో ఉంది. మన చేతిలో ఉన్న పనిని కర్తృత్వము లేకుండా లోక కళ్యాణం కోసం చేస్తే దైవానుగ్రహము మనమీద వర్షిస్తుంది - బంధములో నుంచి బయట పడతాము - మరణాన్ని అతిక్రమిస్తాము - దుఃఖాన్ని దాటిపోతాము - స్వరూప సుఖాన్ని అనుభవిస్తాము.

# 10. నిజము తెలియాలంటే?

"హృదయములోనే ఆత్మ ఉందంటున్నారు. ఆ ఆత్మే దేవుడు అంటున్నారు. ఆ ఆత్మే మనమంటున్నారు. ఆ ఆత్మలోనే సుఖము, శాంతి, ఆనందము ఉందంటున్నారు. ఆ ఆత్మను తెలుసుకుంటేనే మోక్షమంటున్నారు. ఆ ఆత్మ దర్శనము కానంతవరకు బంధములో నుంచి బయట పడలేమంటున్నారు. బంధములో ఉన్నంత వరకు మీ కళ్ళకు ఎవరైనా దేవుడు కనిపించినా ఆ దేవుడు కూడ నిజం కాదు - అది కూడా ఒక దృశ్యమే అంటున్నారు - మరి ఆ ఆత్మను తెలుసుకోవాలంటే మనము ఏమి చేయాలి?" అని అందరూ అడుగుతుంటారు.

"మనందరికి ఒక దేహముంది, ఆ దేహానికి ఒక పేరుంది" ఆ నామ రూపాలకే మనము పరిమితమైనంతకాలం బంధములో నుంచి బయట పడలేము. దేహబుద్ధే మనిషికి సంకెళ్ళు! ఈ సంకెళ్ళను తెంచుకునే వరకు మీరున్నారు, లోకముంది, దేవుడు ఉన్నాడు. ఎవడి సంకెళ్ళను వాడు తెంచుకోలేడు. ఈ నిజము తెలుసుకోటానికే మనకు కనిపిస్తున్న ఈ గుడులు, గోపురాలు, గ్రంధాలు, గురువులు.

మనందరికి దేవుడంటే ఇష్టమే! మన దేహం మీద మనకున్న ఇష్టముతో పోలిస్తే ఆ దేవుడి మీద ఉన్న ఇష్టం చాలా తక్కువ! మనందరికి మన తెలివితేటల మీద ఉన్న నమ్మకం ఆ దేవుడి మీద లేదు. మనకున్న అండబలము, కండబలము,

ధనబలము మీద ఉన్న నమ్మకము ఆ దేవుడి మీద లేదు. అందుకే ఆ దేవుడి మీద మనం భారం వేయలేకపోతున్నాము.

గజేంద్ర మోక్షం కథ మనందరికీ తెలుసు! మొసలి బారిన పడిన గజేంద్రుడికి తన బలం మీద ఉన్న నమ్మకం ఆ దేవుడి మీద లేదు. అందుకే తన శరీరములో శక్తి ఉన్నంతకాలము పోరాడుతూనే ఉన్నాడు. చివరికి శరీరములో శక్తి తగ్గిపోయి పోరాడలేక అలసిపోయినప్పుడు మాత్రమే గజేంద్రుడికి ఆ దేవుడు గుర్తుకు వచ్చి తనను రక్షించమని ఆ నారాయణుడిని శరణు వేడుకున్నాడు - మొసలి బారినుండి రక్షింప బడినాడు.

కౌరవ సభలో వస్త్రాపహరణ సమయములో ద్రౌపది తన మాన రక్షణ కోసం చేతులు అడ్డుపెట్టుకుని పోరాడినంతసేపు శ్రీ కృష్ణుడు ఆమెను ఆదుకోలేదు. నిస్సహాయ స్థితిలో ''అన్నా నీవే రక్ష'' అని చేతులు పైకి ఎత్తి శరణువేడుకున్నప్పుడు గాని శ్రీ కృష్ణుడు కాపాడలేదు. అదే విధముగా మనము భగవంతుని మీద భారం వేయనంత కాలము మనము ఎన్ని సాధనలు చేసినా, ఎన్ని యజ్ఞ, యాగాలు చేసినా ఈ మాయ జాలములో నుంచి, ప్రకృతి వలయములో నుంచి బయట పడలేము.

ఆత్మదర్శనము అయ్యేవరకు దుఃఖము ఆరిపోదు, జన్మలు ఆగిపోవు, శాంతి చేకూరదు. ఇంద్రియ నిగ్రహము ఉన్నవాడికి మాత్రమే మనో నిగ్రహము సాధ్యపడుతుంది. మనో నిగ్రహము ఉన్నవాడికి మాత్రమే చిత్త శుద్ధి సాధ్యపడుతుంది.

చిత్త శుద్ధి ఉన్నవాడికి మాత్రమే ఆత్మ దర్శనమవుతుంది. ఆత్మదర్శనమైన వాడు మాత్రమే కర్తృత్వము లేకుండా కర్మను ఆచరించగలడు. కర్మఫలాసక్తి లేనివాడికి మాత్రమే సమత్వము సాధ్యపడుతుంది. సమత్వ బుద్ధి ఉన్నవాడికి మాత్రమే తత్వము వ్యక్తమవుతుంది - ఆత్మ తెలియబడుతుంది. సమత్వమే యోగసారము. సమత్వ దృష్టి లేనివాడు జ్ఞాని కాలేడు. నిర్విచారస్థితిని, నిర్వికారస్థితిని, నిరహంకారస్థితిని, నిష్ప్రపంచస్థితిని పొందుటయే జీవిత లక్ష్యము! అదే జన్మకు అర్థము - పరమార్థము! మనము పుట్టినప్పుడు ఏడుస్తూ పుట్టినా - మరణించేటప్పుడు నవ్వుతూ మరణించాలి! అజ్ఞానముతో పుట్టినా - జ్ఞానముతో మరణించాలి. జ్ఞానము లేని జన్మ అది వ్యర్థము.

అసూయ ఉన్నవాడు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందలేడు. అసూయను మించిన దుర్గుణం మరొకటి లేదు. అసూయ ఉన్నవాడు ఎదుటివాడిని అధః పాతాళానికి ఎప్పుడు తొక్కి వేద్దామా అని అవకాశం కోసము ఎదురుచూస్తూ అశాంతితో నిరంతరము కాలిపోతూ చివరికి పతనమైపోతాడు. వాడికి గతి - అధోగతే! అందుచేత మనకు చేతనైనంత వరకూ మంచిని చేస్తూ, మంచిని చూస్తూ, మంచిని ఆచరిస్తూ, మంచిని మాట్లాడుతూ, మంచిని స్మరిస్తూ, మంచిని జపిస్తూ, మంచిని పూజిస్తూ, మంచిని ధ్యానిస్తూ నిరంతరము సమాజ శ్రేయస్సు కోసము పనిచేస్తే మన మనస్సు సంస్కరించ

బడుతుంది. సంస్కరించబడిన మనస్సుకు సత్యము తెలియ బడుతుంది.

మన ఆధ్యాత్మిక అభివృద్ధికి ఆహార నియమము అవసరము. మనము తినే ఆహారము మీదనే మన శారీరక ఆరోగ్యము, మానసిక ఆరోగ్యము ఆధారపడి ఉంటుంది. మనము అతిగా తినకూడదు - మితముగా తినాలి! అతిగా తింటే మన శరీరానికి మన మనస్సుకి మత్తు వస్తుంది. అందుకే భగవద్గీతలో వాసుదేవుడు "యుక్తాహారము" అని చెప్పాడు. అంటే మీకు ఇష్టమైనదే, ఆకలికి సరిపడినదే, ఆరోగ్యానికి సరిపడినదే మితముగా తినమన్నాడు స్వామి! మన దేహానికి రోగము వస్తే ఆ రోగానికి సరిపడిన మందునే ఎలా వేసుకుంటామో - అలాగే ఆకలి కూడా ఒక రోగమే కాబట్టి ఆకలికి సరిపడినదే మీకు నచ్చిన ఆహారాన్నే మితముగా తినాలి. ఆహార నియమములో జాగ్రత్తగా ఉంటే అది సత్వగుణాన్ని సముపార్జించి పెడుతుంది. సత్వగుణము మనస్సును అంతర్ముఖ పరచి ఆత్మాన్వేషణకు సహకరిస్తుంది.

శారీరక అనారోగ్యానికి మూలము జీర్ణవ్యవస్థలో మొదలవుతుంది. ఆ జీర్ణకోశానికి మనము రెండు రోజులు విశ్రాంతి యిచ్చి, ద్రవరూపములో ఆహారం మాత్రమే తీసుకుంటే - జీర్ణకోశము దానంతట అదే రోగనిరోధకశక్తిని పెంచుకుని అనారోగ్యము నుంచి రికవరీ అవుతుంది. అందుకే దేహానికి అనారోగ్యము వస్తే దానికి లంఖణం పరమ ఔషదం అని మన

ప్రాచీన ఆయుర్వేద శాస్త్రము చెపుతున్నది.కానీ మనం ఏం చేస్తున్నాం? పొట్టకు రెస్టు యివ్వకుండా మూడు పూటలు తింటున్నాము. అందుకే ఈ రోజున ఇంత ప్రాణాంతక రోగాలు మానవజాతిని పట్టి పీడిస్తున్నాయి.

మన శరీరము పుడుతుంది. అది మరణిస్తుంది. కాని పుట్టుక లేని మరణము లేని సద్వస్తువు ఒకటి మన హృదయములో ఉంది. మన హృదయములో ఉన్న ఆ సద్వస్తువు అంతటా ఉంది. అది చావుపుట్టుకలు లేని సత్ చిత్ ఆనంద స్వరూపము. మానవుడికి కావలసింది దేవుడు కాదు - సుఖము, శాంతి, ఆనందము. ఆ సుఖము, శాంతి, ఆనందము అనుభవములో ఉన్నవాడికి ఆ దేవుడే వచ్చి కళ్లముందు నిలబడినా కళ్లెత్తి ఆ దేవున్ని కూడా చూడా లనిపించదు.

హృదయములో ఉన్న ఆ సద్వస్తువు నీ అనుభవములోకి వచ్చే వరకు - నీవు ఎంతటి వాడివైన, స్మశానానికి వెళ్లేవరకు యజ్ఞ, దాన, తపస్సలను విడిచి పెట్టవద్దని గీతలో వాసుదేవస్వామి చెప్పాడు.

**1. యజ్ఞం :-** అగ్నిహెూత్రంలో నెయ్యి వేయడమే యజ్ఞం కాదు. మనల్ని మనం మర్చిపోయి గొప్పల కోసం, గౌరవాల కోసం కాకుండా, దేహబుద్ధి లేకుండా సమాజ శ్రేయస్సు కోసం మనము మంచిచేసి మర్చిపోవాలి. అది యజ్ఞం! అలాచేస్తే నీ దేహబుద్ధి తగ్గిపోతుంది. నీవు ఎంతమంచి పని చేసినా

విమర్శించే వాళ్ళు ఎప్పుడూ ఉంటూనే ఉంటారు. కారు వెళ్ళేటప్పుడు కారు వెనుక ఎంతో కొంత దుమ్ము లేస్తూనే ఉంటుంది. ఆ విమర్శలకు నీవు భయపడకూడదు. భయము జ్ఞాన విరోధి!

**2. దానం :-** నీవు చేయగలిగిందే, నీ కుడిచేయి చేసేపని నీ ఎడమ చేతికి ఎలా తెలియదో అలాగా నిర్మలంగా, నిశ్చలంగా, నిరహంకారంగా, ఆడంబరము లేకుండా చేయమని భగవంతుడు చెప్పాడు. భగవంతుడు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మానవ సేవే మాధవ సేవ అని అంటారు. నరుణ్ణి కూడా మనము నారాయణుడుగా చూడగలిగితే - మనము దానము చేశాము, ధర్మము చేశాము అని అనుకోము - పూజ చేశామని అంటాము. మానవుణ్ణి మాధవుడిగా మనము చూడగలిగితే మనము చేసే ప్రతీపని అది పూజే అవుతుంది.

**3. తపస్సు :-** తపస్సు అంటే తపింప చేయుటం! అంతేగాని అన్నపానాలు మానుకుని ఒంటరిగా తలుపులేసు కుని గదిలో కూర్చోవటం కాదు - తపస్సు అంటే! నీ దేహం పుట్టింది - పుట్టుకలేని సద్వస్తువు ఒకటి నీ హృదయములో ఉంది. ఆ సద్వస్తువు నీకు అనుభవములోకి రాకుండా మన మనస్సులో ఏ బలహీనతలైతే అడ్డుపడుతున్నాయో - ఆ బలహీనతల నుంచి బయట పడటానికి మన మనస్సు

నిర్మలంగా, నిశ్చలంగా ఉండాలి. మనస్సు నిశ్చలంగా ఉండాలంటే మనము మాట్లాడే మాట, చేతితో చేసే పని, మనస్సులో వచ్చే ఆలోచనలు ఆసక్తి లేకుండా మనము చేయటమే తపస్సు! వాచక తపస్సు అంటే మనము మాట్లాడే మాట నిర్మలంగా ఉండాలి. ఎదుటి వాడికి బాధ కలగకుండా ఉండాలి, ప్రీతిగా మాట్లాడాలి, మనము చెప్పే మాటల వలన వాడి వివేకము పెరగాలి, చైతన్యస్థాయి పెరగాలి, హితవుగా ఉండాలి గాని అహితంగా ఉండకూడదు. మాటల విషయంలో మనము జాగ్రత్తగా ఉండాలి. మనము మాట మాట్లాడే ముందు మూడుసార్లు ఆలోచించిన తరువాత ఆ మాట మాట్లాడమని శాస్త్రము చెపుతుంది. మనకు మంచి తెచ్చినా మాటే - చెడు తెచ్చినా మాటే! మనము ఎదుటివారి హితవు కోరి మాట్లాడాలి గాని మన గొప్పల కోసం మాట్లాడకూడదు. ఆత్మస్తుతి - పరనింద పనికిరాదు. ఆత్మస్తుతి అహంకారాన్ని పెంచుతుంది. పరనింద పాపాన్ని తెస్తుంది. అహంకారము పెరిగే మాటలు మనము మాట్లాడటం మానివేస్తే మన మనస్సు విశాలమవు తుంది - అది ఆత్మాకారము చెందుతుంది.

నిద్ర విషయములో కూడ మనము జాగ్రత్తగా ఉండాలి. మనిషికి నిద్ర అవసరమే - మన మనస్సు ఆత్మలో అణిగి ఉంటుంది - అప్పుడు దానికి విశ్రాంతి చేకూరుతుంది. శాంతి, శక్తి వస్తుంది. కనుక నిద్ర అవసరమే కాని అతినిద్ర పనికిరాదు. అతినిద్ర వలన శరీరానికి, మనస్సుకు సోమరితనం వస్తుంది. కాలము వృధా అవుతుంది. కాలము ఈశ్వర స్వరూపము.

కనుక మనము కాలాన్ని గౌరవించాలి. సోమరి పోతులు, బద్ధకస్తులు ఆత్మాన్వేషణకు పనికిరారు - వారికి ఆత్మ తెలియబడదు. ఆహార నియమం, మాట నిగ్రహము, నిద్రానియమం పాటిస్తే మనకు పవిత్రత, ప్రవీణత, ఏకాగ్రత వస్తుంది - మనస్సు అంతర్ముఖ మవుతుంది. అంతర్ముఖమైన మనస్సు ఆత్మనిష్ఠకు దారి చూపుతుంది.

శరీరము ఇంద్రియాల చేతుల్లో ఉంది. ఇంద్రియాలు మనస్సు చేతుల్లో ఉన్నాయి. మనస్సు బుద్ధి చేతుల్లో ఉంది. బుద్ధి ఆత్మ చేతుల్లో ఉంది. ఇంద్రియా లను జయించినవాడు మాత్రమే జ్ఞాని కాగలడు గాని ఇంద్రియాలు అణిగినవాడు మాత్రము కాదు. ఇంద్రియ నిగ్రహము కోసము భగవంతుడు నాలుగు యోగాలు చెప్పాడు. ఆ నాలుగు యోగాల గమ్యము ఆత్మ దర్శనమే! కర్మయోగము కర్తృత్వము లేని కర్మను చేయమని, భక్తి యోగము తనను భగవంతునిలో కలుపుకోమని, ధ్యానయోగము మనస్సును నిగ్రహించి ఇంద్రియాలను స్వాధీనము చేసుకుని ప్రాణశక్తిని పెంచు కోమని, జ్ఞాన యోగము ఆత్మను, అనాత్మను వేరు చేయమని - చెపుతున్నాయి.

పూజ జప ధ్యానాలతో మనము దేవుణ్ణి పూజిస్తున్నాము. మనము చేతితో చేయు పూజకంటే నోటితో చేయు జపము, జపము కంటే మనస్సుతో చేయు ధ్యానము, ధ్యానము కంటే బుద్ధితో చేయు ఆత్మవిచారణ గొప్పవి. జపధ్యానాలు వలన

ఇంద్రియాలు అణుగుతాయే గాని వాసనాక్షయము కాదు. అణిగిన ఇంద్రియాలు చుట్ట చుట్టుకున్న పాము లాంటివి - అవి తిరిగి విజృంభిస్తాయి.

కాని ఆత్మ విచారణ వలన మనస్సు అంతర్ముఖం అవుతుంది. అంతర్ముఖం అయిన మనస్సుకు వాసనాక్షయమై అది ఆత్మాకారము చెందుతుంది.

"మీలో ద్వేషము ఉంటే అది మిమ్మల్ని పాడుచేస్తుంది. అసూయ ఉంటే అది మిమ్మల్ని కాల్చివేస్తుంది. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు మీలో ఉంటే మీరు శాశ్వత నరకానికి పోతారు" అని గీతలో కృష్ణ స్వామి చెప్పాడు కదా? మరి మనము చేసే ప్రయత్నం ఏమిటి? మీ నెత్తి మీద బొడుంది - దాన్ని కడుక్కోండి అంటే మనకు కోపము రావట్లేదు. కానీ మీ బుద్ధిలో ఫలానా దోషము ఉంది - దాన్ని పోగొట్టుకోమంటే మాత్రం మనకు కోపం వస్తుంది - ఎందుకని? అంటే మీ అహంకారముతో మీరు కలిసిపోతున్నారన్నమాట! మీ మనస్సులోని దోషాలే మిమ్మల్ని బంధిస్తున్నాయి, బాదిస్తున్నాయి, మీకు దుఃఖాన్ని తీసుకువస్తున్నాయి గదా? ఆ దోషాలను పోగొట్టుకోవడం కోసము మీరు చేసే ప్రయత్నం ఏమిటి? వల్లకాటిలో పుల్లలు పిడకలు మన దేహాన్ని కాల్చగలవే గాని మన మనస్సును కాల్చలేవు. ఒక్క జ్ఞానాగ్నిలో మాత్రమే మన మనస్సు కాల్చబడుతుంది. జ్ఞానాగ్నిలో కాలినవాడిని వల్లకాటిలో కాల్చకపోయినా వాడికి మోక్షము వస్తుంది. మీరు ఏ

కులములో పుట్టినా, ఏ మతములో పుట్టినా, ఏ దేవుణ్ణి ఆరాధించినా, ఏ గురువును ఆశ్రయించినా మీ మనో మూలము మీకు తెలియనంత కాలము మీకు జ్ఞానము రాదు. మీరెవరో మీకు తెలియనంత కాలము మీకు మోక్షము రాదు - ఆత్మ తెలియబడదు. కనుక మిమ్మల్ని మీరు సంస్కరించు కోండి!

# 11. మనిషి పాపము చేయకూడదనుకున్నా - పాపము ఎందుకు చేస్తాడు?

"భగవద్గీత" అంటే అదేమిటోనని మీరు అనుకోవద్దు. అది కేవలం అద్దములాంటిది. మన ముఖం మీద మసి ఉందనుకోండి - అప్పుడు అద్దంలో చూసుకుంటే మసి ఉందని తెలుస్తుంది. అదేవిధంగా ఈ భగవద్గీతా శాస్త్రాన్ని కూడా మీరు అద్దంలా ఉపయోగించుకోవాలి. అద్దంలో మన ముఖం చూసుకున్నప్పుడు మసి కనిపిస్తే మన ముఖాన్ని ఎలా తుడుచుకుంటున్నామో - అదే విధంగా ఏవైతే లోపాలని భగవంతుడు చెప్పాడో ఆ లోపాలు గనుక మనలో ఉంటే అవి తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి.

కానీ మనవేమి చేస్తున్నాం - నా లోపాల్ని నేను తొలగించు కోవటం మానివేసి, మీలో గనుక లోపం ఉంటే మిమ్మల్ని విమర్శించడం ప్రారంభిస్తున్నాను. పరదూషణ మనస్సును మలినం చేస్తుంది. అదే యేసు చెప్తాడు - మానవుడు తన కంటిలోనున్న దూలాన్ని చూసుకోలేక పోతున్నాడు. ఎదుటివాడి కంటిలోనున్న నలుసును చూస్తు న్నాడు. మానవుడిలో నున్న లోపం ఇదేనన్నాడు.

సోదరమహాశయులారా! లోపాన్ని నేను తెలుసుకోవడం

మానివేసి మీ లోపాన్ని తెలుసుకోవటం వల్ల అది నాకు కాలం వృథా, శక్తి వృథా, జీవితం వృథా. మీ లోపాల్ని నేను తెలుసుకోవటం వల్ల ఏమిటి నాకు ప్రయోజనం? నా లోపాల్ని నేను తెలుసుకొని వాటిని తొలగించుకోవడం వల్ల - ఆ మేరకే నేను ఈ సమాజానికి మేలు చేయగలను. నన్ను నేను పవిత్రుణ్ణి చేసుకోకుండా ఇలా వట్టిమాటలు చెప్తాననుకోండి - వాటి ప్రభావం మీ మీద ఉండదు. నేను ఎంతవరకు శాంతిగా ఉండగలుగుతానో - ఆ మేరకు నేను సమాజాన్ని బాగు చేసినట్లు, సమాజానికి నేను సహాయం చేసినట్లు.

రమణస్వామి ఒకమాట చెప్పారు "ఎదుటివారికి ఇచ్చే వస్తువు నీకు నీవే ఇచ్చుకున్నట్లు అని తెలిస్తే - ఇవ్వకుండా ఎవడు ఉండగలడు?" అన్నారు. అందుచేత భగవద్గీత ఉపదేశ గ్రంథం. దీనిని మనం ప్రాక్టీసు చేయాలి. ఈ ఆధ్యాత్మిక విద్యను గురించి ఒక్క మాటలో చెప్పాలంటే - సత్యాన్ని సాధన చేయటం. సత్యాన్ని మనం సాధన చేస్తే సత్యం మన అనుభవంలోకి వస్తుంది. సత్యాన్ని సాధన చేయకుండా అది మన అనుభవానికి ఎన్నడూ రాదు. టూల్స్, స్కిల్స్, టెక్నాలజీ పెరిగినంత మాత్రం చేత సత్యం బోధపడదు. ఒక జీవన్ముక్తున్ని చూసినంత మాత్రాన అలాగ అవ్వలేము. ఇది అనుకరణ వల్ల వచ్చేది కాదు. దీనికి ఎన్నో జన్మల కృషి కావాలి.

అందుచేత మీరు భగవద్గీతను శ్రద్ధగా చదవండి. అయితే "మేము ఆచరించలేక పోతున్నామండీ" అని మీరు అనవచ్చు

- ఎంతవరకూ ఆచరించగలిగితే అంతవరకే ఆచరించండి. మీరు విషయాన్ని అర్థం చేసుకోగలిగితే అది కూడా ఒక యోగమే. ఈ భగవద్గీత ఎటువంటిదంటే - తల్లి ఏం చేస్తుంది? పాలు ఇచ్చేవాడికి పాలు ఇస్తుంది, రొట్టె ఇచ్చేవాడికి రొట్టె ఇస్తుంది, అన్నం తినేవాడికి అన్నం పెడుతుంది. అదేవిధంగా భగవద్గీత కూడా తల్లిలాంటిదే. కాబట్టి భక్తియోగం, కర్మయోగం, ధ్యానయోగం, జ్ఞానయోగం అని ఎన్నో రకాల యోగాలు చెప్పింది. ఈ అన్ని యోగాలు మీరే ఆచరించాలని అనుకో నక్కరలేదు. మీకు ఏది రుచిగా ఉంటే దానినే ఆచరించండి. కొంతమందికి పూర్వజన్మలో జ్ఞానానికి సంబంధించిన సంస్కారం ఉంటే జ్ఞానయోగం మీద ఇష్టం కలుగుతుంది. భక్తికి సంబంధించిన సంస్కారం ఉంటే భక్తియోగం మీద ఇష్టం కలుగుతుంది. కర్మకు సంబంధించిన సంస్కారం ఉంటే కర్మయోగం మీద ఇష్టం కలుగుతుంది. అందుచేత భగవంతుడు అనేక రకాల యోగాలు చెప్పాడు గీతలో. ఎందుచేతనంటే - ఈ మనుష్యులు "ఎవాల్వ్" అయ్యేటప్పుడు అనేక "స్టేజెస్"లో ఉంటారు. వారి వారి సంస్కారాలకు తగినట్లుగా ఈ గీతలో చెప్పాడు. అందుచేత మీకు నచ్చిన మార్గం మీరు తీసుకుని - దానిని ప్రాక్టీసు చేయండి. ఈ భగవద్గీతను మీ జీవితంలో ఒక భాగంగా చేసుకోండి. అది మిమ్మల్ని బాగు చేస్తుంది. జీవితం నుండి యోగమును వేరు చేయకూడదు. ఇప్పుడు కర్మయోగంలో కొన్ని శ్లోకాలు చెప్పుకుందాము.

ఇక్కడ అర్జునుడు పరమాత్మను ఒక ప్రశ్న అడిగాడు - "ఓ కృష్ణా! మనిషికి చెడ్డ చేయాలని ఉండదు. చెడ్డ చేయాలని అనుకోనప్పటికీ చెడ్డ ఎందుకు చేస్తున్నాడు? దీనికి కారణం ఏమిటి?" అని అడిగాడు.

దానికి సమాధానంగా వాసుదేవస్వామి ఇలాచెపుతున్నాడు -

**1. కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణం ॥**

"ఓ అర్జునా! నీవు అడిగావుచూసావు ప్రశ్న - మనిషి పాపం చేయకూడదనుకున్నప్పటికీ మనిషి పాపం చేస్తున్నాడు, చెడు చేయకూడదనుకున్నప్పటికీ చెడు చేస్తున్నాడు. దీనికి కారణం ఏమిటంటే - ఒకటి కామం, రెండు క్రోధం - ఇవి ఉండటం వల్ల మనిషి పాపం చేయకూడదని తెలిసినప్పటికీ, పాపం చేయడం తనకు ఇష్టం లేకపోయినప్పటికీ - మనిషి బలాత్కారముగా పాపము చేస్తున్నాడు".

కామం అంటే కోరిక, తృష్ణ, డిజైర్ - క్రోధం అంటే కోపం, యాంగర్. పైకి రెండుగా కనిపిస్తున్నాయే గాని ఉన్నది ఒక్కటే. కామం వేరు, క్రోధం వేరు కాదు. ఈ కామక్రోధాలనే రాగద్వేషాలు అని కూడా అంటారు. రాగం ఉన్న చోట కామం ఉంటుంది, ద్వేషం ఉన్న చోట క్రోధం ఉంటుంది. కామక్రోధాలు ఉన్న మనిషి నిరంతరం కాలిపోతూ ఉంటాడు.

గౌతమ బుద్ధుడు ఒక చక్కని మాట చెప్పాడు - "ఈ

ప్రపంచంలో ఉన్న రుగ్మత అంతా ఈ రాగద్వేషాల లోనే ఉంది. ఈ ప్రపంచంలో ఏ మూలకు వెళ్ళి చూసినా ఏమున్నాయి రాగద్వేషాలు తప్పించి" అన్నాడు.

ఈ కామక్రోధాలు రజోగుణములో నుంచి పుడుతున్నాయి. ఇవి రెండూ ఉన్నచోట రజోగుణము పెరుగుతుంది. ఈ కామం మహా శని. దానికి ఆకలి బాధేగానీ, అజీర్తి బాధ లేదు - ఎంతైనా భరించగలదు. ఈ కామం ఎంత శని అంటే ఈ ప్రపంచంలోని వస్తు సంపదనంతా కలిపినప్పటికీ ఒక్క మనిషిలోని కామాన్ని తృప్తిపరచలేదట. అంత శనట.

సత్వగుణము, రజోగుణము, తమోగుణము - ఇవన్నీ ప్రకృతి గుణాలు. ఈ ప్రకృతి గుణాలలో నుంచి మనము బయటపడాలి. ఈ ప్రకృతి గుణాలు ఎక్కడో బయట లేవు. మనలోనే ఉన్నాయి.

"ఉన్నది ఒక్కటే - అదే ఆత్మ" అని భగవంతుడు చెపుతుంటే అది మన అనుభవంలో లేదు. మనమందరము వేరు వేరుగా కనిపిస్తున్నాము. అలా ఎందుకు కనిపిస్తున్నామంటే - మనలోని కామక్రోధాల వల్లనే! మీ కోరికలు వేరు - నా కోరికలు వేరు. ఈ కోరికల సముదాయమే మనస్సు! ఈ మనస్సే జీవుడు! కనుక ఈ కోరికల్ని తీసి ప్రక్కన పెడితే అసలు వ్యక్తి లేడు. కాని సిగరెట్లు, బీడీలు మానలేని స్థితిలో మనముంటే - ఈ కామక్రోధాల్ని ఎక్కడ విడిచి పెట్టగలం చెప్పండి? మీ హృదయంలో ప్రకాశిస్తున్న సత్యం మీకు తెలియాలంటే ఈ

కామక్రోధాలను వదలండి - అప్పుడు ఉన్న వస్తువు ఉన్నట్లుగా మీకు తెలుస్తుంది! అది శాశ్వత సత్యం! కాని మనం చిన్న చిన్న అలవాట్లనే విడిచిపెట్టలేనప్పుడు ఈ కామక్రోధాల్ని ఎక్కడ విడిచిపెట్టగలం? విడిచిపెట్టలేము. కాబట్టే మనల్ని ప్రాక్టీసు చేయమంటున్నాడు భగవంతుడు.

ఈ కామక్రోధాలు రజోగుణంలో నుంచి పుడుతున్నాయి. కాబట్టి మనల్ని ఎల్లప్పుడూ సత్వగుణాన్ని ఆశ్రయించమని చెపుతున్నాడు వాసుదేవస్వామి. అంటే ఏమిటి? మాట నిర్మలంగా ఉండాలి, చేత నిర్మలంగా ఉండాలి, తలంపు నిర్మలంగా ఉండాలి. జీవితంలో ఆడంబరానికి దూరంగా ఉండాలి. నిరాడంబరంగా, నిరహంకారంగా ఎవడైతే జీవిస్తాడో వాడు మాత్రమే కామక్రోధాల్ని విడిచిపెట్టగలడు.

అయితే, ఈ కామక్రోధాలు ఎలా ఉంటాయి? మీరు ఎవరైనా చూశారా? కామ క్రోధాలు కూడా తలంపే. తలంపు! లేకుండా ఎవరికైనా కామం వచ్చిందా? తలంపు లేకుండా ఎవరికైనా కోపం వచ్చిందా? తలంపు లేకుండా ఎవరికైనా అసూయ వచ్చిందా? తలంపు లేకుండా కోరికలేదు, తలంపు లేకుండా కోపం లేదు, తలంపు లేకుండా అసూయ లేదు. అయితే ఈ తలంపులు ఎవరికి వస్తున్నాయి? - నాకే వస్తున్నాయి. మరి ఆ నేను ఎవరు? ఇదే రమణ స్వామి చెప్పిన సిద్ధాంతం! కోపం వచ్చినా, కోరిక వచ్చినా, ఈ నేనుకే వస్తున్నాయి కదా? మరి నేను ఎవరు? వాడిని తెలుసుకోవాలి

- అసలు దొంగ వాడే! కాని మనం అన్నిటికంటే ఎక్కువ ప్రాముఖ్యతను ఆ నేనుకే ఇస్తున్నాము. సత్యం చుట్టూ మనం తిరుగుట లేదు - ఈ నేను చుట్టూ మనం తిరుగుతున్నాము. ప్రతీ మనిషి ఈ నేను అనే అహంకారాన్ని సంతృప్తి పరచుకోవటం కోసమే జీవిస్తున్నాడు. మనిషి కేంద్రం సత్యం కాదు - అహంకారమే! అందుకే ప్రపంచంలో ఈ రోజున ఇంత దుఃఖం కనిపిస్తుంది. ఈ రోజున సమాజంలో కులాల పేరు మీద, మతాలు పేరు మీద ఎంతో హింస జరుగుతుంది. కాని "ఈ నేను ఎవడను" అనే ప్రశ్నకు మానవుడు ఎందుకు రావడం లేదు? ఈ ప్రశ్నకు సమాధానం మానవుడు తెలుసుకొనే వరకూ ఈ హింసలోనుంచి, ఈ దుఃఖంలో నుంచి బయట పడలేడు. సమాజంలో శాంతి కావాలని ప్రతీమనిషి చెపుతాడు - కాని, మన హృదయంలో శాంతి లేనప్పుడు సమాజంలో శాంతి ఎక్కడ నుంచి వస్తుంది?

భగవంతుడు - నేను అందరి హృదయాలలో ఆత్మగా ప్రకాశిస్తున్నానని చెపితే - ఆ హృదయంలోకి తన మనస్సును ఎవడైనా త్రిప్పగలుగుతున్నాడా? మన హృదయంలోకి దిగడం మానివేసి దేవుడు పేరు చెప్పి గుడుల వెంట, గోపురాల వెంట, లోకాల వెంట తిరుగుతున్నాడు. మనకు అక్కరలేనివన్నీ నేర్చుకున్నాము - కామక్రోధాలు నేర్చుకున్నాము. ఈర్ష్యాద్వేషాలు నేర్చుకున్నాము. కాని, ఆత్మను వెతకడం మాత్రం నేర్చుకోలేదు. ఎంతసేపూ బాహ్య చింతనే కాని - భగవత్ చింతన మనలో

ఎవరికైనా ఉందా? మనము చేసే ప్రయాణం ఎటువైపు చేస్తున్నాము? ఏ మతం చెప్పినా సత్యం ఒక్కటే! అక్కడికి చేరే వరకూ మనకు శాంతి లేదు, కాంతి లేదు, మోక్షము లేదు.

సోదరమహాశయులారా! ఉన్నది భగవంతుడు ఒక్కడే నని, అందరి శరీరాలు పంచభూతాలతోనే తయారయినవనీ చెపుతున్నారు. అయితే మరి ఈ పోరాటమంతా ఎక్కడ నుండి వచ్చింది సమాజంలో? ఒక మతానికి, మరొక మతానికి, ఒక దేశానికి, మరొక దేశానికి పడడం లేదే? ఈ పోరాటమంతా ఎక్కడి నుంచి వచ్చింది? అహంకారంలో నుంచే వచ్చింది. ఈ అహంకారమనేది అటు ఆత్మా కాదు - ఇటు పంచభుతాలలో ఒకటీ కాదు. కానీ, కామక్రోధాలవల్ల పుట్టుకొస్తుంది. దీనివల్ల సమాజం ఎంతో అశాంతికి గురవుతుంది. అందుచేత ఎవరైతే ఈ కామక్రోధాలను దాటతాడో వాడికి మాత్రమే శాంతి, కాంతి లభిస్తుంది. ఆత్మ దర్శనమిస్తుంది.

"ఏమండీ, మేమందరం సాధనలు బాగానే చేస్తున్నాం" అని మీరు అనవచ్చు. కానీ మీరు ఎంతవరకు సాధన చేస్తున్నారో మీకు సర్టిఫికేట్ ఇవ్వవలసినది భగవంతుడే కానీ - మనకి మనం కాదు. మీరు ఎంత సాధన చేస్తున్నారో, మీ మనస్సు ఎంతవరకు పక్వానికి వచ్చినదో - మీ హృదయములో ఉన్న భగవంతుడు సాక్షిగా చూస్తుంటాడు - దాన్నిబట్టి మీకు ఉన్నతమైన జన్మనిస్తాడు. మీ సాధనను బట్టి మీకు శక్తి వస్తుంది కానీ - మీ కోరికను బట్టి కాదు.

"శత్రువు ఎక్కడో బయటలేడు - వాడికి గెడ్డాలు, మీసాలు లేవు - వాడు మీకు బాహ్యంగా లేడు. మీ లోపలే ఉన్నాడు - ఎలా ఉన్నాడు - కామరూపంలో ఉన్నాడు - వాడే నీకు వైరి - వాడే నీకు శత్రువు" అంటున్నాడు భగవంతుడు.

ఏమండీ! భగవంతుడు చెప్పేది మన అనుభవంలో ఏమైనా ఉందా? భగవంతుడు ఏమంటున్నాడంటే - "నీ కామమే నీకు శత్రువు" అంటున్నాడు. కానీ మన అనుభవం దీనికి విరుద్ధంగా ఉంది. మన కామమే మనకు మిత్రుడు అనుకుంటున్నాము గానీ, శత్రువని ఎవరైనా అనుకుంటున్నామండీ?

అందుకే భగవంతుడు ఏమి చెపుతున్నాడంటే - "నీ కామమే నీకు శత్రువని తెలుసుకో - నీకు ఇంతకుముందు తెలియకపోతే ఇప్పుడు తెలుసుకో. నీలో ఉన్న సత్యవస్తువును ఈ కామము అనే మూత కప్పివేసింది. నీ సాధనల పేరుమీద ఆ మూతను తీసివేయి" అంటున్నాడు. కానీ మనం ఎవరయినా ఆ మూతను తొలగించడానికి ప్రయత్నిస్తున్నామా? ఎందుచేత మనం ప్రయత్నించడం లేదు? అది మనకు శత్రువని కనీసం తెలియదు కాబట్టి.

**2. ధుమేనా వ్రియతే వహ్నిః యధా దర్శోమలేన చ ।**
**యధోల్బేనావృతో గర్భః తధా తేనే దమావృతమ్ ॥**

ఇక్కడ భగవంతుడు ఏమి చెబుతున్నాడంటే - "నిప్పును

పొగ ఏ విధంగా ఆవరించి ఉందో, అద్దాన్ని మురికి ఏ విధంగా ఆవరించి ఉందో, తల్లిగర్భములో ఉన్న శిశువును మాయ ఏ విధముగా ఆవరించి ఉందో - అదే విధముగా మనిషి హృదయములో ప్రకాశిస్తున్న సత్యాన్ని కామం ఆవరించి ఉంది" అని మూడు ఉదాహరణలు చెప్పాడు.

మానవజన్మ యొక్క గమ్యం ఏమిటంటే - తనలో ప్రకాశిస్తున్న ఆ సత్యవస్తువును తెలుసుకోవడమే. మానవుడు తన మనస్సును అంతర్ముఖ పరచుకోవడానికి ప్రయత్నం చేయకుండా, వాడు ఎన్ని సాధనలు చేసినప్పటికీ, వాడు ఎంత సాధించినప్పటికీ, అవన్నీ ఒకటి లేని సున్నలే. సౌందర్యమంతా మన హృదయములోనే ఉంది, స్వర్గరాజ్యం మన హృదయము లోనే ఉంది. అయితే మన హృద యములోనున్న ఆ శాంతి, ఆ సుఖం మన అనుభవం లోకి రావాలంటే - కామక్రోధాలు మనల్ని ముట్టు కోకుండా చూసుకోవాలి. ఎవడైతే ఈ కామక్రోధాలకి లొంగిపోతున్నాడో - వాడికి ఆ శాంతి గురించి, ఆ కాంతి గురించి తెలియదు.

నిప్పును ఏ విధంగా అయితే పొగ కమ్మివేసి, ఆవరించి ఉంటుందో - అదే విధముగా ఈ కామము మనిషి యొక్క స్వరూపాన్ని ఆవరించి ఉంది. గట్టిగా గాలివేస్తే ఆ పొగ తప్పుకుంటుంది - మనకు నిప్పు నిప్పుగా కన్పిస్తుంది. దానికి అంత పెద్దకష్టం అక్కరలేదు. అదే విధంగా ఈ జన్మలో కానీ, పూర్వజన్మలో కానీ మనం ఎక్కువ సాధన చేసి ఉంటే -

సూర్యుడు ఉదయించినట్లు సడెన్‌గా సత్యం మనకి గోచరిస్తుంది. అంతేకానీ ఈరోజు కొంత, రేపు కొంత, ఎల్లుండి కొంత కాదు - సడెన్ గా మెరుపులాగ గోచరిస్తుంది - మన మనస్సు గనుక పక్వానికి వచ్చి ఉంటే ఆ ముహూర్తాన్ని ఈశ్వరుడే నిర్ణయించు కుంటాడు. స్వప్రయత్నం, కాల పరిపక్వం, ఈశ్వర కటాక్షం కలిసి వస్తేనే కానీ మనం ఏ కార్యాన్ని సాధించలేము.

అద్దం మీద మురికి ఉందనుకోండి - మన ముఖం కనిపిస్తుందా? కనిపించదు. మన ముఖం కన్పించాలంటే ఆ అద్దాన్ని గుడ్డపెట్టి గట్టిగా తుడవాలి. అంతేకాని గాలి వేస్తే అది పోదు. దానికి శుభ్రత కావాలి. ఇక్కడ భగవంతుడు చెప్పేదేమిటంటే - “పూర్వజన్మలో నీవు ఎక్కువ కృషి చేసి ఉంటే ఈ జన్మలో తక్కువ కృషి చేసినా సరిపోతుంది కానీ పూర్వజన్మలో నీవు తక్కువ కృషిచేసి ఉంటే ఈ జన్మలో నీవు ఎక్కువ కృషి చేయవలసి ఉంటుంది. కనుక అది నీ సంస్కారాన్ని బట్టే ఉంటుంది. అందుచేత నీవు చేసిన ప్రయత్నం వృధాగా పోదు గనుక నీవు ప్రయత్నం చేయి - నీవు తప్పక నీ స్వరూపాన్ని పొందుతావు” అని చెపుతున్నాడు.

కొంతమంది మానవులకు సత్యం ఒకటి ఉందనే తలంపు కూడా వాళ్ళకు రాదు. సత్యాన్ని తెలుసుకోవాలని కాని, సాధన చేయాలని కాని ఆలోచనే వాళ్ళకు తట్టదు. వాళ్ళు సత్యాన్ని తెలుసుకుంటారో లేదో అది వేరే విషయం. అసలు ప్రయత్నమే

చేయరు. వెలుగు ముఖం ఎలా ఉంటుందో కూడ తెలియని అటువంటి బద్ధజీవులను - తల్లి గర్భంలో మాయ కమ్మిన శిశువుతో పోలుస్తున్నాడు భగవంతుడు. తల్లి గర్భంలో ఉన్న శిశువుకు స్వేచ్ఛ కానీ, స్వతంత్రం కానీ ఉంటుందా? అసలు వెలుగు ముఖం ఎలా ఉంటుందో తెలుస్తుందా? అటువంటి బాపతే ఈ మూడవరకం మనుషులు. వాళ్ళు అజ్ఞానంలో పడి అలా కొట్టుకుపోవలసిందే.

సోదరమహాశయులారా ఈశ్వరుని యొక్క దయ మనమీద గనుక లేకపోతే ఆయన ఉనికిపట్ల మనకు విశ్వాసం కుదరదు. ఒకసారి రమణస్వామిని ఒక భక్తుడు అడిగాడు "స్వామీ నేను మిమ్మల్ని చూడటానికి చాలాసార్లు వచ్చాను. కానీ మీ అనుగ్రహం మట్టుకు నా మీద ఉన్నట్లు కన్పించలేదు" అన్నాడు. అప్పుడు రమణస్వామి అన్నారు "పీకలోతు నీటి ప్రవాహంలో ఉండి "నాకు దాహం, నాకు దాహం" అని అడిగినట్లు ఉంది నీవు చెప్పేది. నా దయగనుక నీ మీద లేకపోతే నన్ను చూడాలనే కోరికే నీకు కలుగదు. ఈ లోకంలో అనేక కోట్లమంది జనం ఉన్నారు - అందరూ వస్తున్నారా? ఏం నీవే ఎందుకు వచ్చావు నన్ను చూడడానికి? నా అనుగ్రహం నిజంగా నీ మీద లేకపోతే నన్ను చూడాలనే కోరిక నీకు ఎలా కలుగుతుంది? కనుక, నీకు నన్ను దర్శించాలనే కోరిక కలగడమే నా అనుగ్రహం నీమీద ఉన్నట్లు గుర్తు" అన్నారు.

**3. ఆ వృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్య వైరిణా ।**
**కామరూపేణ కౌంతేయ! దుష్పూరేణానలేనచ ॥**

ఓ అర్జునా! కామం నీలో ఉన్న జ్ఞానాన్ని కప్పివేస్తుంది. అది కోరిక రూపంలో నీలో దాగి ఉంది. దాన్ని ఎవరూ తృప్తిపరచలేరు. ఒక కోరికను తృప్తిపరిస్తే - ఇంకో కోరిక వస్తుంది. ఆ కోరికను తృప్తిపరిస్తే - మరో కోరిక వస్తుంది. నీవు కోరికల్ని తృప్తిపరుస్తూ కోరికలు లేని స్థితికి రాలేవు. అది దుష్పూరేణ - దాని నీవు నిండింపలేవు, అనలేనచ - దాన్ని నీవు తృప్తిపరచలేవు.

"సత్యాన్ని తెలుసుకోవాలి. సత్యాన్ని తెలుసుకుంటేనే కాని ఈ ప్రకృతిలోనుంచి బయటపడలేము" అని ఎవడైతే సత్యాన్వేషణ ప్రారంభించాడో వాడికి మాత్రమే ఈ కామం శత్రువుగా కనిపిస్తుంది - వాడు మాత్రమే కామాన్ని తొలగించుకోవడం కోసం ప్రయత్నం చేస్తాడు. కానీ మూర్ఖుడు ప్రయత్నం చేయడు - ఎందుచేత? మూర్ఖుడు కామాన్ని తన శత్రువు అనుకోవడం లేదు - తన స్నేహితుడు అనుకుంటున్నాడు. ఒక్క జ్ఞానికి మాత్రమే కామం శత్రువుగా కనిపిస్తుంది. కామం లేకుండా నిష్కామకర్మను ఒక్క జ్ఞాని మాత్రమే చేయగలడు. కానీ, ఆధ్యాత్మికంగా ఉన్నతమైనస్థితిలో ఉన్న జీవుడు కూడా నిష్కామకర్మను చేయలేడు. ఎడ్వాన్స్డ్ సోల్ కొంత స్వార్థం తగ్గించుకొని పనిచేయవచ్చునే కానీ, పరిపూర్ణ నిష్కామకర్మను ఒక్క జ్ఞాని మాత్రమే చేయగలడు.

సోదరమహాశయులారా! తలంపు రాకుండా మీకు కానీ, నాకు కానీ కామం వస్తుందా? లేదు. తలంపు లేకుండా కోరిక

రావడం లేదు. కనుక ఈ కామం నుంచి బయటపడడం కోసం, ఈ కోరికల నుంచి బయటపడడం కోసం - భగవంతుడి మీద ప్రీతి పెంచుకోండి. ఒకవేళ మీకు భగవంతుని పట్ల ప్రేమ లేకపోతే ప్రేమించడం నేర్చుకోండి. ఆ ప్రేమే మిమ్మల్ని తరింపచేస్తుంది.

మనమీద ప్రేమతో మనల్ని తరింపచేయడం కోసం ఒక మహాత్ముడు ఏమి చెప్పాడంటే "నీవు ఏదైనా ఒక చెడ్డపని చేస్తున్నావనుకో - తలంపు వచ్చిన తరువాత ఆ పని చేస్తున్నావా? తలంపు రాకుండానే చేస్తున్నావా? తలంపు వచ్చిన తరువాతనే చేస్తున్నావు. ఆ చెడునుంచి బయటపడడం కోసం - దానికి భిన్నమైన, విరుద్ధమైన మంచి ఆలోచనను పెంచుకొని, ఆ మంచి తలంపు సహాయముతో - చెడునుంచి బయటపడు. తలంపును తలంపుతోనే దాటు" అని చెప్పాడు. వాళ్లకు ఎంత ప్రేమో చూడండి - ఈ మానవజాతి మీద.

ఒకసారి రమణస్వామి దగ్గరకు ఒకతను వచ్చి "ఏమండీ స్వామీ నేను చదువుకున్నాను, కానీ నాకు ఉద్యోగం లేదు" అన్నాడు. భగవాన్ "సరిసరి" అన్నారు. కొంతకాలానికి వాడికి ఉద్యోగం వచ్చింది. తరువాత మరల కొంతకాలానికి భగవాన్ దర్శనానికి వచ్చి "ఏమండీ స్వామీ మీ దయవల్ల నాకు ఉద్యోగం వచ్చింది. కాని ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని ఉంది" అన్నాడు. భగవాన్ మరల "సరిసరి" అన్నారు. తరువాత అతనికి పెళ్లి అయ్యింది. కాని చాలాకాలం వరకు అతనికి పిల్లలు

పుట్టలేదు. మరల భగవాన్ దర్శనానికి వచ్చి "స్వామీ మీ దయవల్ల పెళ్ళి అయ్యింది కాని పిల్లలు పుట్టలేదు" అన్నాడు. భగవాన్ మరలా "సరిసరి" అన్నారు. కొంతకాలానికి వాడికి కొడుకు పుట్టాడు. ఆ తరువాత కొంతకాలానికి జబ్బు చేసి ఆ పుట్టిన పిల్లవాడు చనిపోయాడు. మరికొంతకాలానికి భార్య కూడా పోయింది. కొంతకాలం తరువాత ఉద్యోగం కూడా పోయింది. అతను మరల భగవాన్ దర్శనానికి వచ్చాడు. "స్వామీ మీ దయవల్ల ఉద్యోగం వచ్చింది, భార్య వచ్చింది, కొడుకు పుట్టాడు. కానీ కొడుకు పోయాడు, భార్య పోయింది, చివరికి ఉద్యోగము కూడ పోయింది అన్నాడు. అప్పుడు భగవాన్ అన్నారు "మధ్యలో వచ్చినవి మధ్యలోనే పోయాయి, కానీ అప్పుడూ నీవు ఉన్నావు - ఇప్పుడూ నీవు ఉన్నావు. ఆ ఉన్న నీవు ఎవరో తెలుసుకో" అన్నారు.

4. **ఇంద్రియాణి మనోబుద్ధిః అస్యాధిష్ఠానముచ్యతే ।**
**ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్ ॥**

ఈ కామం ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని ఆశ్ర యించుకొని ఉంది. అందుచేత మనల్ని ఎవరో బయటివారు మోహపెట్టడం లేదు - మన ఇంద్రియాలే మనల్ని మోహపెడు తున్నాయి, మన మనస్సే మనల్ని మోహపెడుతుంది. మన బుద్ధే మనల్ని మోహ పెడుతుంది. మోహంలో ఉన్న మనము - ఏదైతే కాదో దానిని ఔను అనుకుంటున్నాము. ఏదైతే ఔనో దానిని కాదనుకుంటున్నాము. మనము ఆత్మ - కానీ ఆత్మ మనము

కాదు అనుకుంటున్నాము. ఈ ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి మనం కాదు - కానీ అవే మనం అనుకుంటున్నాము. అందుచేతనే ఈ గందరగోళం అంతా వస్తున్నది. మనము మోహములో నుంచి బయటపడినప్పుడు ఉన్నది ఉన్నట్లుగా, లేనిది లేనట్లుగా మనకు అర్థమౌతుంది.

మనలో కామక్రోధాలు ఉన్నంతకాలము మన ఇంద్రియాలు, మన మనస్సు, మన బుద్ధి ప్రకృతివైపే ప్రయాణం చేస్తాయి గానీ, ఆత్మవైపు ప్రయాణం చేయవు. బహిర్ముఖమైన మనస్సు ఆత్మను ఎన్నడూ తెలుసుకోలేదు. సత్యాన్ని తెలుసు కొనేవరకూ ఏ జీవుడూ దుఃఖంలో నుంచి బయటపడలేడు. మనోమూలం తెలుసు కున్నవాడికి గాని సత్యం తెలియదు. ఎవడైతే మనో మూలం తెలుసుకుంటాడో వాడే మహాత్ముడౌతాడు.

తడిగుడ్డను ఏ విధంగా అయితే పిండుతామో, అదే విధంగా మన ఇంద్రియాలను పిండాలి. మన మనస్సును పిండాలి. మన బుద్ధిని పిండాలి. అప్పుడు వాటిలో ఉన్న లోపాలు, పాపాలు రాలిపోతాయి. మనిషికి తిండి ఎంత అవసరమో - మనస్సుకు ప్రార్థన అంత అవసరం. పరిశుద్ధ మనస్సు మాత్రమే సత్యాన్ని తెలుసుకోగలుగుతుంది.

సోదరమహాశయులారా! ముసలివాళ్ళకు ఇంద్రియాలు ఏమీ పనిచేయవు అనుకోండి. మరి వాళ్ళు ఇంద్రియాలను జయించినట్లేనా? అలా కాదు. దానికి రవీంద్రనాథ్ ఠాగూర్ ఏమి చెప్పాడంటే - పండు ముగ్గిపోయిన తరువాత కూడా

లోపల గింజలు గట్టిగానే ఉంటాయి - మరలా మొలకెత్తటానికి. ముసలి వయసు వచ్చిన వాళ్ళు కూడా ఆ బాపతే" అన్నాడు. శరీరం అయితే ముసలిది అవుతుంది కానీ లోపల వాసనలు మాత్రం గట్టిగానే ఉంటాయి. కానీ, ఆ వాసనలను సంతృప్తి పరచుకోవడం కోసం శారీరకంగా శక్తి ఉండదు. ఆ కోరికలను నెరవేర్చుకోవటం కోసం వాడికి మరో కొత్త శరీరం వస్తుంది. కనుక మీరు మంచి చేయండి. మంచి, మంచి కోసమే చేయండి కానీ పేరుకోసం చేయకండి.

**5. తస్మాత్ త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ ।**
**పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞాన విజ్ఞాన నాశనమ్ ॥**

"ఓ అర్జునా! అందుచేత ముందుగా నీ ఇంద్రియాలను, నీ మనస్సును, నీ బుద్ధిని నియమించు. నియంతేంద్రియుడు కానివాడు జితేంద్రియుడు కాలేడు, ఏం? ఎందుచేత ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని నియంత్రించాలి? దానికి భగవంతుడు ఏమి చెబుతున్నాడంటే ఈ కామం - నీ ఇంద్రియాలను, నీ మనస్సను, నీ బుద్ధిని ఆశ్రయించి, వాటిచేత పాపము చేయిస్తుంది. అది జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని నాశనం చేస్తుంది. నీ స్వార్థాన్ని దృష్టిలో పెట్టుకొని అయినా నీవు సుఖపడడం కోసమైనా నీ కామాన్ని తొలగించుకో, నీలో ఉన్న జ్ఞాన స్థితిని, ఆత్మ స్థితిని, మోక్షస్థితిని నీ చేతికి అందకుండా ఈ కామం దూరం చేస్తుంది. ఈ కామం ఎక్కడో బయట లేదు. నీ ఇంద్రియాలలో, నీ మనస్సులో, నీ బుద్ధిలో

అది తిష్టవేసి నిన్ను మోహపరుస్తుంది. నీ చేత పాపం చేయిస్తుంది. నీకు దుఃఖాన్ని తీసుకు వస్తుంది. అందుచేత ముందు నీ ఇంద్రియాలను, నీ మనస్సును, నీ బుద్ధిని గట్టిగా పిండి వాటిని జయించు. కామము నిన్ను ఆడిస్తున్నంత కాలము నీవు జ్ఞానములో పెరగవు" - అని చెపుతున్నాడు.

సోదరమహాశయులారా! మీరే మనుకుంటున్నా రంటే - మాకు రోజులు బాగానే గడిచిపోతున్నాయి అనుకుంటున్నారు. మీరు గనుక కామాన్ని జయించకపోతే మీరు మూలములో నశించిపోతారు. అందుచేత మీ కాలాన్ని కాలక్షేపం కబుర్లతో వృధా చేయకండి. గతించి పోయిన ఒక్కరోజును మీరు వెనక్కి తిరిగి రమ్మంటే రాదు. ఎవడైతే కామాన్ని జయిస్తాడో - వాడు మాత్రమే కాలాన్ని జయిస్తాడు! మనం శివుణ్ణి ధ్యానం చేసినా, రాముణ్ణి ధ్యానం చేసినా ఈ కాలాన్ని, కామాన్ని జయించడం కోసమే. ధ్యానం అంటే ఏమీ లేదు - అది ఒక పెద్ద పోరాటం. మనలో ఉన్న బలహీనతలను బయటకు తీసివేయడం కోసం, ఆ బలహీనతలలోంచి మనం బయట పడటం కోసం మనం చేస్తున్న పోరాటమే సాధన!

**6. ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరంమనః ।**
**మనసస్తు పరాబుద్ధిఃయో బుద్ధేః పరతస్తుసః ॥**

ఇక్కడ భగవంతుడు ఏమి చెబుతున్నాడంటే - దేహము కంటే ఇంద్రియములు గొప్పవి, ఇంద్రియాల కంటే మనస్సు గొప్పది, మనస్సు కంటే బుద్ధి గొప్పది, బుద్ధి కంటే ఆత్మ గొప్పది అని చెబుతున్నాడు.

దేహం కంటే ఇంద్రియాలు ఎందుకు గొప్పవి? మనం ఒక డాక్టరునో, ప్లీడరునో, ఇంజనీరునో గౌరవించినట్లు వ్యవసాయదారుని గౌరవిస్తున్నామా? - లేదు. ఎందుచేత? ఇందులో రహస్యం ఏమిటంటే - డాక్టరు పని, ప్లీడరు పని, ఇంజనీరు పని బుద్ధికి సంబంధించినది. కానీ వ్యవసాయం కేవలం శరీరానికి సంబంధించినది - మీరు చేయవచ్చు, నేనూ చేయవచ్చు, కానీ డాక్టరు పనో, ప్లీడరు పనో మనం చేయలేము. అలాగే ఒక మంచి మనిషిని మనం గౌరవిస్తాము. కానీ మంచి మనిషి కంటే మేధస్సు ఉన్న వాడిని ఎక్కువగా గౌరవిస్తాము. ఎందుచేత? మనస్సు కంటే బుద్ధి గొప్పది కాబట్టి. వీటన్నింటికంటే ఆత్మ గొప్పది. అందుకే రమణ మహర్షిగారికో, రామకృష్ణ పరమహంస గారికో ఇచ్చే గౌరవం డాక్టరుకి, ప్లీడరుకి ఇవ్వం. మనం భగవాన్ ఫోటోల్ని పుజిస్తున్నాం గానీ డాక్టరు ఫోటోనో, ప్లీడరు ఫోటోనో పూజిస్తామా? గౌరవిస్తామే కానీ పూజించము. ఎందుచేత? ఎవడైతే సత్యాన్ని తెలుసు కున్నాడో - వాడే సత్యమవుతాడు - వాడే పూజార్హుడవుతాడు. అటువంటి సత్యాన్ని తెలుసుకోవడం కోసం మీకున్న గౌరవాలను, పేరు ప్రతిష్టలను అవసరమైతే త్యాగం చేయండి. ఎవడికైతే త్యాగబుద్ధి ఉందో - వాడికి మాత్రమే ఈ శాస్త్రం తన హృదయాన్ని ఇస్తుంది. వాడికి మాత్రమే ఈ శాస్త్రం యొక్క అర్థం, ఈ శాస్త్రం యొక్క విలువ తెలుస్తుంది. ఎవడైతే నిశ్శేషంగా తన కామాన్ని విడిచిపెట్టగలుగుతున్నాడో వాడికి మాత్రమే సత్యం దర్శనమిస్తుంది. మీ ఇంద్రియాలకు గానీ, మీ మనస్సుకు గానీ, మీ బుద్ధికి గానీ సత్యం అందేది కాదు.

7. ఏవంబుద్ధేః పరంబుద్ధ్వా సంస్తభ్యాత్మాన మాత్మనా ।
జహి శత్రుం మహా బాహో కామరూపం దురా సదమ్ ॥

ఇక్కడ భగవంతుడు ఏమంటున్నాడంటే - "దురాసదమ్" - ఈ కామాన్ని జయించడం నేను చెప్పినంత తేలిక కాదయ్యా! చాలా కష్టం! కష్టమే గాని అసాధ్యం మట్టుకు కాదు. పాము ఎక్కడ ఉంటుంది - పుట్టలో ఉంటుంది. అది ఆహారం కోసం బయటకి వస్తూ ఉంటుంది. అదే విధంగా ఈ కామం నీ ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని, తన నివాసంగా చేసుకొని - సంకల్ప రూపంలో బయటికి వచ్చి - అది నిన్ను ఆడిస్తున్న దయ్యా! అందుచేత కామరుపంలో ఉన్న ఈ శత్రువును జయించడానికి నీవు ప్రయత్నం చేయి, నీ మనస్సును నీ మనస్సుతో అణుచుకుంటూ, నీ బుద్ధిని నీ బుద్ధితోనే అణచుకొని ఈ కామమనే శత్రువును జయించు అని చెపుతున్నాడు.

సోదరమహాశయులారా! మనలో ఎంతో కొంత శాంతి ఉంటేనేగాని పాపముతో పోరాడలేము. ఈ పాపము పోతేనే గాని శాంతిరాదు. అందుచేత ఏది ముందు - ఏది వెనుక అంటే రెండూ ఏకకాలంలో చేయవలసిందే. దీనికి ఎంతో ఓర్పు కావాలి. కానీ నిజం చెప్పాలంటే మనందరం "ఎస్కేపిస్టులం" (Escapists). ఉన్న వస్తువును ఉన్నట్టు దర్శించలేక ఈ ఎస్కేపిజమ్. చివరికి ధ్యానం కూడా "ఎస్కేపిజమే". ఎందుచేత? డైరెక్టుగా సత్యాన్ని ఎదుర్కొనే ధైర్యము లేక, వాసనల్ని జయించే శక్తి లేక వాటిని అణిచిపెట్టి ఉంచడం

కోసం ఈ ధ్యానం! ధ్యానం మంచిదే - నేను కాదనడం లేదు. కానీ మన బలహీనతల్ని మనం డైరెక్టుగా జయించలేక, ధ్యానం పేరుతో వాటిని అణిచిపెడుతున్నాం. వాటిని అణచడం ముఖ్యం కాదు. వాటిని జయించడం ముఖ్యం. చనిపోయిన పాము వల్ల ప్రమాదం లేదు. కానీ, అణిగి ఉన్న పామువల్ల ఎప్పుడైనా ప్రమాదం తప్పదు. ఈ కామమనే పామును చంపకపోతే అది లోపల ఉండి బుసకొట్టడం మానదు, మిమ్మల్ని కాటు వేయకుండా విడిచిపెట్టదు.

సోదరమహాశయులారా! ఎదగాలండీ - మనం జ్ఞానంలో ఎదగాలి. పూర్వం ఒకడు అన్నాడట "నాకు ఎదుగుతుంటే భయం వేస్తుంది" అని. ఏమయ్యా! ఎందుకు భయం? అంటే వాడన్నాడట - "మళ్ళీ ఈ గోలికాయల ఆట ఆడుకోడానికి వీలుపడదని". అలాగే మనందరకూ ఎదుగుతున్నామంటే భయం వేస్తుంది. ఎందుకని? జ్ఞానం వస్తే ఈ భోగాలు ఎక్కడ జారిపోతాయోనని భయం. ఈ శరీరం ముసలిదైపోతే ఈ భోగాలను అనుభవించడం ఎలాగా అని భయం.

కొంతమంది ఏమంటారంటే - భగవద్గీత రోజూ ఎక్కడ చదవమండీ" అంటారు. మరి భోజనం ఒకసారి తింటే సరిపోతుంది కదా? - రోజు ఎందుకు తింటున్నారు? సంసారం ఒకసారి చేస్తే చాలుగా! రోజూ ఎందుకు చేస్తున్నారు? అందుచేత ఇదివరకు చదివాం కదా అని అనుకోవద్దు. ఎందుచేతనంటే - ఇదివరకు మనం భగవద్గీత చదివాం - కానీ అది మనకు అర్థం కాలేదుగా? అది మనకు అనుభవ

మయ్యే వరకూ మనం చదవవలసిందే. బ్యాంకులో కోట్ల రూపాయలున్నాయి - కానీ మనకెలా వస్తాయి? అదే విధంగా భగవద్గీతలో మంచి మాటలున్నాయి - పుస్తకములో మాటలు ఉంటే మనకి సుఖమెలా వస్తుంది? ఆ మాటల్ని మనం ఆచరించి, అనుభవంలోకి తెచ్చుకుంటే అప్పుడు మనం సుఖపడతాం. శాస్త్రం మన హితవుకోరి మంచి మాటలు చెప్పింది. మీ హృదయాన్ని ఈ శాస్త్రానికిస్తే - ఈ శాస్త్రం తన హృదయాన్ని మనకిస్తుంది. మీ హృదయాన్ని భగవంతుడికిస్తే - భగవంతుడు తన హృదయాన్ని మీకిస్తాడు. అంతేగాని, "నా హృదయాన్ని మీకు ఇవ్వను - మీ హృదయాన్ని నాకు ఇవ్వండి" అంటే నేనెక్కడ తెచ్చిస్తాను?

మరికొంతమంది అంటారు "భగవంతుడు చెప్పిన మాటలు బాగానే ఉన్నాయి గానీ మాకు "ఇంటరెస్ట్ (interest) కలగడం లేదేమిటండీ?" అని, సోదరమహాశయులారా! వాటిని ఆచరించాలని శ్రద్ధ ఎందుకు కలగడం లేదంటే - మనకు వైరాగ్యం లేక. అసలు శాస్త్రం వినటానికి కూడా ఎంతో కొంత వైరాగ్యం ఉండాలి. వైరాగ్యం లేనివాడికి శాస్త్రం విన్నప్పటికీ శ్రద్ధ కలుగదు. ఆ వైరాగ్యం ఎలా కలుగుతుంది? మంచి పనులు చేయడం వల్ల ఈశ్వరానుగ్రహం లభిస్తుంది. ఈశ్వరానుగ్రహం ఉన్నవాడికి మాత్రమే వైరాగ్యం కలుగుతుంది. మనం చేతులతో చేస్తే మంచి చేయాలి. నోటితో మాట్లాడితే మంచినే మాట్లాడాలి. చెవులతో వింటే మంచినే వినాలి. అలా మంచి చేయగా, చేయగా మన బుద్ధి సూక్ష్మమౌతుంది. సూక్ష్మ బుద్ధి మాత్రమే సత్యాన్ని తెలుసుకోగలుగుతుంది.

ఎన్ని పూజలు చేసినా, ఎన్ని లక్షలు ఖర్చుపెట్టి గుడులు కట్టించినప్పటికీ మనకు  సత్యం ఎందుకు తెలియడం లేదు అంటే - మానవుడి యొక్క స్వార్థమే దానికి కారణం. స్వార్థమున్న మనిషికి సత్యం తెలియదు. చాలామంది మంచి పనులు చేస్తారు - కానీ, కీర్తి ఆశిస్తారు. ఈ మధ్య నా మిత్రుడొకడు అన్నాడు - "దొంగలతోనైనా స్నేహం చేయవచ్చు కానీ, కీర్తి కాంక్ష ఉన్నవాడితో స్నేహము చేయకూడదు" అని.ఎందుకంటే వాడు చేసేది పావలా పని - వేయి రూపాయల పని చేసినట్లుగా సమాజంలో చాటింపు వేసుకుంటాడు. తనను తాను చూసుకోడు - సమాజం దృష్టిలో తాను ఎలా ఉన్నాడో చూసుకుంటాడు. వాడికి సత్యం ఎలా తెలుస్తుంది?

సోదరమహాశయులారా! ఇక్కడ ఒక రహస్యముంది. మీరు మంచి చేస్తే మంచి లోకాలకు వెళ్తారు. చెడ్డ చేస్తే చెడ్డ లోకాలకు వెళ్తారు. కానీ, 'నేను' అనే భావన పెట్టుకొని కర్తృత్వముతో మీరు ఎంత మంచిపని చేసినప్పటికీ దుఃఖం అనుభవించి తీరతారు. ప్రతీ మనిషి ఉదయం లేచింది మొదలు ఈ "నేను" అనే మాటను ఎన్నిసార్లు ఉపయోగిస్తాడు. ప్రధానమంత్రి అదే ఉపయోగిస్తాడు, సామాన్య మానవుడు అదే ఉపయోగిస్తాడు. మనందరమూ ఈ "నేను"ను ఉపయోగిస్తున్నాం - కానీ ఈ "నేను" ఎవడో మనకు తెలియదు. ఈ "నేను" ఎవరో మనకు తెలిసేవరకు ఏ జీవుడికీ మోక్షం లేదు - రాదు.

మన అహంకారం మీద బేస్ అయి చేసిన పని ఏదీ

నిలబడదు - చివరికి మంచి పని కూడా నిలబడదు. పెరుమాళ్ళు స్వామి అనే అతను భగవాన్‌కు ఎంతో సేవ చేసాడు. ఒకసారి భగవాన్ అతను చెప్పినట్లుగా చేయలేదని కోపం వచ్చి, భగవాన్ మీద దావా చేసి, ఎంతో చెడ్డ ప్రచారం చేసాడు. అప్పుడు శ్రీ రమణ స్వామి అన్నారు - అహంకారముతో చేసిన పని ఇలా బూడిదలో పోసిన పన్నీరులాగా అవుతుందని.

ఏ విధంగా అజ్ఞానంలో నుంచి బయటపడాలో, ఏ విధంగా అసత్యంలో నుంచి బయటకు రావాలో, ఏ విధంగా దుఃఖములో నుంచి బయటకు రావాలో, జీవిత గమ్యము ఏమిటో, దాన్ని ఎలా సాధించాలో అనేటటువంటి ఎన్నో మాటలు గీతలో చెప్పబడ్డాయి. వాటిని మనం శ్రద్ధగా శ్రవణం చేసి, మన హృదయంలోనికి పంపి మననం చేస్తే - అవి మన మనస్సును కెలికి అందులో ఉన్న బలహీనతల్ని బయటకి లాగి, వాటిని మంట పెడతాయి.

సోదరమహాశయులారా! జన్మ వచ్చినందుకు జ్ఞానం సంపాదించడానికి ప్రయత్నం చెయ్యాలి గానీ - ఈ దేహం ముసలిది అవ్వడం కోసం మీరు ప్రయత్నం చేయనక్కరలేదు. స్మశానములోనే ఈ దేహం కాలి బూడిదైపోతుంది. కానీ, మీ మనస్సు మాత్రం స్మశానంలో కాలదు - మీ వాసనలన్నింటిని మీ మనస్సు మూట గట్టుకుని మరుజన్మకు సిద్ధమవుతుంది. అందుచేత మీ మనస్సు యొక్క మూలాన్ని తెలుసుకొని, అజ్ఞానం నుండి బయటపడండి.

# 12. ఎవరంటే స్వామికి ఇష్టం?

భగవంతుని నామాలైన "రామా, కృష్ణా, శివా" అని స్మరించడం వల్ల ఎంత పుణ్యం వస్తుందో - "గీతా, గీతా" అని స్మరించుట వల్ల కూడా అంతే పుణ్యం వస్తుంది, దుఃఖ నివృత్తి అవుతుంది. మరణ కాలమందు కనీసం "గీతా, గీతా" అని స్మరిస్తే పుణ్య లోకాలు వస్తాయి. ఉత్తమ జన్మలు వస్తాయి.

ప్రపంచంలో ఎక్కడా లేనిది ఈ గీతలో ఉండవచ్చును గానీ, ఈ గీతలో లేనిది ప్రపంచంలో ఎక్కడా లేదు. భగవంతుడు ఈ గీతాశాస్త్రాన్ని ఆధారము చేసుకొనే ఈ మూడు లోకాలను తాను పరిపాలిస్తున్నానని గీతలో చెప్పాడు. భగవద్గీతే భగవంతుని రాజ్యాంగము. భగవద్గీత అంటే అది మన భారతదేశ రాజ్యాంగము లాంటిది కాదు. అది శాశ్వత సత్యం. ఎంతకాలమైతే ఈ రాత్రి పగళ్ళు తిరుగుతుంటాయో, ఎంతకాలమైతే ఈ కాలచక్రం తిరుగుతుందో అంత కాలము ఈ గీతలో చెప్పినవి శాశ్వత సత్యాలు. మానవున్ని యదార్థ స్థితికి, మహోన్నతమైన స్థితికి తీసుకువెళ్ళే సత్యాలు. గుడిలో దేవుడు ఉన్నాడని మీరు ఎలా అనుకుంటున్నారో భగవంతుడే మాటల రూపంలో ఈ గీతలో ఉన్నాడు.

సోదరమహాశయులారా! కొంతమంది భగవద్గీతలో చెప్పిన విషయాలను విమర్శిస్తూ ఉంటారు. ఈ మధ్యన ఒక హేతువాది నన్నేమని అడిగారంటే - "ఏమండీ! భగవద్గీతలో

శ్రీకృష్ణుడు చాతుర్వర్ణాలను గురించి చెప్పాడు కదా! ఈ చాతుర్వర్ణ వ్యవస్థ ఏమిటండీ - తప్పు కాదా? భగవంతుడు అలా చెప్పవచ్చా?" అని.

"ఏమయ్యా! పోనీ కృష్ణుడు తప్పు చెప్పాడు - కానీ ఇప్పుడు భారతదేశంలో 40 వర్ణాలు ఉన్నాయి. నాలుగు వర్ణాలను విమర్శిస్తున్నారు - ఇప్పుడు ఉన్న ఈ 40 వర్ణాల మాటేమిటి?" అని చెప్పాను. మనలో గనుక పవిత్రత లేకపోతే గీతను చదివినా మనకు అర్థం కాదు.

చెప్పులు కుట్టేవాడున్నాడు - చెప్పులు అవసరమా - కాదా? అందరికీ చెప్పులు కావాలి. అంటే అందరికీ చెప్పులు కుట్టేవాడు ఒకడు ఉండాలి. వాడు రష్యాలోనూ ఉండాలి, అమెరికాలోనూ ఉండాలి, ఇండియాలోనూ ఉండాలి. అయితే చెప్పులు కుట్టేవాణ్ణి ద్వేషించమని, తక్కువగా చూడమని మన శాస్త్రం ఎక్కడా చెప్పలేదు. కానీ మనలో పొరపాటు ఎక్కడ ఉందంటే - మనకు చెప్పులు కావాలి గాని చెప్పులు కుట్టేవాణ్ణి మాత్రం నీచంగా చూడాలి - ఇదీ మన బలహీనత! మంచానికి నాలుగు కోళ్ళు ఎలా ఉన్నాయో - ఈ సామాజిక వ్యవస్థ నడవడం కోసం చాతుర్వర్ణాలు పెట్టారు మన పెద్దలు.

"పోనీ కృష్ణుడు తప్పు చెప్పాడు, వ్యాసుడు తప్పు వ్రాసాడు అనుకుందాము. మోడరన్ డేస్ అని చెప్పుకునే ఈ రోజుల్లో సైన్సు, టెక్నాలజీ పెరిగిపోయిందని చెప్పుకునే ఈ రోజుల్లో భారత దేశంలో నాలుగు వర్ణాల ప్రక్కన సున్నా చేరింది. దీనికి మీరేమి

చెపుతారు?'' అంటే హేతువాది మరి మాట్లాడడేం? సోదరమహాశయులారా! సైన్సు, టెక్నాలజీ అనేవి మానవ శరీరానికి సదుపాయం చేయగలవే గానీ, మానవ మానసాన్ని అదుపు చేయలేవు. నేను మిమ్మల్ని విమర్శించినా, మీరు నన్ను విమర్శించినా - విమర్శ అనేది నిర్మాణాత్మకంగా ఉండాలి. నేర్చుకోవలసినదిగా ఉండాలి. ఏ దేశంలో ఏది తప్పుతుంది చెప్పండి? చెప్పులు కుట్టేవాడు తప్పుతాడా? బట్టలు కుట్టేవాడు తప్పుతాడా? వ్యవసాయం చేసేవాడు తప్పుతాడా? ఇప్పుడు మనకు కాళ్ళు ఉన్నాయి, చేతులు ఉన్నాయి. చేతుల్ని ఎక్కువ గౌరవించి, కాళ్ళను తక్కువ గౌరవిస్తున్నామా? చేతులకు రోగం వచ్చినా, కాళ్ళకు రోగం వచ్చినా వైద్యం చేయించుకుంటున్నాము గానీ - నా చేతులు ఎక్కువ, కాళ్ళు తక్కువ అని మనం ఎవరైనా అనుకుంటున్నామా? అలాగే సామాజిక వ్యవస్థ నడక కోసం చెప్పాడే గానీ - కొంతమందిని తక్కువగా చూడమని భగవంతుడు చెప్పలేదు. అది అర్థం చేసుకోవడంలో ఉంది. అర్థం చేసుకోవడంలో  లోపమున్నా అది అర్థం కాదు. అర్థం చేసుకోవడం ఎవరి సొమ్ము చెప్పండి? పవిత్రమైన మనసున్న వాడికి గానీ అది అర్థం కాదు. అర్థం చేసుకోవడమే నిజమైన తపస్సు. భగవంతుణ్ణి మనం స్మరించడం వల్ల సమాజమునకు హృదయపూర్వకంగా సేవ చేయడం వల్ల, ఫలితమును లక్ష్యం చేయకుండా పనిచేయడం వల్ల - మన మనస్సు సంస్కరింపబడి, మనస్సులోని దోషాలు రాలిపోతాయి.

ఇక్కడ భగవంతుడు ఎంత చక్కగా చెపుతున్నాడో చూడండి! మీరు నిలువు బొట్టు పెట్టుకుంటే నాకిష్టం, లేక అడ్డబొట్టు పెట్టుకుంటే నాకిష్టం, మీరు రామాలయంలోకి వెళ్తే నాకిష్టం, లేక శివాలయంలోకి వెళ్తే నాకిష్టం, మీరు పురుషులైతే నాకిష్టం, మీరు రాజులైతే నాకిష్టం, బ్రాహ్మణులైతే నాకిష్టం, మీరు చదువుకున్న వాళ్ళయితే నాకిష్టం, లేక మీరు చదువు రాని వాళ్ళయితే నాకు అయిష్టం కాదు - ఇటువంటి మాటలు ఎక్కడైనా చెప్పాడండీ? ఇక్కడ మంచి గుణాలు చెప్పాడు! ఆ గుణాలు ఎవడిలో అయితే ఉన్నాయో - వాడంటే నాకు ఇష్టమని మాత్రమే చెప్పాడు! ఏమిటా గుణాలు -

1. అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ,
నిర్మమో నిరహంకారః సమదుఃఖ సుఖః క్షమీ

**అద్వేష్టా సర్వభూతానాం** : ద్వేషం పనికిరాదని, ఏ ప్రాణిని కూడా ద్వేషించవద్దని భగవంతుడు చెపుతున్నాడు.

ఇక్కడ ఒక విషయం మనం గ్రహించాలి. మీపట్ల నాకు ద్వేషం లేదు - అయితే నేనంటే భగవంతుడు ఇష్టపడతాడా? అలాగే నా పట్ల మీకు ద్వేషం లేదు - మీరంటే భగవంతుడు ఇష్టపడతాడా? అలా కాదు. మీరు నన్ను ద్వేషించటానికి కారణం కనిపిస్తున్నప్పటికీ - లేదా నేను మిమ్మల్ని ద్వేషించడానికి కారణం కనిపిస్తున్నప్పటికీ - ఎవడి హృదయంలో అయితే ద్వేషం పుట్టదో వాడంటే నాకు ఇష్టమని చెపుతున్నాడు భగవంతుడు.

సహజంగా ఎవరైనా మనల్ని ద్వేషించినా, దూషించినా,

అపకారం చేసినా - వాళ్ళపై మనకు ద్వేషం కలుగుతుంది. భగవంతుడేమని చెపుతున్నా డంటే తగిన ద్వేష కారణం ఉన్నప్పటికీ ద్వేషించవద్దని చెపుతున్నాడు. ఏం? ఎందుచేత? ఎందుచేత ద్వేషం పనికిరాదు?

ఇక్కడ లాజిక్ అవసరమే, మెటాఫిజిక్స్ కూడా అవసరమే. లాయరు 'లా' ఎలా ప్రాక్టీసు చేస్తాడో, డాక్టరు మెడిసిన్ ఎలా ప్రాక్టీసు చేస్తాడో - ఆధ్యాత్మిక సాధనలో ఉన్న మనమందరమూ 'సత్యాన్ని' అలా ప్రాక్టీసు చేయాలి. సత్యాన్ని మనం ప్రాక్టీసు చేస్తూ పోతే చివరకు మన హృదయంలో ఉన్న "సత్యం" మనకు దర్శనమిస్తుంది. బయట కనిపిస్తున్న ఈ గుడులు, గోపురాలు అన్నీ మనం కట్టుకున్నవే - కానీ మన హృదయములో ఉన్న ఆత్మ ఒక్కటి మాత్రమే స్వయముగా ప్రకాశిస్తున్నది. అయితే ఎందుచేత ఈ సత్యవస్తువు మన అనుభవములోనికి రావడం లేదు? మనలో కల్మషం ఉంది. కల్మషం అంటే ఏమిటి? పాపం! ఒక మనిషిని ద్వేషిస్తామనుకోండి - అది ఒక పాపం. ఈ ద్వేషం అనే పాపం మనలో ఉన్నందువలన మనలో ఉన్న ఆత్మను మనం తెలుసుకోలేకపోతున్నాము.

మరి మనకు ద్వేషం ఉంటే భగవంతుడికి నష్టం ఏమిటి? భగవంతుడికి కాదు నష్టం - మనకే! మనకు నష్టం కాబట్టి విడిచి పెట్టమని చెబుతున్నాడు. ద్వేషం ఉండటం వల్ల మనకు అశాంతి కలుగుతుంది - దుఃఖము వస్తుంది. ద్వేషము ఉండుట వలన అది జ్ఞానానికి విరోధం, ఆత్మకు విరోధం, మోక్షానికి విరోధం.

మన దృష్టిలో జ్ఞానం అంటే ఏమిటి? ఈ కాలేజీల్లోను, యూనివర్సిటీలలోను నేర్చుకునేదాన్ని మనం జ్ఞానం అనుకొంటు న్నాము. నిజంగా అదే జ్ఞానం అయితే ఈ చదువుకున్న వాళ్ళకు ఎవరికైనా జ్ఞానం కలిగిందా? ఎవరికైనా దుఃఖం పోయిందా? అందుకే శ్రీ రమణస్వామి ఏమన్నారంటే ఇదంతా లెరన్డ్ ఇగ్నోరెన్స్ అన్నారు.

ఏదైతే సత్యమో, ఏదైతే తన స్వరూపముగా ఉందో దాన్ని తెలుసుకున్నవాడే జ్ఞాని. అటువంటి జ్ఞానాన్ని తెలుసుకొనడానికి ఈ ద్వేషం అడ్డు వస్తుంది. కాబట్టి ద్వేషాన్ని విడిచిపెట్టమని చెపుతున్నాడు భగవంతుడు. ద్వేషకారణం ఉన్నప్పటికీ ద్వేషింపకపోవుట సత్పురుషుని లక్షణం! ఏ లక్షణాలు అయితే సత్పురుషునికి సహజముగా ఉంటాయో - వాటిని సాధకున్ని ప్రాక్టీస్ చేయమంటున్నాడు వాసుదేవస్వామి.

**మైత్రః** - సమస్త జీవుల పట్ల స్నేహభావం కలవాడంటే తనకు ఇష్టమని చెపుతున్నాడు భగవంతుడు. సర్వసాధారణంగా మైత్రి అనేది ఇద్దరి మంచివాళ్ళ మధ్యనే నిలబడుతుంది గానీ, ఇద్దరు చెడ్డవాళ్ళ మధ్యన నిలబడదు. కానీ మనకు అందరి జీవుల పట్ల స్నేహము ఉందా? లేదు. మనకు ఉపకారం చేసినవారిపట్ల స్నేహం, అపకారం చేసినవారి పట్ల విరోధం కలిగి ఉంటాము. అది లౌకికుల యొక్క లక్షణం గానీ - భక్తుల యొక్క లక్షణం కాదు అంటున్నాడు. "ఎదుటివాడు మనకు ఏం చేస్తున్నాడు?" అనే దానితో నిమిత్తం లేకుండా -

సర్వజీవులపట్ల, ఎవడైతే స్నేహంగా ఉంటున్నాడో వాడంటేనే తనకు ఇష్టమని చెపుతున్నాడు శ్రీ వాసుదేవస్వామి.

స్నేహమంటే ఏమిటి? ఏ జీవుడికి ఏ కష్టం వచ్చినా మనం నివారించగలగాలి. భవిష్యత్తులో స్నేహంలో ఎదుటివారికి ఫలానా కష్టం వస్తుందని మనకు ముందే తెలిస్తే - మనము ముందే జాగ్రత్తగా దాన్ని నివారించగలగాలి - అది స్నేహధర్మం! ముఖం ఎదుట స్నేహాన్ని నటిస్తూ - చాటున విమర్శించడం కాదు. కేవలం రూపాయలే కాదు సంపద అంటే - మంచి స్నేహం కూడా ఒక సంపదే. మనం బాగుపడినా, చెడిపోయినా స్నేహాలే కారణం. మరి మనం ఏమనుకుంటున్నాము? ఎవడైనా ధనవంతుడు కనిపిస్తే "వాడు అదృష్టవంతుడు, పూర్వజన్మలో వాడు ఎంతో పుణ్యం చేసుకున్నాడు" అంటున్నాము. అలాగే బాగా చదువుకున్న వాణ్ణి చూస్తే వాడు అదృష్టవంతుడు అనుకుంటున్నాము. కానీ మంచి స్నేహం దొరికిన వాడే నిజమైన అదృష్టవంతుడు. సోదరమహాశయులారా! మీ మొహమాటాలు పోయినా ఫరవాలేదు గానీ, స్నేహాల విషయంలో బహు జాగ్రత్తగా ఉండండి. మంచి స్నేహము "చేను చుట్టూ కంచె లాంటిది". ఒక సత్పురుషునితో స్నేహం కోసం అవసరమైతే ప్రపంచపు అంచుల వరకైనా సరే ప్రయాణం చేయమన్నాడు ఐన్ స్టీన్.

బ్రహ్మనిష్టుడికి ఏ జీవుల పట్ల విరోధం ఉండదు - ఎందుచేత? ప్రతి మనిషి తనని తాను ప్రేమించుకుంటాడు

గానీ, ద్వేషించుకోడు. అదే విధముగా బ్రహ్మనిష్టుడికి ఈ లోకం తనకంటే వేరుగా కనిపించదు - ద్వేషించటానికి.

సోదరమహాశయులారా! ఏం? ఎందుచేత సర్వజీవుల పట్ల స్నేహంగా ఉండాలి? విరోధంగా ఎందుకు ఉండకూడదు? విరోధం పెట్టుకున్నకొద్దీ మన మనస్సు బహిర్ముఖం అవుతుంది - అదీ కారణం.

**కరుణః** - అన్ని జీవుల పట్ల దయ కలిగి ఉండాలి. ఎవడి హృదయములో అయితే దయ ఉన్నదో వాడు జీవుడు కాదు - దేవుడే! మన హృదయంలో దయ అనే గుణం లేకపోతే మనము భగవంతుణ్ణి దర్శించలేము. భగవంతుడు కూడా దయాస్వరూపుడే. "దయగల హృదయమే భగవన్నిలయము" అన్నాడు జీసస్. ఒకవేళ మన హృదయములో దయ ఉండదనుకోండి - కక్ష, కార్పణ్యం ఉంటాయనుకోండి - అవి ఆయన్ను తెలుసుకోటానికి అడ్డువస్తాయి. కాబట్టి వాటిని విడిచి పెట్టి "దయ" అనే గుణాన్ని అలవర్చుకోమంటున్నాడు భగవంతుడు. మన మనస్సు శుద్ధి కావాలంటే, మన మనస్సుకు మృదుత్వం రావాలంటే "దయ" అనే గుణం చాలా అవసరం.

ఇక్కడ మనము ఒకటి గ్రహించాలి. ఎదుటివారిలో ఎవరికైనా మంచి గుణాలు ఉన్నాయనుకోండి - వారంటే మనకు ప్రేమ కలుగుతుంది. దయ కలుగుతుంది. చెడ్డ గుణాలు ఉన్నవారు ఉన్నారనుకోండి - వారి మీద మనకు దయ కలగదు. అంటే మనము గుణాలను చూస్తున్నామన్న మాట.

ఇక్కడ భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే - ఎదుటి వాడి గుణాలతో నీకు సంబంధం లేకుండా - నీవు ఆ జీవుణ్ణి కనుక ప్రేమించగలుగుతుంటే - నీవు కరుణామయుడివి. అదీ కరుణ అంటే! వాడంటే నాకు ఇష్టమని చెపుతున్నాడు.

గౌతమబుద్ధుణ్ణి, యేసుక్రీస్తుని మనము దయకు ఉదాహరణగా చెప్పుకుంటాము. అలాగే శ్రీ రమణ స్వామి కారుణ్యం కూడా కేవలం మనుష్యులకే పరిమితం కాకుండా జంతుజాలం వరకూ కూడ పాకినది. ఆయన కుక్కల్ని, కోతుల్ని, పాముల్నీ కూడా "అది", "ఇది" అని ఎప్పుడూ అనలేదు. "వారు, వీరు" అనేవారు. అంటే ఆయన దృష్టిలో వాటికీ, మనకీ తేడా లేదు - లోపల ఉన్నది ఒక్కటేనని ఆయన ఉద్దేశ్యం!

**నిర్మమో నిరహంకారః** - అంటే మమకారం లేనివాడు, అహంకారం లేనివాడు అని అర్థము. మనము ఏమనుకుంటున్నామంటే - పూజలు చేస్తే, యాత్రలు చేస్తే, పుస్తకాలు చదివితే మనమంటే భగవంతుడు ఇష్టపడతాడనుకుంటాం. అది కాదు. ఇక్కడ మమకారం లేనివాడంటే నాకిష్టం, అహంకారం లేనివాడంటే నాకిష్టం అని భగవంతుడు చెపుతున్నాడు.

మమకారం అంటే నాది, అహంకారమంటే నేను. ఈ "నేను" ఉన్నచోట "నాది" కూడా ఉంటుంది. ఈ అహంకారమే జీవుడు. అహంకారం లేకపోతే శరీరమే లేదు, జీవుడూ లేడు, లోకమూ లేదు, దేవుడూ లేడు. ఈ "నేను", "నాది" ఎవడికైతే

పోతాయో వాడంటే నాకు ఇష్టం అంటున్నాడు. మనమంద రమూ అనే "నేను" అహంకారము. కానీ, గీతలో కృష్ణుడు అనే "నేను" ఆత్మ.

**సమ దుఃఖ సుఖః** - జీవితంలో ఒకసారి దుఃఖం రావచ్చును. ఒకసారి సుఖము రావచ్చును. దుఃఖం వస్తే కృంగిపోకుండా, సుఖం వస్తే పొంగిపోకుండా రెండింటినీ సమానంగా చూసుకునే వాడంటే నాకు ఇష్టం అని చెపుతున్నాడు.

సర్వసాధారణంగా మనం అనుకున్న కోరికలు నెరవేరకపోతే మనకు దుఃఖం వస్తుంది. అలా దుఃఖ పడేవాడంటే నాకు ప్రీతి పుట్టదు అని చెపుతున్నాడు. కానీ, ఈ భక్తులు ఏమనుకుంటున్నా రంటే - అనుకున్న పనులన్నీ గనుక అయిపోతుంటే భగవంతుని దయ మన మీద ఉందను కుంటారు. కానీ అది కాదు ఇక్కడ - నీవు అనుకున్న పని అయినా, అవ్వకపోయినా సమానంగా ఉండేవాడంటేనే తనకు ఇష్టమని చెపుతున్నాడు వాసుదేవుడు.

సోదరమహాశయులారా! మనం పని చేస్తున్నందుకు దుఃఖం రావడం లేదు - ఫలితాన్ని ఆశించడం వల్ల దుఃఖం వస్తుంది. అందుచేత పని చేయాలి - ఫలితాన్ని మర్చిపోవాలి. ఒకవేళ మీరు మరచిపోతే ఫలితం రాదేమోనని ఖంగారు పడకండి - మీరు మర్చిపోయినా ఫలితం వస్తుంది. మీరు పాలకొల్లు వెళ్ళడానికి కారు ఎక్కి కూర్చున్న తరువాత, మీరు

మర్చిపోయినా ఆ కారు మిమ్మల్ని పాలకొల్లు తీసుకువెళ్ళి దింపుతుంది - అంతేగాని పాలకొల్లు ఎప్పుడొస్తుందని మీరు స్మరించుకోనక్కరలేదు.

**క్షమీ:-** ఓర్పు కలవాడంటే నాకు యిష్టం అని చెపుతు న్నాడు. ఇప్పుడు మనమందరమూ ఓర్పుగానే కూర్చున్నాం గదా? ఓర్పులేని వారు ఎవరు? అయితే మనమందరము ఓర్పుగల వాళ్ళమేనా - కాదు. నీవు అనుకున్నది నెరవేరక పోయినప్పటికీ, ఇంట్లో పరిస్థితులు, ఒంట్లో పరిస్థితులు అనుకూలించచక పోయినప్పటికీ - ఎవడైతే ఓర్పు కలిగి ఉంటున్నాడో వాడికి మాత్రమే ఓర్పు ఉన్నట్లు. అంటే ప్రతికూల పరిస్థితులలో కూడ మన ఓర్పు పోకూడదు. అనుకూల పరిస్థితులలో అందరూ ఓర్పుగానే ఉంటాము. కాని, ఎవరైనా చిన్నమాట అంటే మనము భరించలేము. ఇక భగవద్గీత ఏమి అర్థమౌతుంది మనకు చెప్పండి?

అవతారపురుషులందరిలోనూ ఈ క్షమాగుణం మనకు కనిపిస్తుంది. మనం ఈ లోకంలో సుఖపడాలన్నా, పరలోకంలో సుఖపడాలన్నా ఓర్పు చాలా అవసరం.

**2. సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః**
**మయ్యర్పిత మనోబుద్ధిః యోమద్భక్త స్సమేప్రియః**

**సంతుష్టస్సతతం** :- ఎల్లప్పుడు సంతోషంగా ఉండమం టున్నాడు. తృప్తిగా ఉండమంటున్నాడు. అమావాస్యరోజున ఒకలాగ, పౌర్ణమి రోజున ఒకలాగ కాకుండా ఎల్లప్పుడు

సంతోషంగా ఉండేవాడంటే తనకు ఇష్టమని చెపుతున్నాడు వాసుదేవస్వామి.

ఎల్లప్పుడూ సంతోషం చాలా అవసరం. సంతోషం గనుక లేకపోతే, నిరంతరము దుఃఖముతో కృంగిపోతుంటే - మనిషిలోని ప్రాణ శక్తి ఎక్కువగా ఖర్చవుతుంది. ప్రాణశక్తిని నియమించినవాడికి గాని జ్ఞానం వైపు దారి కనిపించదు.

**యోగి** :- యోగము కలవాడు యోగి. ఎవడైతే అణిగిన స్వభావము కలిగి ఉంటాడో, ఎవరైతే నిరంతరమూ ఆత్మను మననం చేస్తూ ఉంటాడో వాడు యోగి. అటువంటి యోగము కలవాడంటే తనకు ఇష్టమని చెపుతున్నాడు.

స్వభావము అంటే ఏమిటి? మనలోని ప్రకృతి వాసనలే స్వభావము. స్వభావము అణగకపోతే జ్ఞానము రాదు. యోగి అయినవాడికి స్వభావం అణిగి ఉంటుంది. ఎందుచేత యోగి స్వభావం అణిగి ఉంటుంది? - యోగి నిరంతరము ఆత్మనే స్మరిస్తాడు కాబట్టి!

**యదాత్మా** :- అంటే తన మనస్సును తాను స్వాధీనం చేసుకున్నవాడు. తన మనస్సును గాలికి విడిచి పెట్టకుండా - ఎవడైతే అభ్యాసం వల్ల, వైరాగ్యం వల్ల తన మనస్సును స్వాధీనంలోకి తెచ్చుకుంటున్నాడో వాడంటే నాకిష్టం అని చెపుతున్నాడు.

మీకు ఎన్ని ఎకరాలున్నాయి? బ్యాంకు అక్కౌంటులో ఎంత ఉంది అని అడగడం లేదు భగవంతుడు - మీ మనస్సు

మీ స్వాధీనంలో ఉందా? మీ మనస్సు గనుక మీ స్వాధీనములో ఉంటే - మీరంటే నాకిష్టం అంటున్నాడు.

**ధృఢనిశ్చయం** :- భగవంతుడు 'ఉన్నాడా - లేడా' అని అనుమానం పెట్టుకోకుండా భగవంతుని అస్థిత్వం పట్ల నిండు మనసుతో విశ్వసించు. ఈ లోకాన్ని నడిపేవాడు ఒకడు ఉన్నాడు, ఈ జీవుల్ని నడిపించేవాడు ఒకడున్నాడు, ఈ ప్రపంచాన్ని నడిపేవాడు ఒకడున్నాడు - అని ఆ కర్తయందు పరిపూర్ణ విశ్వాసం పెట్టుకొని ధృఢనిశ్చయము కలిగి ఉండమంటున్నాడు వాసుదేవస్వామి.

మనలో కొంతమందికి అనుమానం వస్తూంటుంది - భగవంతుడు "ఉన్నాడా, లేడా" అని! దానికి కారణం మనలోపల ఉన్న పాపమే! మన విశ్వాసం గనుక చలిస్తుంటే మనలో పాపం ఉన్నట్లే. "ఒకమనిషి ఎంతటి దుర్మార్గుడు అయినప్పటికి, వాడిలో ఎన్ని లోపాలు, పాపాలు ఉన్నప్పటికి - తన ఉనికి పట్ల విశ్వాసం ఉన్నవాడిని ఉద్ధరించి తీరతాను" అని చెప్పాడు స్వామి గీతలో.

"నీ శ్వాస పోతున్నా విశ్వాసం పోనీయకు" అన్నాడు జీసస్. సోదరమహాశయులారా! మన అరటిపళ్ళు, పూవులు కాదండి భగవంతుడికి కావలసినది - భగవంతుని పట్ల పరిపూర్ణ విశ్వాసం ఉంటే చాలు - మనం తరిస్తాము.

**మయ్యర్పిత మనోబుద్ధి** :- నీ మనస్సును, బుద్ధిని నాకు అర్పించు అంటున్నాడు స్వామి. ఆయనకి అర్పిస్తే మన మనస్సును, బుద్ధిని ఆయన మరమ్మతు చేస్తాడన్నమాట! కాని

మనస్సును, బుద్ధిని ఎవరికి అర్పించాం? ఆయనకి కాదు! లోకానికి అర్పించాము. అలా కాదు - ఆయనకు అర్పిస్తే - నిరంతర భగవన్నామ స్మరణ వల్ల మన మనస్సుకు పవిత్రత కలుగుతుంది.

సోదరమహాశయులారా! చదువు లేనివాడు దేవున్ని దర్శించవచ్చు, ధనం లేనివాడు దేవున్ని దర్శించవచ్చు - కానీ, పవిత్రత లేనివాడు దేవున్ని దర్శించలేడు. శ్రీ రామకృష్ణ పరమహంసగారికి సంతకం పెట్టడం కూడా రాదే! కానీ ఆయన మాటలకు అంతటి శక్తి ఎక్కడ నుంచి వచ్చినది? ఆయన జగద్గురువు ఎలా అయ్యాడు? కేవలం ఆయనలో ఉన్న పవిత్రత వల్లనే!

మీది ఏ కులమనిగానీ, ఏ మతమనిగానీ, ఏ దేశమనిగానీ కాదు ఇక్కడ సమస్య - మీరు ఎంతవరకు పవిత్రులు? మనం పవిత్రులం గనుక అయితే మనము భగవంతుని కోసం ఎదురు చూడనక్కరలేదు - భగవంతుడే మనల్ని వెదుక్కుంటూ వస్తాడు. మనిషి పరమపవిత్రుడై ఉండాలి - ఇది ఆధ్యాత్మిక రహస్యం.

బైబిల్లో ఒక మాట ఉంది "హృదయ శుద్ధి గలవారు ధన్యులు - వారు దేవుని చూచెదరు" అని.

శ్రీ రమణస్వామి తన మనస్సును, బుద్ధిని అరుణాచలేశ్వరుడికి అర్పించారు. ఆయన్ని ఎవరైనా చెడ్డమాట అని, తరువాత "పొరపాటు అయిపోయింది మనస్సులో పెట్టుకోకండి

స్వామీ" అని అంటే - భగవాన్ అనేవారట "నాకు మనస్సెక్కడ ఉంది పెట్టుకోవటానికి" అని. ఆయన మనస్సును అరుణా చలేశ్వరుడికి అర్పించి వేశాక ఏముంది ఇక పెట్టుకోవటానికి? మనకు మల్లే మనస్సు ఉంటే కదా పెట్టుకోవటం? అదీ జ్ఞాని యొక్క అంతస్తు!

**మద్భక్తః** - నాయందు భక్తి కలిగి ఉండమంటున్నాడు. నాయందు నీకు భక్తి ఉంటే - నీవంటే నాకు ఇష్టం, నేను నీకు మోక్షాన్ని ఇస్తాను అంటున్నాడు వాసుదేవస్వామి. మరి మనలో ఎవరైనా భక్తి కలిగి ఉంటున్నామండీ? మీరు బ్యాంకులో దాచుకున్న డబ్బు మీ శరీరం పడిపోయిన తరువాత మీ కూడా రాదు. కానీ భక్తి అనే మీ సంపద మీ శరీరం పడిపోయిన తరువాత కూడా ఇతర లోకాలలోకి, ఇతర దేహాలలోకి మీ వెంట వస్తుంది!

మధ్వాచార్యులవారు ఏమన్నారంటే - "భక్తి అంటే సామాన్యమనుకోకండి - అది పెద్దపులి లాంటిది" అన్నారు. పెద్దపులి దగ్గరకు మేకలు, గొర్రెలు, వెళ్తాయా! అలాగే భక్తి గల వాడి దగ్గరకు విషయాల గొడవలు, అహంకారము గొడవలు, ఇంద్రియాల గొడవలు వెళ్ళవని చెప్పారు.

**3. యస్మాన్నో ద్విజతే లోకో లోకాన్నో ద్విజతే చయః**
**హర్షా మర్షభయోద్వేగైఃముక్తోయ స్సచమే ప్రియః**

**యస్మాన్నో ద్విజతే లోకో లోకాన్నో ద్విజతే చయః** - "ఎవడైతే లోకాన్ని కంగారు పెట్టడో - ఎవడైతే లోకాన్ని చూసి

కంగారుపడడో, ఎవడైతే లోకాన్ని భయపెట్టడో - ఎవడైతే లోకాన్ని చూసి భయపడడో, ఎవడైతే లోకాన్ని క్షోభ పెట్టడో - ఎవడైతే లోకాన్ని చూసి క్షోభ పడడో, ఎవడైతే లోకానికి కీడు చేయడో - ఎవడైతే లోకం చేత కీడు చేయబడడో వాడంటే నాకు ఇష్టం అర్జునా!" అంటున్నాడు వాసుదేవస్వామి.

కొంతమంది అంటూ ఉంటారు - "ఈ ఊళ్ళో నాపేరు చెపితే హడల్" అని, అటువంటి వాళ్ళంటే ఇష్టమని భగవంతుడు చెప్పడం లేదు - అటువంటి వాళ్ళని కోతకోసి రోత చూపి స్తానంటున్నాడు. మరి కొంతమంది ఓట్ల కోసము జనాన్ని ఆవేశపెడతారు. ఆవేశపెడితేనే కానీ వాళ్ళకి ఓట్లు రావు. భగవంతుడు ఏమంటున్నాడంటే - "నీకు చేతనైతే వాళ్ళకి జ్ఞానం కలిగేటట్లు చేయిగానీ, ఆవేశపెట్టవద్దు" అంటున్నాడు.

సోదరమహాశయులారా! ఎదుటి వారికళ్ళతోటి మిమ్మల్ని మీరు చూసుకోవద్దు. ఎదుటివారి కళ్ళతో మిమ్మల్ని మీరు చూసుకోవటం - అది బానిసత్వం. ఎదుటివారి కళ్ళతో మిమ్మల్ని మీరు చూసుకుంటున్నంతకాలం మీరు ఎంతమంచి పని చేసినప్పటికీ, ఎంతటి పుణ్య కార్యం మీరు చేసినప్పటికీ మీకు జ్ఞానం కలుగదు. ఎదుటివారి కళ్ళతోటి మిమ్మల్ని మీరు చూసుకుంటే - మీకు ఆత్మవిశ్వాసం లేనట్లే, ఆత్మవిశ్వాసం లేనివాడికి ఆత్మ తెలియబడదు.

**హర్షం** :- సంతోషం వస్తే పొంగిపోవద్దు అంటున్నాడు.

కొంతమంది పది బస్తాలు పండితే ఏడుస్తారు - అరవై బస్తాలు పండితే వీధికెక్కి గంతులు వేస్తారు, అది యిముడ్చుకోలేరు. భగవంతుడు ఏమంటున్నాడంటే - "అరవై బస్తాలు పండిన రోజున గంతులు వేయకు - పది బస్తాలే పండిన రోజున ఇంట్లో కూర్చుని ఏడ్వవద్దు" అంటున్నాడు.

**అమర్షం** :- అంటే ఓర్వలేనితనం. ఎదుటివారు అభివృద్ధిలోనికి వస్తుంటే కొంతమంది ఓర్వలేరు. అటువంటి ఓర్వలేనితనం నీలో గనుక ఉంటే - అందులో నుంచి విడుదల పొందు అంటున్నాడు.

సోదరమహాశయులారా! ఓర్వలేనితనం కూడా ఒక జబ్బే! కేన్సర్ జబ్బు మీ శరీరానికి ఎటువంటిదో - ఓర్వలేనితనం మీ మనస్సుకు అటువంటి జబ్బు. మీ శరీర రోగానికి మందు ఎలా పుచ్చుకుంటున్నారో - అలాగే మీలోని ఓర్వలేనితనం అనే జబ్బుకు "పెద్దలకు సేవ చేసి, గురువుకు సేవ చేసి, భగవంతుడికి సేవ చేసి, సత్పురుషుల యొక్క సహకారముతో ఆ జబ్బులో నుంచి బయటపడండి". మీ శరీరానికి ఉన్న జబ్బు వల్లకాటిలోనే కాలిపోతుంది - కానీ మీ మనస్సుకున్న జబ్బు వల్లకాటిలో కాలదు - అది మరుజన్మకు కూడా మీ వెంట వస్తుంది.

**భయం** :- భయం పనికిరాదు అంటున్నాడు. ఎందుచేత? భగవంతుణ్ణి తెలుసుకోవటానికి భయం అడ్డు వస్తుంది. కాబట్టి మీలో భయం ఉంటే దాన్ని విడిచిపెట్టమంటున్నాడు.

సోదరమహాశయులారా! ఈ లోకంలోని మనుషు లందరికి భయం ఉంది. "ఈ శరీరము ఎక్కడ పోతుందో? ఈ శరీరం లేకపోతే భోగాన్ని ఎవడు అనుభవిస్తాడు?" అని. అందుకే చావంటే అందరికీ భయమే! భయముంది కాబట్టే మీరు భగవంతుణ్ణి తెలుసుకోలేకపోతున్నారు. భయం ఉన్నంత కాలం దుఃఖం విడిచిపెట్టదు. మీరు దుఃఖంలో నుంచి బయట పడటం కోసమైనా భయాన్ని విడిచిపెట్టండి

**ఉద్వేగం:-** అంటే ఆవేశం విడిచిపెట్టమంటున్నాడు. అది కూడా మనస్సు యొక్క వికారమే. దానివల్ల నీ మనస్సుకు క్షోభ కలుగుతుంది. కాబట్టి భగవంతుడు విడిచిపెట్టమని చెబుతున్నాడు. ఈ గుణాలు విడిచిపెట్టినవాడంటే తనకు ఇష్టమంటున్నాడు.

కొంతమంది జీవితంలో తొందరగా ఆవేశానికి గురి అవుతూంటారు. ఎమోషన్ డివోషన్ కాదు. ఎమోషన్ వల్ల "మనిషి జ్ఞానానికి దూరమవుతాడు. ఆలోచనకి దూరమవు తాడు". జీవితంలో కావలసినది ఆలోచనే గాని ఆవేశం కాదు. జీవితములో ఆలోచన ముఖ్యము. అందుచేత జీవితములో ఆవేశము పనికిరాదు.

సోదరమహాశయులారా! దేహాలు మారినప్పటికీ, లోకాలు మారినప్పటికీ, మీ గుణాలు మాత్రం మీ కూడానే ప్రయాణం చేస్తాయి. రక్తమాంసాలతో కూడిన ఈ స్థూలశరీరం ఎలా ఉందో - గుణాలతో కూడిన సూక్ష్మశరీరం ఒకటి మీ

లోపల ఉంది. మీరు నిదురించే టైములో ఈ సూక్ష్మ శరీరం వెళ్ళి, కారణ శరీరంతో కలిసి హృదయములో విశ్రాంతి తీసుకుంటుంది. ఒకవేళ నిద్రటైములో కూడా మీ సూక్ష్మశరీరం వెళ్ళి కారణశరీరంతో కలవకపోతే - అప్పుడు కలలు వస్తాయి.

చాలామంది అడుగుతూంటారు "దేవుణ్ణి ఉంటే చూపించండి" అని, మీరు రాత్రి నిద్రపోయేటప్పుడు మీకు కలలో కన్పించిన మనిషిని నాకు చూపించగలరా? మీరు చూపించలేరు. కానీ, నిద్రలో మీకు ఆ మనిషి కనిపించిన మాట నిజమా - అబద్ధమా? మీరు చూసినమాట నిజమే! అదే విధంగా, ఏ రామకృష్ణ పరమహంసో, రమణమహర్షి లాంటి వారో దేవుణ్ణి చూసినప్పటికీ - మనకు ఎలా చూపించగలరు? కానీ, ఆ దేవుని దగ్గరకు మీరు వెళ్ళటానికి వారు సహకారం చేయగలరు.

**4. అనపేక్షః శ్శుచిర్దక్షః ఉదాసీనో గతవ్యధః**
**సర్వారంభ పరిత్యాగీ యోమద్భక్త స్సమే ప్రియః**

**అనపేక్ష** :- అంటే ఆపేక్షలేనివాడు. తన దేహ అవసరాలలో గాని, ఇంద్రియాల అవసరాలలో గాని, మనస్సు యొక్క అవసరాలలో గాని, ఎవడికైతే ఆపేక్ష లేదో - వాడు అనపేక్షుడు. వాడు జీవుడు కాదు - దేవుడు.

సోదరమహాశయులారా! మనవేమనుకుంటున్నా మంటే - "మన దేహం గొడవలు మనం చూసుకోకపోతే

ఎలాగ?" అని! మనదేహం గోడవలు మనం చూసుకోకపోతే - ఆ దేహాన్ని ఈశ్వరుడు తన సొంతం చేసుకుంటాడు. అప్పుడు అది దేహం కాదు - దేవాలయమే అవుతుంది.

శ్రీ రమణస్వామి శరీరాన్ని మనము ఎందుకు పూజిస్తున్నాము? రామకృష్ణ పరమహంస గారి శరీరాన్ని ఎందుకు పూజిస్తున్నాము? రాముడి శరీరాన్ని ఎందుకు పూజిస్తున్నాము? కృష్ణుడి శరీరాన్ని ఎందుకు పూజిస్తున్నాము? అవి దేహాలు కాదు - దేవాలయాలు. వాళ్ళ దేహాల మీద వాళ్ళు ఆపేక్ష విడిచి పెట్టుకున్నారు కాబట్టే - వాళ్ళ దేహాలు దేవాలయాలు అయినాయి. మన శరీరాల మీద మనకు ఆపేక్ష ఉంది కాబట్టే - మన శరీరాలు శవాలు అవుతున్నాయి. జ్ఞానిది శివదృష్టి - అజ్ఞానిది శవదృష్టి.

**శ్శుచిః** - అంటే శుభ్రత! కొంతమంది చాలా శుచిగా ఉంటారు - ఇల్లు శుచిగా ఉంచుకుంటారు. ఒళ్ళు శుచిగా ఉంచుకుంటారు. భగవంతుడు ఏమంటున్నాడంటే "బాహ్య శుచీ కావాలి - లోపలి శుచీ కావాలి" అంటున్నాడు. కుండను బయటా కడగమంటున్నాడు - లోపలా కడగమంటున్నాడు. నీ ఇంటిని చీపురుకట్ట పెట్టి ఎలా దులుపుకుంటున్నావో, నీ శరీరాన్ని సబ్బు పెట్టి ఎలా శుభ్రపరచుకుంటున్నావో - అదే విధముగా నీ మనస్సులో ఉన్న "రాగద్వేషాలు, కామక్రోధాలు" అనే మురికిని భక్తి అనే గంగతో కడుగమంటున్నాడు. నీ శరీరానికి సబ్బు ఎలా అవసరమో - నీ మనస్సు శుభ్రపడటానికి

స్తోత్రమ్ అవసరము, జపం అవసరము, ధ్యానము అవసరం, సత్పురుషుల సహవాసం అవసరము, సద్గ్రంథ పఠనం అవసరము.

**దక్ష** :- అంటే దక్షత కలిగి ఉండమంటున్నాడు. ఏ పని చేసినా సమగ్రంగా చేయమంటున్నాడు. మనకు భగవంతుడు ఏ పనయితే అప్పగించాడో - ఆ పనిని సమగ్రంగా, శుచిగా, శ్రద్ధగా, సమర్థవంతంగా, నిండు మనస్సుతో, రాగద్వేషాలు లేకుండా చేయమంటున్నాడు.

ఒక జిల్లా కలెక్టరు తన డ్యూటీని బాగా చేయకుండా ఉండి - ఒకడు మనం తిని పారవేసిన ఎంగిలి ఆకుల్ని శుభ్రంగా తీస్తాడనుకోండి - ఆ ఎంగిలి ఆకులు తీసినవాడంటేనే భగవంతుడు ఇష్టపడతాడు. మనం ఏ పని చేస్తున్నామన్నది చూడడు భగవంతుడు - చేస్తున్న పనిని ఎంత శ్రద్ధగా, దక్షతతో చేస్తున్నామో అది చూస్తాడు.

సోదరమహాశయులారా! అజ్ఞాని దృష్టిలో ఎక్కువ వాడని - తక్కువ వాడని ఉంటుంది గానీ, ఆత్మదృష్టిలో ఎక్కువాలేదు - తక్కువాలేదు. సమస్త జీవకోటిని ఆత్మే సృష్టిస్తున్నప్పుడు ఎక్కువ ఏమిటి? తక్కువ ఏమిటి? ఉన్నది ఒక్కటే - అది ఆత్మ.

**ఉదాసీన** :- అంటే పక్షపాతం లేకుండా అందరి జీవుల పట్ల సమానంగా ఉండమంటున్నాడు. ఎందుచేతనంటే శరీరానికి పక్షవాతం వస్తే ఎలా పనిచేయదో అదే విధంగా

మన బుద్ధిలో పక్షపాతం ఉంటే అది సరిగా ఆలోచించలేదు. అందుచేత పక్షపాతం నుంచి బయటపడమంటున్నాడు. నీకు ఎవరైనా అపకారం చేసినా, ఉపకారం చేసినా ఉదాసీనంగా ఉండమంటున్నాడు.

**గతవ్యధ** :- సర్వసాధారణంగా మన మనస్సులలో బెంగ పెట్టుకుంటూ ఉంటాము. అలా బెంగ పెట్టుకోవద్దు, నీ మనస్సను క్షోభ పెట్టుకోవద్దు, నీవు దుఃఖ పడవద్దు అంటున్నాడు వాసుదేవుడు.

**సర్వారంభ పరిత్యాగి** :- అన్ని కర్మలనీ విడిచి పెట్టమంటున్నాడు. “ఇదేమిటండీ? అన్ని పనుల్ని విడిచిపెట్టేస్తే ఎలాగ?” అంటే సకామకర్మలను అన్నింటినీ విడిచి పెట్టమంటున్నాడు. సకామకర్మ అంటే ఏమిటి? మనం ఫలితాన్ని కోరి పనిచేస్తాం చూడండి - ఆ పనులన్నింటిని విడిచిపెట్టమంటున్నాడు. మనం కోరికతో చేస్తాము చూడండి - ఆ పనులన్నింటినీ విడిచి పెట్టమంటున్నాడు. మన ఇంద్రియాల్ని సంతృప్తి పరచటం కోసం చేస్తాము చూడండీ - ఆ పనులన్నింటినీ విడిచి పెట్టమంటున్నాడు. మన అహంకారం ఉబ్బటం కోసం చేస్తాము చూడండి - అటువంటి పనులన్నింటినీ విడిచిపెట్టమంటున్నాడు.

సోదరమహాశయులారా! కాని మనం ఏ పని చేసినా కోరికతోనే చేస్తున్నాము. “మన స్వార్థం కోసం, మన కామం కోసం, మన ఇంద్రియాల్ని సంతృప్తి పరచటం కోసం, మన గొప్పల కోసం” మనం ఫలితాల్ని ఆశించే నిరంతర కర్మ చేస్తున్నాము. వీటివల్ల

నీచమైన జన్మలు, నీచమైన శరీరాలు, నీచమైన లోకాలు - మన కోసం ఎదురు చూస్తుంటాయి. చివరికి మనల్ని భ్రష్టుల్ని చేసే వరకూ ఈ కామ్యకర్మలు విడిచి పెట్టవు. నా మాటల్ని మీరు నమ్మితే సొమ్ము - నమ్మకపోతే దుమ్ము.

**మద్భక్తః** - ఎవడైతే నాకు భక్తుడుగా ఉంటున్నాడో, నన్ను ప్రేమిస్తున్నాడో వాడంటే నాకిష్టం అంటున్నాడు.

"నన్ను ప్రేమించండీ, నన్ను ప్రేమించండీ" అని మన ప్రాణం తీసేస్తున్నాడే భగవంతుడు. ఆయన్ని ఎందుకు ప్రేమించాలి? ఆయన్ని ప్రేమించడం వల్ల మనకు లాభం ఏమిటి?

"మనకున్న అజ్ఞానం నుంచి బయటపడటం కోసం, మన బలహీనతల నుంచి, మనకున్న లోపాలనుంచి, పాపాల నుంచి దూరం అవటం కోసం" భగవంతుడు తనని ప్రేమించ మంటున్నాడు. అంతేగాని ఆయన్ని ప్రేమించటం వల్ల ఆయనకి వచ్చే లాభం ఏమీ లేదు.

పని చేయటం వల్ల జ్ఞానికి వచ్చే లాభము లేదు - పనిని విడిచిపెట్టటం వల్ల జ్ఞానికి వచ్చే నష్టమూ లేదు. లాభనష్టాలతో జ్ఞానికే సంబంధం లేనప్పుడు - భగవంతుడికి సంబంధం ఏముంటుంది? "ఈ మూడులోకాలలో నేను పొందవలసిన వస్తువు ఒక్కటీ లేదు - కాని నేను పనిచేస్తూనే ఉన్నాను" అన్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. అలాగే మనల్ని కూడా పనిచేయమని చెపుతున్నాడు - కాని, ఫలితాన్ని ఆశించవద్దు అంటున్నాడు.

5. యోనహృష్యతి నద్వేష్టి నశోచతి నకాంక్షతి
శుభాశుభ పరిత్యాగీ భక్తి మాన్ యస్సమే ప్రియః

**యోనహృష్యతి**:- ఏ విషయంలోను సంతోష పడవద్దు అంటున్నాడు. మీ దేహ ప్రారబ్ధాన్ని బట్టి మీరు ఏదైనా చిన్నపని చేసినప్పటికీ పెద్ద ఫలితం రావచ్చును - అయినప్పటికీ సంతోష పడకండీ! అదికూడా ఒక వికారమే అంటున్నాడు.

అంటే అనుకోకుండా మీకు ఏ లాటరీ టిక్కెట్టో తగిలిందనుకోండి, సంతోష పడవద్దు అంటున్నాడు. లాటరీ రాకముందు మీ మనస్సు ఎలా ఉందో వచ్చాక కూడా అలాగే ఉండమంటున్నాడు.

**నద్వేష్టి** :- ఎవ్వరినీ ద్వేషించవద్దు అంటున్నాడు. సంతోషం ఏ విధంగా అయితే మనస్సు యొక్క వికారమో - ద్వేషం కూడా మనస్సు యొక్క వికారమే. మీకు ఎవరైనా ఇష్టంలేని పని, నష్టం వచ్చే పని చేసినప్పటికీ వారిని ద్వేషించవద్దు అంటున్నాడు.

**నశోచతి** :- మీరు దేని గురించి దుఃఖపడవద్దు అంటున్నాడు. జీవితములో ఏది జరిగినా అంతా ఈశ్వర సంకల్పం ప్రకారమే జరుగుతుంది. "మీరు దుఃఖపడితే మీ మనస్సు, శరీరము పాడవుతాయి". మీరు మోక్షం సంపాదించు కోవటం కోసం ఈ రెండూ పనిముట్లు - వీటిని జాగ్రత్తగా చూసుకోమంటున్నాడు.

"మీకెప్పుడైనా కష్టం వచ్చినప్పుడు దుఃఖం వస్తుందా?" అని స్వామి వివేకానందను ఒకసారి అడిగితే "దుఃఖం వస్తుంది, దున్నపోతు మీద ఈగ వాలినట్లుగా" అన్నాడు.

**నకాంక్షతి** :- ఏమీ కోరవద్దు అంటున్నాడు. మీరేమనుకుంటున్నారంటే - "కోరకపోతే ఎలాగండీ, పనులు ఎలా జరుగుతాయి?" అనుకుంటున్నారు. శక్తి మీలోని ఈశ్వరునిది గాని - మీ కోరికకు శక్తిలేదు. "డిజైర్ డజ్ నాట్ గివ్ యు స్ట్రెంత్ (desire does not give you strength)". ఈ జీవులను ఈశ్వరుడు వారి వారి ప్రారబ్ధములను అనుసరించి ఆడిస్తూ ఉంటాడు - ఇదంతా ఒక లీల!

**శుభా శుభ పరిత్యాగి**:- శుభాశుభాలను విడిచిపెట్ట మంటున్నాడు. మనం అనుకున్నది నెరవేరితే శుభం అను కుంటున్నాము - మనం అనుకున్నట్లు జరగకుండా ఏదైనా నష్టం వస్తే అది అశుభం అనుకుంటాము. భగవంతుడు ఏమంటున్నాడంటే -"శుభం ఏమిటయ్యా, అశుభం ఏమిటయ్యా - అవి రెండూ సంకెళ్ళే. బంధించడానికి బంగారపు సంకెళ్ళ యినా, ఇనుప సంకెళ్ళయినా ఒకటేగా అంటున్నాడు. ఈ శుభాశుభాలను ఎవడైతే విడిచిపెడుతున్నాడో వాడంటే తనకు ఇష్టం అంటున్నాడు.

**భక్తిమాన్** :- ఎవడైతే తనపట్ల భక్తి కలిగి ఉంటున్నాడో అటువంటివాడంటే తనకు ఇష్టమంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి.

**6. సమశ్శత్రౌచ మిత్రేచ తథా మానావ మానయోః
శీతోష్ణ సుఖ దుఃఖేషు సమస్సంగ వివర్జితః**

శత్రువుని - మిత్రుడిని సమానంగా చూసు కుంటూ, గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా సమానంగా ఉంటూ, శీతాకాలం ఒకలాగా, వేసవికాలం ఒకలాగా, సుఖం వస్తే ఒకలాగా, దుఃఖం వస్తే ఒకలాగా ఉండకుండా సమంగా - దేనియందు ఆసక్తి పెట్టుకోకుండా ఉండమంటున్నాడు. ఆసక్తి ఉన్న మనిషి ఏ పనినీ సరిగా చేయలేడు. అందుచేత ఆసక్తి పనికిరాదు అంటున్నాడు.

ఒకసారిశ్రీ రమణ మహర్షి గారిని పొగుడుతూ ఒక భక్తుడు పంచరత్నాలు అనే పద్యాలు వ్రాసుకువచ్చి చదివాడు. శ్రీ రమణస్వామి వాటిని విని "నేను గొప్పవాడిననే కదా మీరు వ్రాసారు - నేను గొప్పవాడినైతే మీకు ఏమి కలిసివస్తుంది? - ముందు మీరు బాగుపడండి - మీ స్వరూపం మీరు తెలుసు కోండి - మీ స్వరూపం మీరు తెలుసుకుంటే మీరూ నా అంతటి వారు అవుతారు" అన్నారట! నిజం చెప్పాలంటే బుద్ధిమంతుడికి పొగడ్త కూడా నిందగానే ఉంటుంది. కానీ ఇప్పుడు మన నాయకులని పొగడకపోతే పనులే కావడం లేదు - ఇది ఈనాటి దుస్థితి.

**7. తుల్యనిందా స్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్
అనికేతః స్థిరమతిః భక్తి మాన్ మే ప్రియోనరః**

**తుల్యనిందా స్తుతి** :- "ఎవడైతే నిందను, పొగడ్తను

ఒకలాగే స్వీకరిస్తాడో" వాడంటే నాకిష్టం అంటున్నాడు. ఒకసారి గౌతమ బుద్ధుణ్ణి బంధువు ఒకడు కోపం వచ్చి నానాతిట్లు తిడతాడు. బుద్ధుడు ప్రశాంతంగా వింటాడు. తిట్టటం పూర్తి అయిన తరువాత "నీవు తిట్టటం పూర్తయ్యిందా? నీవు ఒక పండును నా చేతికి ఇస్తావనుకో - నేనా పండును స్వీకరించకపోతే ఆ పండు ఎవరికి వస్తుంది?" అన్నాడు. "నాకే వస్తుంది" అన్నాడా బంధువు. "అలాగే నీవు తిట్టిన తిట్లు నేను ఒకటి కూడా స్వీకరించటం లేదు - కాబట్టి అవన్నీ నీకే తిరిగి వస్తున్నాయి" అన్నాడు. మనకు ఒకచోటు నుంచి ఒక ఉత్తరం వచ్చిందనుకోండి - ఆ ఉత్తరాన్ని మనము తీసుకొనకపోతే ఏమవుతుంది? - తిరిగి ఆ వచ్చిన చోటుకే వెళ్ళిపోతుంది. అదే విధముగా మిమ్మల్ని ఎవరైనా దూషించినప్పటికీ మీరూ ఓర్పుగా భరిస్తే -అవి వాడికే తిరిగి వెళ్ళిపోతాయి. కానీ ఈ లోకంలోని పెద్ద బలహీనత ఏమిటంటే - అందరికీ పొగడ్తలు కావాలి. ఎవడైతే పొగిడించుకోబడుతున్నాడో వాడు తన మూలంలో పాడైపోతాడు.

**మౌని** :- మౌనం కలవాడు అంటే తనకు ఇష్టమంటు న్నాడు. మాటలు వెండి అయితే మౌనం బంగారం.

**సంతుష్టోయేనకేనచిత్** :- ఎవడైతే తనకు దొరికిన దానితో సంతుష్టి పడతాడో - వాడన్నా నాకిష్టమంటున్నాడు భగవంతుడు.

**అనికేతః** :- ఒక స్థలం మీద ఇష్టాయిష్టాలు పెట్టుకోకుండా

- స్థిరమైన నివాసం అంటూ లేనివాడంటే తనకిష్టమంటున్నాడు.

**స్థిరమతిః** :- ఎవడికైతే నిశ్చయమైన బుద్ధి, నిర్మలమైన బుద్ధి, ఏకాగ్రమైన బుద్ధి ఉందో - వాడంటే నాకిష్టమంటున్నాడు. అటువంటి ఏకాగ్రబుద్ధి గలవాడికి మాత్రమే ఈశ్వరుడు దర్శనమిస్తాడు.

**భక్తిమాన్ మే ప్రియో నరః** :- ఓ అర్జునా! ఎవనికైతే నాపట్ల అటువంటి భక్తి ఉందో - వాడంటే నాకు ఇష్టం అంటున్నాడు.

**8. యేతు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే**
**శ్రద్ధ ధానా మత్పరమా భక్తాస్తేతీవ మే ప్రియాః**

ఓ అర్జునా! ఇప్పటివరకూ మనము చెప్పుకున్న ఈ మాటలు అమృతముతో సమానము - ఎందుచేతనంటే మనం చెప్పుకున్న మాటలు ధర్మం. ఎవడైతే నన్నే పరమగతిగా నమ్మి శ్రద్ధతో నేను చెప్పిన ప్రకారం ఈ ధర్మాన్ని ఆచరిస్తాడో, ఉపాసిస్తాడో - వాడంటే నాకు మిక్కిలి ఇష్టం అంటున్నాడు వాసుదేవస్వామి. మామూలు ఇష్టం కాదు - మిక్కిలి ఇష్టం అంటున్నాడు.

సోదరమహాశయులారా!ఈ మాటలు మామూలు మాటలు కావు అంటున్నాడు భగవంతుడు. ఇవి అమృతం! ఎందుచేత అమృతం? ఈ ధర్మాన్ని గనుక మనం ఆచరిస్తే అవి అమృత స్వరూపమైన ఆత్మ దగ్గరకు మనల్ని తీసుకు

పోతాయి. కాబట్టి అమృతం! మీ దేహప్రారబ్ధాన్ని బట్టి ఈశ్వరుడు మిమ్మల్ని ఎటువంటి క్లిష్టపరిస్థితులలో పెట్టినప్పటికీ మీరు ఎదురుతిరగకుండా, ఈశ్వరునిపట్ల శరణాగతి వీడకుండా "ఈ దేహాన్ని, ఈ మనస్సును, ఈ ఇంద్రియాలను పనిముట్లులాగా నీవు ఎలా ఉపయోగించుకుంటావో అది నీ ఇష్టం - నీ ఇష్టమే నెరవేరుగాక!" అని ఎవడైతే భగవంతుణ్ణి పూర్తి శరణాగతి పొందుతాడో వాడంటే నాకు చాలా ఇష్టం అంటున్నాడు వాసుదేవుడు.

ఈ మాటలను మీ హృదయాలకు పట్టించుకోరా? ఈరోజు న్యూస్ పేపర్, రేపు వేస్ట్ పేపర్. ఆ వేస్ట్ పేపరుకు ఇచ్చిన విలువ కూడా భగవంతుని మాటలకు ఇవ్వరా? మీ ఇరుగుపొరుగు అమ్మలక్కలు చెప్పే మాటలకు ఇచ్చే విలువ కూడా ఈ మాటలకు ఇవ్వరా? భగవంతుడు మీకు బంధువు కాదా? భగవంతుడు మీ స్నేహితుడు కాదా? భగవంతుడు మీ శ్రేయస్సు కోరడా? "భగవంతుడు దూరమని - మీ దేహానికి సంబంధించినవారు దగ్గరని" మీరెందుకనుకుంటున్నారు? నిజం చెప్పాలంటే మీ బంధువులు దూరం, మీ స్నేహితులు దూరం. నిరంతరమూ మన కూడా ఉండేవాడు, మన శ్రేయస్సు కోరేవాడు, జన్మ జన్మలకు మనతో బంధుత్వం, స్నేహం చేయటానికి తగినవాడు భగవంతుడు ఒక్కడే. అటువంటి భగవంతుడు చెప్పే మాటల్ని మీరు నమ్మరా? ఆ మాటల్ని మీరు గౌరవించలేరా? భగవంతుడు చెప్పే మాటల మీద మీకు గౌరవం లేనప్పుడు మీరు ఎలా ఆచరిస్తారు? ఈ రోజున ఉన్న

దేహం రేపు కనబడదే! మరో వంద సంవత్సరాల తర్వాత ఇక్కడ ఉన్న దేహాల్లో ఒక్క దేహం కనిపించదే? ఈవేళ ఉండి రేపు పోయే ఈ దేహానికిచ్చే విలువైన కనీసం మీ మనస్సుకు ఇవ్వరా? "జన్మ వచ్చిన తరువాత జ్ఞానం రాకుండా ఈ శరీరం పడిపోతే ఆ నష్టం ఎంత ఉంటుందో లెక్కకట్టి చెప్పలేను" అన్నాడు యేసుక్రీస్తు. ఈ మాటలు మీ హృదయాలను తాకటం లేదా?

సోదరమహాశయులారా! భగవంతుడు మీకు బుద్ధిని ప్రసాదించాడు - మరి మీ బుద్ధికి పని చెప్పరా? మీ బుద్ధికి పని చెప్పనప్పుడు ఆ బుద్ధి యొక్క ప్రయోజనం ఏమిటి? మీరందరూ కాలేజీలలోనూ, యూనివర్శిటీలలోనూ చదువుతున్నారు - ఇన్ని చదువులు చదివిన మీలో ఎవరికైనా అజ్ఞానం పోయిందా? మీ అనుభవంలో ఉన్న విషయాలను గురించే నేను చెప్తున్నానుగాని, ఎక్కడో పరలోకంలోని విషయాలను గురించి నేను చెప్పటం లేదు "అది నిప్పురా" అన్నారు. అది నిజంగా నిప్పే అయితే చేయి వేస్తే కాలాలి - చేయి వేసినా కాలకపోతే అది నిప్పు ఎలా అవుతుంది? మనం చదివిన చదువు నిజమే గనుక అయితే మనలోని అజ్ఞానం పోవాలి. మనలోని అజ్ఞానం పోనప్పుడు అది విద్య కాదు. ఏ విద్యను నేను తెలుసుకోవటం వల్ల నాలోని అజ్ఞానం పోతుందో అదే విద్య. నా స్వరూపాన్ని ఏదైతే తెలియజేస్తుందో - అదే విద్య. నాలో ఉన్న సుఖాన్ని, శాంతిని ఏదైతే తెలియజేస్తుందో - అదే విద్య. మనం ఎన్ని చదువులు చదివినప్పటికీ మనలో ఉన్న

శాశ్వత వస్తువును, ఆత్మవస్తువును గనుక మనం తెలుసు కోలేకపోతే - మనం చదివిన చదువులన్నీ చివరికి చావుకు ఉపయోగపడతాయి. ప్రతీవాడు చదువుకొని విజ్ఞానవంతుడు అవుదామని లేదు. చదువుకొని భోగం అనుభవిద్దామని! చదువు ఎందుకంటే - ఉద్యోగానికి. ఉద్యోగం ఎందుకంటే - డబ్బు సంపాదించటానికి. డబ్బు దేనికంటే - భోగం అనుభవించ డానికి, ఇదీ నేటి సమాజం యొక్క స్థితి.

సోదరమహాశయులారా! మనం ఉదయం లేచినది మొదలు ఎన్నో పనులు చేస్తున్నాము. కానీ, మన స్వార్థాన్ని విడిచిపెట్టి ఒక్క పనైనా చేసామా? అన్ని పాపాలలోకి స్వార్థాన్ని మించిన పాపం లేదని భగవంతుడు చెప్పాడే! మన స్వార్థాన్ని మర్చిపోయి ఎవరినైనా ప్రేమించామా? మనల్ని మర్చిపోయి ఎదుటివారికి ఎప్పుడైనా సహాయం చేసామా? మనం ఏ పని చేసినా స్వార్థం కోసమేగా? మీరందరూ భగవంతుణ్ణి పూవుల తోటి ఆరాధించడం నేర్చుకున్నారు, స్తోత్రాలతోటి ఆరాధించడం నేర్చుకున్నారు - నేను కాదనటం లేదు. కానీ “స్వార్థం లేకుండా పనిచేసి” - పనితోటి భగవంతుణ్ణి ఆరాధించటం నేర్చుకోండి. స్వార్థం లేకుండా పనిచేసి ఎవడైతే భగవంతుణ్ణి ఆరాధిస్తాడో - వాడికే మోక్షానికి దారి దొరుకుతుంది.

సోదరమహాశయులారా! ఇక్కడి నుంచి కాశీ వెళ్ళాలంటే, అరుణాచలం వెళ్ళాలంటే నాలుగు రోజులు ముందునుంచే అన్నీ సర్దుకుంటాము కదా? మరి ఈ శరీరం వదిలి వెళ్ళేది తిరిగిరాని మహాప్రయాణం కదా? దానికి ఇప్పటినుంచే ఏమీ సర్దుకోరా?

మీరు ఈశ్వరుని ఈశ్వరుని కోసమే ప్రేమించండి. మీరు ఆయన్ని ప్రేమిస్తే మీకు ఏది మంచిదో ఆయనకి తెలుసు - కనుక మీ శ్రేయస్సు ఆయన చూసు కుంటాడు. మిమ్మల్ని సహేతుకంగా ఉండమంటున్నానే గానీ - అహేతుకంగా ఉండమని నేను చెప్పడం లేదు. కానీ, రీజన్ మనిషిని ఎక్కువ దూరం తీసుకువెళ్ళలేదు. మిమ్మల్ని రీజన్ ఎంతదూరం తీసుకువెళ్తుందో - అంత దూరం మీరు రీజన్ సహాయముతో ప్రయాణం చేయండి - నేను వద్దనడం లేదు. కానీ రీజన్ మిమ్మల్ని ఎక్కడైతే విడిచిపెడుతుందో అక్కడ "విశ్వాసం" మీకు సహాయం చేస్తుంది. మీరు రీజన్‌కు ఎంత ప్రాముఖ్యం ఇస్తారో - అంతే ప్రాముఖ్యం విశ్వాసానికి కూడా ఇవ్వండి. మీ విశ్వాసం మిమ్మల్ని తప్పక గమ్యం చేరుస్తుంది. మీరు ప్రతిరోజు భగవద్గీ తను పారాయణం చేయండి. అది మీ మనస్సును నానబెట్టు కోవటానికి పనికి వస్తుంది. "మీ శరీరానికి ముగింపు ఉంది గానీ - మీ జీవితానికి ముగింపు లేదు - మీకు జ్ఞానం కలిగే వరకు". మీ జీవితంలో ప్రతీ సెకనును జ్ఞానం సంపాదించ టానికే మీరు ఖర్చుపెట్టండి - తరించండి.

# చివరి మాట

జరిగే సంఘటనలు అన్నీ మనల్ని మనము సంస్కరించుకోవటానికి ప్రసాదంగా భగవంతుడు మనకు ప్రసాదించిన అవకాశము. నిత్యజీవితంలో మనకు ఎందరో తారసపడుతుంటారు - వారు మిత్రులు కావచ్చు - విరోధులు కావచ్చు! ఆ కలిసినవారు విడిపోకుండా ఎంతసేపు ఉంటారు? వాళ్ళు మరల మన జీవితంలో కలుస్తారనే నమ్మకం కూడా లేదుకదా?

కనుక ఆ కలిసినవాళ్ళు మనతో కలిసి ఉన్నంతసేపు "వాళ్ళు నావాళ్ళు కాబట్టే నన్ను కలిశారు" అని ప్రేమను పంచి చూడండి! అయిష్టంగా మాట్లాడి అశాంతితో కాలిపోయే కంటే - ఇష్టంగా ప్రేమతో మాట్లాడితే మన మనస్సు చల్లబడుతుంది. ప్రయత్నించి చూడండి! పోయేది ఏముంది? మీ మనస్సు ఎంత విశాలమౌతుందో, రాగద్వేష రహితమౌతుందో, ప్రేమతో ప్రశాంతతో నిండిపోతుందో ప్రయత్నించి చూడండి! మీరు అజాత శత్రువులు అవుతారు. ఆనంద స్వరూపులు అవుతారు! ఇది నా అనుభవం! మీరు కూడా ప్రయత్నించి చూడండి! ప్రేమ స్వరూపులు కండి!

మీ సోదరుడు

**డా॥ K. రామారావు**



భక్తులతో మా అనుబంధం
కంటిన్యూ అవుతుంది...

- శ్రీ నాన్నగారు



Last but not least message